# 888

## డిటెక్టివ్ నవల

# కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 49



# నెం 888...
## డిటెక్టివ్ యుగంధర్ పరిశోధన
## కొమ్మూరి సాంబశివరావు రచన



౫౦ సంవత్సరాల క్రిందట వచ్చిన మొట్టమొదటి తెలుగు స్పై నవల

ఈ నవలకున్న కొన్ని ప్రత్యేకతలు

- కేవలం అంకెలతోనే నవలపేరున్న మొట్టమొదటి తెలుగు నవల
- మొదటి ప్రచురణ విడుదలైన మూడో నెలలోనే రెండో ముద్రణకొచ్చిన నవల
- మొత్తం మీద ఎనిమిది ముద్రణలు పొందిన నవల
- ఈ నవల విడుదలైన 20 సంవత్సరాలకు గానీ తెలుగులో స్పై సబ్జెక్టుతో వ్రాసిన నవలలు రాలేదు
- దీని తర్వాత కొమ్మూరి సాంబశివరావు గారు దాదాపు 15 స్పై నవలలు వ్రాశారు. ఇలా అంకెల సిరీస్ తోనే నవలలు కావాలని పాఠకులు సాంబశివరావు గారిని పదే పదే అడుగుతుండేవారు.

ఈ నవల పునర్ముద్రణకి 'కౌముది' కి ప్రత్యేక అనుమతినిచ్చిన కొమ్మూరి వెంకట్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

**సంపాదకుడు**

### 1

"లోపలికి వెళ్ళండి! హోం మంత్రి మీ కోసం కాచుకుని ఉన్నారు" అన్నాడు కార్యదర్శి.

డిటెక్టివ్ యుగంధరూ, అతని అసిస్టెంటు రాజూ దర్వాన్ తెరిచి పట్టుకున్న తలుపులోంచి లోపలకెళ్ళారు.

"రండి! యుగంధర్! కూర్చోండి!" హోం మంత్రి శంకరనారాయణ సిన్హా లేచినిలబడి, యుగంధర్ని ఆహ్వానించి, కరస్పర్శ చేసి, ఆయన కూర్చున్నాక తనూ కూర్చున్నాడు. యుగంధర్, రాజుని హోం మంత్రికి పరిచయం చేశాడు.

శంకరనారాయణ సిన్హా చాలా ఆదుర్దాగా ఉన్నాడు. సిన్హా హోం శాఖ మంత్రిగా వచ్చినప్పటినుంచీ పరిపాలన చాలా బాగున్నదని అందరూ అంగీకరించారు.

"మిస్టర్ యుగంధర్! మన దేశ క్షేమం కాపాడే భారం మీమీద పెడుతున్నాను. మరొక ప్రపంచ యుద్ధం రాకుండా ఆపే బాధ్యత మీమీద ఉంది. ఒక ఘోరమైన పొరపాటు జరిగింది. మీరిప్పుడు మీ శక్తి సామర్థ్యాలు పూర్తిగా వినియోగించి దేశాన్ని రక్షించాలి" అన్నాడు హోంమంత్రి ఉద్రేకంతో.

ఉపన్యాసాలు ఇవ్వడం, పెద్ద పెద్ద మాటలు ఉపయోగించడం మంత్రులకు అలవాటు కనుక, యుగంధర్ నవ్వి "కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానంలో బయలుదేరి వెంటనే ఢిల్లీకి వెళ్ళమని మద్రాసు పోలీస్ కమీషనర్ చెప్పినప్పుడు దేశ క్షేమాన్ని కాపాడే కేసు

నాకు అప్పచెప్పడానికి నన్ను పిలిపిస్తున్నారని అనుకోలేదు. ఏ ఖజానా దొంగతనమో, ఏ ఉద్యోగి లంచగొండితనమో దర్యాప్తు చేయవలసి ఉంటుందనుకున్నాను'' అన్నాడు యుగంధర్.

''మిస్టర్ యుగంధర్! అతి రహస్యమైన కాగితాలు పోయాయి. ఆ కాగితాలు తెస్తున్న అతను మాయమయ్యాడు. ఆ కాగితాలు పరప్రభుత్వం చేతికి చిక్కాయా పర్యవసానాలు చాలా ఘోరంగా ఉంటాయి. అసలే కొన్ని పర ప్రభుత్వాలకు మనదేశం అంటే గిట్టదు. ఏదో ఒక సాకు పెట్టుకుని మనతో కయ్యానికి కాలుదువ్వుతున్న పక్కింటి సోదరులున్నారు. వీరంతా ఆ కాగితాలలోని విషయాలను అపార్థం చేసుకుంటారు. వాటికిలేని నిర్వచనాలు ఇస్తారు. మనదేశం పేరు ప్రతిష్టలు మంటకలిపేందుకు ప్రయత్నిస్తారు. మరొక ప్రపంచ యుద్ధం వస్తుంది. ఈ ఆపదలు ఏవీ కలగకుండా ఉండాలంటే ఎవరికంటా పడకముందే ఆ కాగితాలను తెచ్చియ్యాలి'' అన్నాడు హోంమంత్రి.

''ఆ కాగితాలు ఏమిటో చెబుతారా?'' అడిగాడు యుగంధర్.

''క్షమించాలి యుగంధర్! ఎవరికీ చెప్పడానికి వీలులేదు. ఆ కాగితాలేమిటో తెలుసుకోవటం మీ దర్యాప్తుకి తప్పనిసరి అయినపుడు చెబుతాను'' అన్నాడు హోం మంత్రి.

''పోనీ స్థూలంగా ఆ కాగితాలు దేనికి సంబంధించినవో చెప్పగలరా?''

హోంమంత్రి ఒక నిమిషం ఆలోచించాడు. ''అది ఒక రహస్య ఒడంబడిక పత్రం. మన దేశమూ, మన మిత్రదేశాలు రెండూ కలిసి ఒక ఒప్పందానికి వచ్చాయి. ఆ ఒడంబడిక పత్రం మీద ఆ రెండు దేశాల ప్రతినిధుల సంతకాలు ఉన్నాయి.''

''అవెలా మాయమయ్యాయి?'' అడిగాడు యుగంధర్.

''ఆ ఒడంబడిక న్యూయార్కులో జరిగింది. ఐక్యరాజ్య సమితి సమావేశానికి వెళ్ళిన రెండు మిత్రరాజ్యాల ప్రతినిధులకూ, మన ప్రతినిధికీ మధ్య జరిగిందా ఒడంబడిక. మన ప్రతినిధీ, ఆ రెండు దేశాల ప్రతినిధులూ సంతకాలు పెట్టారు ఒడంబడిక పత్రాలమీద. ఆ పత్రాలను ఇక్కడకు పంపవలసిన బాధ్యత మన రాయబారికి అప్పచెప్పాము'' హోం మంత్రి బల్లమీద గంట కొట్టి, దర్వాను రాగానే కాఫీ తీసుకురమ్మని చెప్పి, ''మన ప్రతినిధికీ, ఆ దేశాల ప్రతినిధులకూ మధ్య రహస్య సమావేశాలు జరుగుతున్నాయని ఎలా తెలిసిందో బయటికి తెలిసింది. కానీ ఏ విషయం గురించి ఒప్పందం జరుగుతున్నదీ తెలియలేదు. దాదాపు అన్ని రాజ్యాలవారూ ఈ ఒడంబడిక వివరాలు తెలుసుకోవాలని తహ తహలాడారు. ఈ విషయం మన రాయబారికి తెలిసింది. అంతర్జాతీయ గూఢచారులు గద్దల్లా కాచుకున్నారనీ, ఏ మాయోపాయాలు పన్నైనా ఆ పత్రాలను కాజెయ్యడానికి కాచుకున్నారనీ మన రాయబారి భయపడ్డాడు.

''కనుక సామాన్యంగా ప్రభుత్వ పత్రాలు పంపే విధంగా ఆ కాగితాలు పంపదలచుకోక మన స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచి నుంచి ఎవర్నయినా పంపమని మన రాయబారి మాకు కబురుచేశాడు. న్యూయార్కుకి దగ్గర ఒక చోట ఓ కార్యక్రమంలో నిమగ్నుడయివున్న స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచి మనిషి నెం.888ని న్యూయార్కుకు వెంటనే వెళ్ళి మన రాయబారిని కలుసుకోమని చెప్పాను. ఆ కాగితాలను జాగ్రత్తగా తీసుకువచ్చి అప్పచెప్పే బాధ్యత అతనికిచ్చాము. అమెరికా నుంచి ఇక్కడికి ఈ రోజు ఉదయాన వచ్చిన విమానంలో అతను వస్తున్నట్లు మాకు వార్త చేరింది. ఆ విమానం పదకొండుగంటలకు విమానాశ్రయానికి వెళ్ళాడు. కాని నెం 888 విమానంలో నుంచి దిగలేదు.'' హోం మంత్రి సిన్హా గొంతు బొంగురుపోయింది. బరువుగా ఊపిరి పీలుస్తూ మౌనంగా ఉండిపోయాడు కాసేపు యుగంధరూ, రాజూ చెవులు అప్పగించి వింటున్నారు.

''ఈ విషయం నాకు తెలియగానే స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచి డైరెక్టర్ని పిలిపించి చెప్పాను. వాళ్ళు దర్యాప్తు చేశారు. నెం.888 న్యూయార్కు నుంచి ఆ విమానంలో బయలుదేరినట్లు రుజువైంది. ఆ విమానం బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలో పొద్దున్న ఆరుగంటలకు దిగింది. నెం.888 ఆ విమానంలో బొంబాయివరకు వచ్చాడు. బొంబాయిలో విమానంలోంచి దిగాడు. అందరితోపాటు

అతనూ ఏర్‌పోర్టు రెస్టారెంటులోకి వెళ్ళాడు. విమానం ఇరవై నిమిషాలలో ఢిల్లీకి బయలుదేరింది. నెం.888 మళ్ళీ విమానంలో ఎక్కలేదు. రెస్టారెంటులో వెళ్ళిన మనిషి మాయమయ్యాడు. ఎక్కడికి వెళ్ళాడో తెలియలేదు" అన్నాడు హోం మంత్రి.

"బహుశా రైలులో వస్తున్నాడేమో!" అన్నాడు యుగంధర్.

మంత్రి తలతిప్పాడు. "ఉహూ! మేము ఆ విషయము ఆలోచించాము. కాని అటువంటిదేదీ జరగలేదు. బొంబాయినుంచి బయలుదేరిన రైలును ఓ మధ్య స్టేషన్లో అరగంట ఆపించాము. ఆ ప్రాంతాల ఉన్న మా స్పెషల్ బ్రాంచి మనిషి ఒకతను, నెం.888 తెలిసిన మనిషి వెళ్ళి రైలంతా గాలించాడు. ఎక్కడా లేదు. అదీగాక అంత ముఖ్యమైన పత్రాలను తెస్తున్న అతను తిన్నగా ఆ విమానంలో వచ్చి ఆ కాగితాలను నాకిచ్చెయ్యక బొంబాయిలో దిగి ఎందుకు రైలులో వస్తాడు. అతను మాయమయ్యాడు. సందేహంలేదు" అన్నాడు మంత్రి.

"నెం.888 నమ్మకస్తుడేనా?" అడిగాడు యుగంధర్.

మంత్రి తల ఊపాడు. "ఏ ప్రభుత్వమైనా సరే, ఆ కాగితాలకు కోట్లకొద్దీ రూపాయలు ఇస్తారు, నిజమే. కానీ నెం.888 అటువంటివాడు కాడు. నిజానికి స్పెషల్ బ్రాంచి మనుష్యులందరిలోకీ అతను నమ్మకస్తుడు, తెలివైన వాడు, సమర్థుడు. స్వరాజ్యోద్యమంలో నెం.888 ఎన్నో సార్లు జైలుకెళ్ళాడు. పదేళ్ళనుంచీ ఈ శాఖలో పనిచేస్తున్నాడు. డబ్బుకి కానీ, ప్రాణ భయానికి కానీ లొంగిపోయి దేశ క్షేమాన్ని భంగపరిచే మనిషి కాడు. ఆ విషయం నేను గట్టిగా చెప్పగలను" అన్నాడు హోం మంత్రి.

"అయితే అతనెందుకు బొంబాయిలో దిగాడు?" అడిగాడు యుగంధర్.

"నాకు తెలియదు, ఆ విషయం మీరు కనుక్కోవాలి. అంతేకాదు. ఆ కాగితాలను నాకు తెచ్చి ఇవ్వాలి. అది మీ బాధ్యత. మీరు ఈ బాధ్యతను స్వీకరిస్తారా యుగంధర్?" అడిగాడు హోం మంత్రి ఆదుర్దాగా.

యుగంధర్ ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"యుగంధర్! మీ మేధస్సుకిది గొప్ప పరీక్ష! మీరు జంకకూడదు. మీరు భారతీయులు. దేశ క్షేమం మీ ప్రథమ కర్తవ్యం. ఇంతకన్న ముఖ్యమైన పనేమీ మీకు ఉండబోదు. ఆలోచించకండి, సరేననండి."

యుగంధర్ అప్పటికీ జవాబు చెప్పలేదు.

"యుగంధర్! మీరే సందేహిస్తే ఎలా? ఇదిగో అధికార పత్రాలు. దేశంలోని పోలీసు ఫోర్సు మొత్తం మీ ఆజ్ఞ శిరసావహిస్తుంది. ప్రభుత్వోద్యోగులందరినీ మీరు కోరిన సహాయం చెయ్యాలి అని ఆదేశించాము. మీకు సంపూర్ణ స్వతంత్రం ఉంది. నియమాలు, నిబంధనలు లేవు. మీ ఇష్టం. ఆ కాగితాలను తెచ్చి మాకు ఒప్పగించండి. వాటిని తెచ్చేందుకు మీరే మార్గాలు అవలంభించినా సరే! ఎలా తెచ్చారని మేము అడగం" చాలా ఉద్రేకంతో హోం మంత్రి చెప్పాడు.

అప్పటికి యుగంధర్ మౌనంగా ఉండిపోయాడు.

"యుగంధర్! డబ్బు విషయం ఆలోచించకండి. ఎంత డబ్బు ఖర్చయినా సరే ప్రభుత్వం జంకదు. భారత ప్రభుత్వం ఖజానా మీది. ఇది అతిశయోక్తి కాదు."

యుగంధర్ నవ్వాడు. "నేను వాటిని గురించి ఆలోచించడంలేదు. ఇంత బాధ్యతాయుతమైన పనిని నిర్వహించగలనా అని ఆలోచిస్తున్నాను. నేను కనక జయప్రదంగా ఈ పనిని సాధించలేకపోతే మీరు చెప్పిన విషయాలను బట్టి చాలా ఘోరమైన పర్యవసనాలు కలుగుతాయి. ఇదే మొదటిసారి నాకు నా శక్తిసామర్థ్యాలలో ఆత్మ విశ్వాసం లోపించడం" అన్నాడు యుగంధర్.

"ఈ పని ఎంత ముఖ్యమైనదో గ్రహించారు. కనకే మీరు ఇంతగా ఆలోచిస్తున్నారు యుగంధర్! మీరు జయప్రదంగా నిర్వహిస్తారని నాకు నమ్మకం కలుగుతోంది. మీరు ఈ పని చెయ్యలేకపోతే మన దేశంలో మరెవరూ లేరు ఈ పని చెయ్యగలిగినవారు."

"ఇటువంటి పనులు మీ స్పెషల్ బ్రాంచివారు బాగా నిర్వహించగలరేమో!" అన్నాడు యుగంధర్.

"సామాన్య పరిస్థితులలో అయితే మా స్పెషల్ బ్రాంచి నిర్వహించేదే కానీ ఇది అసామాన్యమైన పరిస్థితి. చాలా ప్రమాదకరమైన స్థితి. మా స్పెషల్ బ్రాంచి వారికన్నా తెలివైన గూఢచారులు అవతల ఉండి ఉండాలి. లేకపోతే నెం.888 నే ఎలా మోసగిస్తారు? అందుకే దేశంలోని మేధావులలో ఒకరుగా పేరుపొందిన మీ సహాయం మాకు కావాలి" అన్నాడు హోం మంత్రి.

"మీ పొగడ్తకు థాంక్స్ సార్! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. దయచేసి మీ స్పెషల్ బ్రాంచి డైరెక్టర్‌కి కబురు చేయండి. వెంటనే పని ప్రారంభిస్తాను" అని యుగంధర్ లేచాడు.

హోం మంత్రి కూడా లేచి నిలబడ్డాడు. యుగంధర్‌కి షేక్ హాండ్ ఇచ్చాడు. "మీకు జయం కలుగుగాక! జాగ్రత్త! ఈ అంతర్జాతీయ గూఢచారులు దేనికీ జంకరు. వాళ్ళు తమ పని సాగేందుకు అవసరమైతే మనుష్యులను చంపడానికికూడా వెనుదీయరు. జాగ్రత్త!" అన్నాడు.

యుగంధర్ నవ్వి "ఇప్పుడు నేనూ గూఢచారినే. అవసరమైతే నేనూ అదే చేస్తాను. నియమాలూ, నిబంధనలూ లేవని మీరే చెప్పారుగా!"

"గుడ్! వెళ్ళిరండి!" అని మంత్రి కార్యదర్శిని పిలిచి యుగంధర్నీ, రాజునీ స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ దగ్గరకి తీసుకు వెళ్ళమన్నాడు.

## 2

"అమెరికా నుంచి ఇవాళ పొద్దున వచ్చిన విమానంలోని ఏర్ హోస్టెస్ పేరేమిటి?" అడిగాడు యుగంధర్ ఏర్ పోర్టు ఎంక్వయిరీ లోని అమ్మాయిని.

ఆ అమ్మాయిని ఏదో రాసుకుంటూ, తలెత్తకుండానే "ఎందుకు?" అని అడిగింది.

"ఆమెతో అవసరంగా మాట్లాడాలి" అన్నాడు యుగంధర్. ఆ అమ్మాయి తలెత్తి చూసింది. యుగంధర్ చెంపలమీద నెరిసిన వెంట్రుకల్ను చూస్తూ నవ్వి "ఆ అమ్మాయి పేరు జీన్. మీ టయం వృధా చేయకండి. జీన్ పైలెట్ విలియమ్స్‌తో వెళ్ళింది" అన్నది.

"ఎక్కడికి వెళ్ళిందో తెలుసా?"

"ఇంకెక్కడికి వెళుతుంది? ఏ హోటలుకో వెళ్ళి ఉంటారు. ఎక్కడో డాన్స్ చేస్తుంటారు" అన్నదా అమ్మాయి కాస్త కోపంగా.

యుగంధర్ మొహం వేలాడేశాడు. వెనక నిలుచున్న రాజుని చూసి సంజ్ఞ చేసి వెళ్ళిపోయాడు. రాజు ఆ అమ్మాయి దగ్గిరికి వెళ్ళి బల్లముందు నిలుచున్నాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు.

ఆ అమ్మాయి తలెత్తి అతన్ని చూసింది. ముడుచుకు పోయిన మొహం వికసించింది. రాజుకు ఆడవాళ్ళని ఇట్టే ఆకర్షించగల శక్తి ఉంది. "ఎందుకు?" అడిగింది.

"నీ పేరు కూడా నీ అంత అందంగా ఉందా అని."

ఆ అమ్మాయి నవ్వింది. "కేథలిన్. ఎలా ఉంది?"

రాజు కొంచెం ముందుకి ఒంగి "మనం షికారుకి వెళ్ళకూడదూ! అప్పుడు చెబుతాను" అన్నాడు.

కేథలిన్ రాజుని ఎగాదిగా చూసింది. తల విదిలించింది. "ఊహూ! నువ్వెవరో నాకు తెలియదు" అన్నది.

"అదేనా అభ్యంతరం! అయితే చెబుతాను. నా పేరు దిలీప్" అన్నాడు నవ్వుతూ.

కేథలిన్ మళ్ళీ తల విదిలించి, "వీల్లేదు. రాత్రి రెండు గంటలవరకూ నాకు డ్యూటీ ఉంది" అన్నది.

"అదేనా అభ్యంతరం? డ్యూటీ లేకుండా చేస్తాను" అన్నాడు రాజు నవ్వుతూ.

కేథలిన్ కూడా నవ్వింది. "అంతేనా? నన్ను షికారుకు తీసుకు వెళ్ళేందుకు హెలికాప్టర్ కూడా తెప్పిస్తావా?"

"అవసరమైతే - ఇప్పుడే వస్తాను" అని రాజు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న రాజుని చూస్తూ చెయ్యి ఊపి "మళ్ళీ ఎప్పుడైనా కనిపించు" అని కేక వేసింది.

పదినిమిషాలలో రాజు మళ్ళీ కేథలిన్ బల్లదగ్గరికి వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. కేథలిన్ తలెత్తి చూసింది. "మళ్ళీ వచ్చావా? ఎందుకు?" అడిగింది.

"నిన్ను తీసుకు వెళ్ళడానికి. మేనేజర్ ఫోన్ చెయ్యలేదూ?" అడిగాడు.

"లేదు" అని నవ్వి, "ప్రధాన మంత్రి ఫోను చేసి చెప్పాడు నీతో షికారు వెళ్ళమని" అన్నది. ఆ వాక్యం పూర్తిచెయ్యకముందే బల్లమీదవున్న టెలిఫోను మోగింది. కేథలిన్ విసుగ్గా టెలిఫోను అందుకుని "ఏర్ పోర్టు ఎంక్వయిరీ" అన్నది. మరుక్షణం మొహం మారింది. "యస్ సార్!" అన్నది. టెలిఫోనులో మాట్లాడుతున్న మనిషి తనకెదురుగా ఉన్నట్లు కుర్చీలో సర్దుకుని నిటారుగా కూర్చున్నది. రెండు నిమిషాలు "యస్ సార్!" అంటూ టెలిఫోనులో విన్నది. టెలిఫోను పెట్టేసింది. తర్వాత రాజుని ఎగాదిగా అనుమానంగా చూసింది. "నువ్వెవరు?" అడిగింది.

రాజు నవ్వుతూ "చెప్పానుగా. దిలీప్ నా పేరు, మేనేజరేనా ఫోను చేసింది? అతను నా బావమరిదిలే" అన్నాడు.

కేథలిన్ అనుమానంగా చూస్తూ "అయితే?" అన్నది.

"అతనికి చెల్లెళ్ళు లేరు. నా చెల్లెల్ని అతడు చేసుకున్నాడు."

"అయితే?"

"అందుకని నాకు ఏ అమ్మాయి మీదయినా ఇష్టం కలిగితే సహాయం చెయ్యాలి" అన్నాడు నవ్వుతూ.

కేథలిన్ రాజుని తేరిపార చూసింది.

"ఎందుకు టయంవృథాచేస్తావు! రా! పోదాం! నీకు శెలవు ఇప్పించానుగా! " అన్నాడు.

కేథలిన్ లేచింది. "ఇప్పుడే వస్తాను" అంటూ హేండ్ బాగ్ తీసుకుని వెళ్ళింది. అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చింది. మొహానికి పౌడరు, పెదిమలకు రంగు వేసుకుని, జుట్టు సరిగా అమర్చుకుని వచ్చి అతనికెదురుగా వచ్చి నిలుచున్నది.

"నేను రెడీ!" అన్నది.

కేథలిన్ చెయ్యిపట్టుకుని చర చర నడిపించుకుంటూ బయటకు తీసికెళ్ళాడు రాజు. టాక్సీ ఎక్కారు ఇద్దరూ. వసారాలో ముఖానికి పత్రిక అడ్డం పెట్టుకుని కూర్చున్న యుగంధర్ మరొక టాక్సీ ఎక్కి "ఆ టాక్సీ వెంట వెళ్ళు" అన్నాడు.

✡✡✡

ఢిల్లీ నగరం చాలా పురాతనమైన పట్నం. అయినా పాత కొత్తల మేళవింపు ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఒక పక్క మసీదులూ, కోటలూ, పురాతన భవనాలూ, మరొక పక్క కొత్తగా కట్టబడిన పది అంతస్తుల ఏర్ కండిషన్ హోటల్స్, నియాన్ సైన్స్ కనిపిస్తాయి. బురఖాలు వేసుకుని కంతల్లోంచి చూస్తూ నడిచే ఘోషా స్త్రీలూ, మోకాళ్ళవరకూ గౌనులు వేసుకుని, భుజాలను నగ్నంగా ప్రదర్శిస్తూ నడిచే పాశ్చాత్య వనితలూ వీధుల్లో కనిపిస్తారు. చీనా దేశస్థులు, బర్మీయులు, అమెరికన్లు, బౌద్ధమత గురువులు, ఫాదరీలు, సన్యాసులు, స్వాములు. కోటీశ్వరులయిన పారిశ్రామికులు, పూటకు గతిలేని కటిక దరిద్రులూ అందరూ కనిపిస్తారు ఢిల్లీ వీధుల్లో.

హోటల్ ఎక్స్‌ప్లనేడ్ ముందు రాజు టాక్సీ ఆగింది. యుగంధర్ కొంచెం వెనకాలగా తన టాక్సీ ఆపించాడు. రాజు కేథలిన్‌ని తీసుకుని హోటల్లోకి వెళ్ళాడు.

పది నిమిషాల తర్వాత, రాజూ, కేథలినూ బయటికి వచ్చారు. మళ్ళీ టాక్సీ ఎక్కి రెండు ఫర్లాంగులు వెళ్ళి హోటల్ మిడ్‌నైట్ ముందు ఆగారు. టాక్సీ దిగి ఇద్దరూ ఆ హోటల్లోకి వెళ్ళారు. డిటెక్టివ్ యుగంధర్ మళ్ళీ తన టాక్సీని కొంచెం దూరంలో ఆపి ఓపిగ్గా కాచుకున్నాడు.

"ఈ హోటలూ బాగోలేదు. ఇంకో హోటలుకి పోదాం పద!" అన్నాడు రాజు కేథలిన్‌తో.

"అబ్బ ఎందుకు?"

"నాకు నచ్చలేదు"అంటూ కేథలిన్‌ని చెయ్యి పట్టుకుని తనతో లాక్కువెళ్ళాడు రాజు. ఇంకో టాక్సీ ఎక్కి మరొక హోటలుకి వెళ్ళారు. అయిదునిమిషాల తర్వాత "ఈ హోటలూ బాగోలేదు ఇంకో హోటలుకి వెళదాం" అన్నాడు రాజు నవ్వుతూ.

కేథలిన్ అనుమానంగా చూసింది రాజుని. "ఏమిటీ అల్లరి. ఎందుకిన్ని హోటళ్ళకు తీసుకువెళుతున్నావు?" అడిగింది. రాజు సమాధానం ముందే ఆలోచించి పెట్టాడు. "మా బావ వస్తానన్నాడు" అన్నాడు.

"ఎవరా బావ?" అడిగింది కేథలిన్.

"మీ మేనేజర్."

కేథలిన్ కళ్ళు పెద్దవి చేసి చూసింది. "అయితే ఇన్ని హోటళ్ళు తిరగడం దేనికి? ఆయన ఏ హోటల్లో ఉంటానన్నారో అక్కడికే వెళదాం."

"ఆ హోటలు పేరు మర్చిపోయాను."

కేథలిన్ పక పక నవ్వింది. "సరే! నాకేం! ప్రతి హోటల్లోనూ నాకు డ్రింక్ ఇప్పించు" అన్నది నవ్వుతూ.

తర్వాత హోటల్ ఈస్టర్న్‌కి వెళ్ళారు. వెయిటర్ రాగానే డ్రింక్స్ తెమ్మని చెప్పాడు రాజు. హోటల్లో బాండు వాయిస్తున్నారు. చాలామంది యువతీయువకులు పాశ్చాత్యనాట్యం చేస్తున్నారు.

"మనమూ డాన్స్ చేద్దామా?" అడిగాడు రాజు. వెయిటర్ డ్రింక్స్ తెచ్చాడు. డ్రింక్ తాగిన తర్వాత కేథలిన్ తల ఊపింది. రాజు కేథలిన్ నడుం చుట్టూ చెయ్యివేసి డాన్సు చేస్తున్న చోటికి తీసుకు వెళ్ళాడు. యువతీ యువకులు బాండు పాటకు సరిగా అడుగులు వేసుకుంటూ కదులుతున్నారు.

"హల్లో!" అన్నది కేథలిన్.

"హల్లో!" అన్నది డాన్స్ చేస్తున్న ఇంకో అమ్మాయి.

"ఎవరు?" అడిగాడు రాజు.

"జీన్!"

"అంటే?"

"అమెరికన్ ఏరో ప్లేన్‌లో హోస్టెస్."

రాజు చాలా ఓపికతో డాన్స్ చేశాడు. డాన్స్ పూర్తి అయిన తర్వాత అందరూ బల్లల దగ్గరకు వెళ్ళికూర్చున్నారు.

"ఒక్క క్షణం - ఇపుడే వస్తాను" అంటూ రాజు క్లోక్ రూం వైపు వెళ్ళాడు. అక్కణ్ణించి నెమ్మదిగా వీధిలోకి వెళ్ళాడు. అతన్ని చూడగానే యుగంధర్ కారు తలుపు లోంచి చెయ్యి బైటికి పెట్టాడు. రాజు పరిగెత్తుకుంటూ కారు దగ్గరికి వెళ్ళి "కనపడింది సారే!" అన్నాడు.

యుగంధర్ నవ్వి "ఆనవాలు చెప్పు" అన్నాడు.

"నీలం రంగు జార్జెటు గౌను తొడుక్కుంది. నీలం రంగు బూట్స్ వేసుకుంది. మెళ్ళో ఒక వరస ముత్యాల హారం ఉంది. కత్తిరింపు జుట్టు పైకి దువ్వుకుని వెనక్కి కుచ్చుగా రిబ్బనుతో కట్టింది. ఎర్రగా, పొడుగ్గా ఉంది చాలా అందమైన మొహం" అన్నాడు రాజు.

"గుడ్! నేను కనుక్కుంటాలే. నువ్వు కేథలిన్ ని తీసుకుని వెళ్ళిపో!" అన్నాడు.

రాజు వెళుతూ "కేథలిన్‌ని అడిగివుంటే జీన్ ఏ హోటల్లో ఉన్నదీ చెప్పేసేది. ఎందుకింత కష్టం!" అన్నాడు.

"కేథలిన్‌ని అడిగితే చెప్పేదే కాని తనకోసం మనం వెతుక్కుంటూ వచ్చామని జీన్‌కి ఎందుకు తెలియాలి? ఏ పుట్టలో ఏ పామున్నదో!" అన్నాడు యుగంధర్. "పది నిమిషాలలో ఫోను చెయ్యి" అని రాజుకు చెప్పాడు.

రాజూ, కేథలిన్ హోటల్లోంచి బయటికి వచ్చి టాక్సీ ఎక్కేంతవరకూ యుగంధర్ ఓపిగ్గా కాచుకున్నాడు. ఆ లోగా యుగంధర్ తన రూపంలో కొన్ని మార్పులు తెచ్చుకున్నాడు. జేబులోంచి క్రేప్ హేర్ తీసి మీసాలు అతికించుకున్నాడు. ఒక పంటిమీద బంగారం తొడుగు పెట్టుకున్నాడు. వేళ్ళకు రాళ్ళ ఉంగరాలు పెట్టుకున్నాడు. చెంపమీద ఒక నల్లని మచ్చ తయారు చేశాడు. కళ్ళకి అద్దాలు పెట్టుకుని హోటలు వైపు నడిచాడు.

యుగంధర్ హోటల్లోకి వెళ్ళేటప్పటికి అందరూ బల్లల దగ్గర కూర్చుని ఫలహారాలు చేస్తున్నారు. యుగంధర్ ఖాళీగా ఉన్న ఓ బల్ల దగ్గిరకు వెళ్ళి కూర్చున్నాడు. వెయిటర్‌కి ఫలహారం తెమ్మని చెప్పి, చుట్టూ కలియచూశాడు. రెండు బల్లలకు అవతల తనకు ఎదురుగా కూర్చునున్నది నీలం రంగు గౌనులో ఉన్న అమ్మాయి - జీన్. ఆమె కూడా ఒక యువకుడున్నాడు. అతను పాశ్చాత్యుడు. అమెరికన్ అయివుండాలనుకున్నాడు యుగంధర్. ఆ ఇద్దరూ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. అయిదు నిమిషాలయింది. వెయిటర్ వాళ్ళ బల్ల దగ్గిరకు వచ్చి ఆ యువకుడితో ఏదో చెప్పాడు. విసుగ్గా మొహం పెట్టి ఆ యువకుడు లేచి వెళ్ళాడు.

యుగంధర్ రెప్ప వాల్చకుండా జీన్‌నే చూస్తున్నాడు. ఆ యువకుడు వెళ్ళిపోగానే జీన్ ఒకసారి అందర్నీ కలియ చూసింది. యుగంధర్ని చూసింది. యుగంధర్ పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు. ఎవరా అన్నట్టు జీన్ ఒక క్షణం సందేహించి తర్వాత తనూ చిరునవ్వు నవ్వింది. యుగంధర్ నెమ్మదిగా ఆ అమ్మాయి బల్ల దగ్గరకు వెళ్ళాడు. "నేను జ్ఞాపకమున్నానా?" అడిగాడు.

"ఎక్కడో చూసినట్లు జ్ఞాపకమున్నది" అని బొంకింది మర్యాదకి.

యుగంధర్ నవ్వాడు. "విమానంలో మీకు రోజూ ఎంతమందో కలుస్తుంటారు, వారిలో ఒకర్ని జ్ఞాపకముంచుకోవడం దుర్లభం. న్యూయార్క్ నుంచి నేనిక్కడికి వచ్చిన విమానంలో మీరు హోస్టెస్‌గా వచ్చారు. నా పేరు లక్ష్మణ్. విమానం ఎక్కగానే నాకు గుండె దడ వచ్చింది. మీరు నాకు చాలా శుశ్రూష చేశారు" అన్నాడు యుగంధర్.

జీన్ ఒక క్షణం సందేహించింది. "అవునవును. జ్ఞాపకంవచ్చింది. మీరీ ఊళ్ళోనే ఉంటున్నారా?" అడిగింది.

"లేదు. నేను పూనాలో ఉంటున్నాను. పనిమీద వచ్చాను ఇక్కడికి" అన్నాడు యుగంధర్.

ఇంతలో జీన్‌తో వచ్చిన యువకుడు తిరిగి వచ్చాడు. అతని మొహం చిటపటలాడుతోంది. ఒకసారి యుగంధర్ని ఆపాదమస్తకమూ పరీక్షగా చూసి, జీన్ వైపు తిరిగి, "సారీ! అర్జంటు పిలుపు వచ్చింది. ఏర్ పోర్ట్ మేనేజర్ పిలిచాడు. ఒకసారి ఆయనను కలుసుకుని అరగంటలో వస్తాను" అన్నాడు.

జీన్ కూడా మొహం మాడ్చుకున్నది. "అయితే నేనూ బయలుదేరతాను. ఇక్కడ ఒంటరిగా ఏం చేస్తాను" అన్నది లేచి నిలబడి.

"నేను ఓ స్నేహితుడి కోసం కాచుకున్నాను ఇక్కడ. అతను వచ్చేందుకు ఇంకో అరగంట పడుతుంది. మీ స్నేహితుడు తిరిగి వచ్చేంతవరకూ మనం ఒకళ్ళకి ఒకరు తోడు ఉండవచ్చు" అన్నాడు యుగంధర్.

జీన్ ఆ యువకుడి మొహం చూసింది.

యుగంధర్ అతని వైపు తిరిగి నవ్వుతూ "నేను ముసలాణ్ణి! మీకు అసూయగాని, అనుమానం గాని అనవసరం. జాగ్రత్తగా మీ స్నేహితురాల్ని మీకు ఒప్పచెబుతాను మీరు తిరిగిరాగానే" అన్నాడు.

అతను నవ్వి "సరే, జీన్! నేను త్వరగా తిరిగివస్తాను. నువ్విక్కడే ఉండు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

యుగంధర్ ఆ అమ్మాయికి ఎదురుగా కూర్చున్నాడు. తను నగల వర్తకుణ్ణనీ, వ్యాపారం మీద ఢిల్లీ వచ్చాననీ యుగంధర్ ఆ అమ్మాయికి చెప్పి కబుర్లలోకి దింపాడు. ఆ అమ్మాయి వద్దంటున్నా రకరకాల తినుబండారాలు తెప్పించాడు. ఆప్యాయంగా 'అమ్మాయీ' అని పిలవనారంభించాడు. అయినా బల్లకింద నుంచి కాళ్ళని ఆమె మోకాళ్ళకి తగిలించడం మొదలయిన వెకిలి చేష్టలు చేశాడు. చాలా సహజంగా 'ముసలి జంబుకం' పాత్ర నటించనారంభించాడు.

"అన్నట్టు మరిచిపోయాను. నువ్వు ఈ వేళ వచ్చిన విమానంలో వచ్చావు కదూ?" అడిగాడు యుగంధర్.

ఔనని తల ఊపింది జీన్.

"అమెరికానుంచి ఇవేళ నా స్నేహితుడొకాయన రావలసింది. రాలేదు. అందువల్ల నా ఏర్పాటులన్నీ తారుమారయ్యాయి" అన్నాడు యుగంధర్. జీన్ మాట్లాడలేదు.

"విమానాశ్రయం నుంచి తిన్నగా నా హోటలుకి వస్తానని ఉత్తరం రాశాడు. చాలా సేపు నేను అతనికోసం హోటల్లో కాచుకున్నాను. రాలేదు. విమానం సరయిన టైంకే వచ్చిందా?" జీన్ తల ఊపింది.

"ఎందుకు రాలేదో! అసలు బయలుదేరాడో లేదో? " అన్నాడు.

"ఆయన పేరేమిటి?" అడిగింది జీన్.

"అతని పేరు మహావీర్. నగల వర్తకుడు" అన్నాడు యుగంధర్.

కనుబొమలు చిట్లించి జీన్ ఒక క్షణం ఆలోచించి జ్ఞాపకం చేసుకున్నది. "తెల్లగా పొడుగ్గా ఉంటాడు. అతనేనా మహావీర్! అవును. ఎనిమిదవ నెంబర్ సీటులో కూర్చున్నాడు -" ఆగింది. యుగంధర్ కాచుకున్నాడు.

"అతను ఢిల్లీకే టిక్కెట్ కొన్నాడు. కానీ ఎందుకో బొంబాయిలో మళ్ళీ విమానం ఎక్కలేదు" అన్నది జీన్.

"బొంబాయిలో దిగేశాడా? విచిత్రంగా ఉందే! ఇక్కడ నాతో పనున్నవాడు బొంబాయిలో ఎందుకు దిగాలి!" జీన్ మాట్లాడలేదు.

"ఒకవేళ అనుకోకుండా ఏదయినా పని తగిలివుంటుంది. అతని కూడా మరెవరయినా ఉన్నారా?" అడిగాడు యుగంధర్.

"ఎవరూ లేరు. న్యూయార్కులో ఒంటరిగానే విమానం ఎక్కాడు. దోవలో ఎవరితోనూ మాట్లాడలేదు. నేను పలకరిస్తే కూడా చాలా ముభావంగా ఉన్నాడు. కెయిరోలో దిగి తిన్నగా రెస్టారెంట్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. ప్లేను మళ్ళీ బయలుదేరే సమయానికి వచ్చి కూర్చున్నాడు" అన్నది జీన్.

"అవునవును. అతను అంత కలుపుగోలు మనిషి కాడు. రాత్రి డిన్నర్‌కే దిగనివాడు పొద్దున్న బొంబాయిలో ఎందుకు దిగాడో?"

"ఏమో అతనికి పెట్టే బేడా ఉంటేగా! ఒక చిన్న తోలు సంచి మాత్రం ఉంది చేతిలో. అది పుచ్చుకుని దిగాడు" అన్నది జీన్. ఇంతలో ఆమె స్నేహితుడు తిరిగి వచ్చాడు. అతన్ని చూడగానే జీన్ మొహం వికసించింది.

"అయితే ఇక నేను వెళతాను" అని యుగంధర్ లేచాడు.

"ఇంతసేపు నాకు తోడుగా ఉన్నందుకు చాలా థాంక్స్" అన్నది జీన్.

యుగంధర్ తను బసచేసిన హోటలుకి చేరుకునేటప్పటికి బాగా ఆలస్యమైంది. అయినా రాజు మెలుకువగానే ఉన్నాడు.

"ఏమైనా కనుక్కున్నారా!" అడిగాడు రాజు.

యుగంధర్ ఏదో ఆలోచనలోంచి తెప్పరిల్లి "నెం.888 ఒక తోలుసంచి తీసుకుని బొంబాయిలో దిగాడు అంతే!" అన్నాడు.

"ఇప్పుడింకేం చేద్దాం?"

"బొంబాయి వెళదాం. ఇక్కడ మనం తెలుసుకోవలసింది ఇంకేమీ లేదు" అన్నాడు యుగంధర్.

***

## 3

బొంబాయి శాంటాక్రజ్ విమానాశ్రయంలో దిగగానే యుగంధర్, రాజా తిన్నగా ఏర్‌పోర్ట్ మేనేజర్ గదిలోకి వెళ్ళారు. యుగంధర్ పంపిన చీటీని చూసి మేనేజర్ స్వయంగా తలుపు దగ్గరకు వచ్చి యుగంధర్ని ఆహ్వానించాడు.

యుగంధర్ గదిలోకి వెళ్ళగానే కుర్చీలో కూర్చున్న ఓ యాభై ఏళ్ళ మనిషి లేచి నిలబడి షేక్ హాండ్‌కి చెయ్యిఅందించాడు. "హల్లో యుగంధర్! చాలాకాలం అయింది మనం కలుసుకుని. హోం మినిస్టరీనుంచి ట్రంక్ కాల్ వచ్చింది మీరు వస్తున్నారనీ, ఇక్కడ మిమ్మల్ని కలుసుకోమనీ, మీకు కావలసిన సహాయం చెయ్యమనీ చెప్పారు" అన్నాడతను. అతను బొంబాయి పోలీస్ చీఫ్ కమీషనర్

"థాంక్స్! మీ సహాయం ఉంటే ఎంత పనైనా చెయ్యవచ్చు" అని మేనేజర్ వైపు తిరిగి "నాకు కొన్ని వివరాలు చెప్పాలి మీరు. నిన్న పొద్దున్న న్యూయార్క్ నుంచి వచ్చిన విమానంలో మహావీర్ అనే అతను వచ్చి ఈ విమానాశ్రయంలో దిగాడు. అతన్ని గురించి మీకేమైనా తెలుసా?"

"నిన్న స్పెషల్ బ్రాంచి మనిషి ఒకతను వచ్చి విచారించాడు మహావీర్ గురించి. ఆ మహావీర్ ఢిల్లీకి టికెట్టు కొన్నాడు. కానీ ఇక్కడ దిగాడు. విమానం దిగగానే కాఫీకి ప్రయాణికులందరూ రెస్టారెంట్‌లోకి వచ్చారు. వాళ్ళతోబాటు అతనూ వచ్చాడు. బ్రెడ్, ఆమ్లెట్ ఆర్డరిచ్చి, బాత్‌రూములోకి వెళ్ళి తిరిగి బల్ల దగ్గరకి వచ్చాడు. అంతలో లౌడ్ స్పీకర్‌లో అతన్ని టెలిఫోను ఆపరేటర్ పిలిచింది. ఎవరో ఫోను చేస్తున్నారని, వసారాలో వున్న టెలిఫోను బూత్‌లోకి వెళ్ళమని చెప్పింది. అతను కాఫీ తాగకుండానే టెలిఫోను బూత్‌లోకి వెళ్ళాడు. అంతే! ఆ తర్వాత అతన్ని ఎవరూ చూడలేదు. విమానం బయలుదేరే ముందు అతన్ని లౌడ్ స్పీకర్లో పిలిచాం. అతను రాలేదు. టెలిఫోను బూత్ నుంచి అతను బయటికి వెళ్ళిపోయి ఉండాలి" అన్నాడు మేనేజర్.

"అతను బయటకు ఎలా వెళ్ళివుంటాడు? కస్టమ్స్ వాళ్ళు అతన్ని సోదా చేసివుండాలిగా!" అడిగాడు యుగంధర్.

"చేయలేదు. నెం.888 ని సోదా చేయవలసిన అవసరం లేదని ఆ ఉద్యోగులకు ముందుగానే ఆదేశం వచ్చింది."

"నెం.888 బయటకు వెళ్ళడం చూసిన కస్టమ్స్ ఉద్యోగి ఎవరు?" అడిగాడు యుగంధర్.

"ప్రస్తుతం డ్యూటీ మీద లేడు. అవసరమైతే పిలిపిస్తాను. కాని అనవసరం అనుకుంటాను. నిన్న మేము అడిగాము. అతనికేమీ తెలియదు. సరిగా అదే సమయానికి ఇంకో రెండు విమానాలు దిగడంవల్ల ఆ జనసమర్దంలో అతనికి ఏదీ జ్ఞాపకం లేదు" అన్నాడు మేనేజర్.

యుగంధర్ ఒక నిమిషం ఆలోచించి "దయచేసి నిన్న మహావీర్‌కి కాఫీ తెచ్చి ఇచ్చిన బట్లర్‌ని పిలిపిస్తారా?" అడిగాడు.

మేనేజర్ బల్లమీద ఉన్న బెల్ కొట్టి దర్వాన్ రాగానే అతన్ని పంపాడు. రెండు నిమిషాలలో బట్లర్ హాజరయ్యాడు. బెదురుతూ తలుపు దగ్గిర నిలుచున్నాడు.

"నిన్న పొద్దున ఓ విమానంలో దిగిన మనిషికి నువ్వు కాఫీ, ఆమ్‌లెట్ బ్రెడ్ తెచ్చి ఇచ్చావు. అవి తినకుండానే అతను వెళ్ళిపోయాడు. అతను నీకు జ్ఞాపకం ఉన్నాడా!" అని అడిగాడు యుగంధర్, బట్లర్ తల ఊపాడు.

"అతను టెలిఫోను బూత్‌కి వెళుతున్నప్పుడు నువ్వు ఎక్కడున్నావు?"

"ఆయన బల్ల దగ్గరే ఉన్నాను సార్! అప్పుడే ట్రేలో కాఫీ, టిఫిన్ తెచ్చి బల్లమీద సర్దుతున్నాను. ఇంతలో లౌడ్ స్పీకర్లో ఆయన్ని పిలిచారు. టెలిఫోను బూత్ ఎక్కడుందని ఆయన నన్నడిగారు. వసారాలో ఉందని చెప్పాను. అన్నీ మళ్ళీ ట్రేలో పెట్టి మూతపెట్టమని చెప్పి ఆయన వెళ్ళారు."

"ఆయనను నువ్వు మళ్ళీ  చూడలేదా!"

"చూశాను సార్!"

"ఎక్కడ?"

"టెలిఫోను బూత్‌లో... ఆయనకు ఆ బూత్ కనిపించిందో లేదో అని అటు వెళ్ళాను. ఆయన టెలిఫోనులో మాట్లాడుతున్నారు. నేను రెస్టారెంటులోకి వచ్చేశాను."

"అతను మళ్ళీ హోటల్లోకి తిరిగి వచ్చాడా?"

"లేదు సార్! పదినిమిషాలయింది. ఆయన రాలేదు. ఒక పక్క కాఫీ చల్లారిపోతోంది. ఆమ్లెట్ కూడా చల్లారిపోయింది. ఇంకో పక్క విమానం తిరిగి బయలుదేరే టైమయింది. అందుకని మళ్ళీ టెలిఫోను బూత్ దగ్గరకి వెళ్ళి చూశాను. ఆయనలేరు."

"అతని దగ్గర ఓ తోలుసంచి ఉండాలి. దాన్నేం చేశాడో తెలుసా?" అడిగాడు యుగంధర్.

"తోలు సంచా?" అడిగాడు బట్లర్.

"అవును, నల్లని తోలు సంచి, దానికి జిప్ ఉంటుంది" అన్నాడు యుగంధర్.

"ఆయన దగ్గిర అటువంటిదేదీ లేదు సార్!"

"లేదని నీకెలా తెలుసు?"

"ఆయన రెస్టారెంటులోకి రాగానే తిన్నగా నా బల్లదగ్గరకి వచ్చారు. ఆర్డరిచ్చారు. బాత్ రూం ఎక్కడున్నదని అడిగారు. చెప్పాను. వెళ్ళిపోయారు. ఆయన చేతిలో తోలు సంచివుంటే నేను చూసేవాణ్ణే" అన్నాడు బట్లర్.

"తోలు సంచి ఉన్నదీ లేనిదీ నువ్వు చూసి ఉండకపోవచ్చు" అన్నాడు యుగంధర్.

బట్లర్ సందేహంతో చూశాడు. కాసేపు ఆలోచించాడు. "లేదుసార్! ఒకవేళ పొరపాటున నేను మొదటిసారి చేతిలో సంచి చూడకపోయినా తర్వాతయినా చూసేవాణ్ణి. నేను కాఫీ తెచ్చి బల్లమీద పెట్టగానే ఆయన నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకున్నాడు. అప్పుడు ఆయన చేతిలో సంచి లేదు. సంచి ఉంటే పక్కన ఉన్న కుర్చీలో పెట్టి ఉండాలి. కుర్చీలోనే ఉండి ఉంటే ఈయన తిరిగివచ్చి దాన్ని తీసుకునేవారే!"

"మళ్ళీ వచ్చి తీసుకోలేదని ఎలా ఖచ్చితంగా చెప్పగలవు!" అడిగాడు యుగంధర్.

"ఆయన పిలవడానికి రెండోసారి టెలిఫోను దగ్గరకి వెళ్ళినపుడు ఆయన రెస్టారెంటులోకి వచ్చాడేమో!"

"లేదు సార్! వస్తే నా కెదురుపడి ఉండేవాడు ఇంకోదారి లేదు" అన్నాడు బట్లర్.

యుగంధర్ లేచి వెళ్ళి బట్లర్‌కి షేక్ హాండ్ ఇవ్వడంతో బట్లర్ మొహం వికసించింది. తబ్బిబ్బయి మాట రాలేదు. షేక్ హాండ్ ఇస్తూ యుగంధర్ అతని చేతిలో పెట్టిన అయిదురూపాయల నోటు చూశాక బట్లర్ నోరు తెరుచుకుని యుగంధర్ని చూశాడు.

"వెళ్ళు! ఎవరితోనూ ఏమీ చెప్పకు" అన్నాడు యుగంధర్ నెమ్మదిగా. బట్లర్ సలాం చేసి వెళ్ళిపోయాడు.

"దయచేసి టెలిఫోను ఆపరేటర్ని పిలిపిస్తారా?" అడిగాడు యుగంధర్.

మేనేజర్ కబురు పంపాడు. వన్నెల విసనకర్రలా ఉన్న ఓ మళయాళ యువతి గదిలోకి వచ్చింది.

మహావీర్‌కి వచ్చిన టెలిఫోన్ కాల్ విషయం వివరాలు చెప్పమని యుగంధర్ ఆమెను అడిగాడు.

"అమెరికానుంచి వచ్చిన విమానంలో మహావీర్ అనే ఆయన దిగాడని చెప్పి, ఆయన్ని టెలిఫోను వద్దకు పిలవమని ఓ యువతి అడిగింది" అన్నది.

"తన పేరు చెప్పిందా?"

"లేదు."

"ఏ భాషలో మాట్లాడింది?"

"ఇంగ్లీషులో."

"ఎక్కణ్ణించి ఫోను చేసి ఉంటుంది?"

"ఏమో, తెలుసుకోవడం దుర్లభం!"

"ఆ అమ్మాయి గురించి కానీ, ఆ టెలిఫోను సంభాషణ గురించి కానీ ఇంకేమైనా చెప్పగలవా?"

టెలిఫోను ఆపరేటర్ కాస్త ఆలోచించి "ఆ అమ్మాయి గొంతు గాభరాగా ఉన్నది." అంది.

అంతకన్నా ఆ అమ్మాయి చెప్పగలదేమీ లేదని నిశ్చయించుకుని యుగంధర్ ఆమెను వెళ్ళవచ్చని చెప్పాడు.

పోలీస్ కమీషనర్ చిన్నగా దగ్గి "మహావీర్ ఇక్కణ్ణించి టాక్సీలో వెళ్ళలేదు. ఆ విషయం మేము దర్యాప్తు చేశాము. ప్రైవేటు కారులో వెళ్ళివుంటాడు" అన్నాడు.

"అంటే మహావీర్ ఇక్కణ్ణించీ ఎటు వెళ్ళిందీ, ఎలా వెళ్ళిందీ తెలియదు. అవునా?" అడిగాడు యుగంధర్.

పోలీస్ కమీషనర్ తలవూపాడు. "అవును టెలిఫోను బూత్ వద్ద అతను మాయమయ్యాడు. ఆ తర్వాత అతని జాడలు లేవు" ఒక క్షణం ఆగి "అతనెవరో, ఎందుకు అతన్ని పట్టుకోవాలో, ఏం నేరం చేశాడో మాకు తెలియదు. తెలిస్తే ఇంకా కొంత ఆరా తీసేవాళ్ళం" అన్నాడు చికాకుతో.

యుగంధర్ చెయ్యి చాచి "మీ టెలిఫోను ఒకసారి ఉపయోగిస్తాను. ఏ హోటలులోనైనా గదులు తీసుకోవాలి" అన్నాడు మేనేజర్‌తో.

"మీరు వస్తున్నారని వార్త చేరగానే తాజ్‌లో మీకు గదులు రిజర్వ్ చేశాను" అన్నాడు కమిషనర్.

"థాంక్స్! కాని అంత పెద్ద హోటలులో నేను బసచేయడం మంచిది కాదు. నా రాక గుట్టుగా ఉండాలి వీలయినంతవరకూ" అని యుగంధర్ వెల్‌కమ్ హోటలుకు ఫోనుచేసి రెండు గదులు మారుపేరున రిజర్వు చేశాడు. మేనేజర్ వద్ద సెలవు పుచ్చుకుని బయలుదేరాడు.

వెల్‌కమ్ హోటల్లో మేడమీద చివరిగదిలో డిటెక్టివ్ యుగంధర్ పచార్లు చేస్తున్నాడు. చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అతని అసిస్టెంటు రాజుకుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్ తాగుతున్నాడు. "ఇప్పుడింక మనం ఏం చేద్దాం?" అడిగాడు రాజు.

"అదే ఆలోచిస్తున్నాను. మనకు తెలిసిన విషయాలు స్వల్పం. వాటిని ఆధారంగా తీసుకుని ఈ మహాపట్నంలో నెం.888 ని వెదకడం ఎలా?" అన్నాడు యుగంధర్.

"నెం.888 ఈ పట్నంలో ఉన్నాడని రూఢేమిటి?"

"అవును, ఈ పాటికి ఎక్కడికయినా వెళ్ళివుండవచ్చు. ఈ దేశంలోనే లేకపోవచ్చు. రాజూ! కాగితం మీద మనం తెలుసుకున్న విషయాలు వ్రాయి" అని యుగంధర్ అని చెప్పసాగాడు:

"నెం.888 విమానం దిగినపుడు అతని దగ్గర ఒక తోలుసంచీ ఉంది. సాక్ష్యం. జీన్. అతను హోటల్లోకి వచ్చినపుడు అతని దగ్గిర తోలుసంచిలేదు. సాక్ష్యం బట్లర్. నెం.888 హోటల్లోకి వచ్చినపుడు అతనికి టెలిఫోన్ కాల్ వస్తుందని తెలియదు సూచన: ఫలహారానికి ఆర్డరివ్వడం.

నెం.888 కి ఎవరో యువతి టెలిఫోన్ చేసింది. చాలా ఆదుర్దాగా ఉంది ఆమె. సాక్ష్యం: టెలిఫోను ఆపరేటర్.

నెం.888 టెలిఫోనులో మాట్లాడాడు. తిరిగి హోటల్లోకి రాలేదు. అక్కణ్ణించి అతని జాడ తెలియదు.

"అంతా రాసుకున్నావా సరే! ఇప్పుడు సావధానంగా ఆలోచిద్దాం. మొదటి సందేహం ఆ తోలుసంచి ఏమైంది? విమానంలోంచి దిగుతున్నప్పుడు చేతిలో ఉన్న తోలుసంచి హోటల్లోకి వచ్చినపుడు లేదు. విమానంనుంచి ఎయిర్ పోర్టు హోటలుకి వచ్చేలోపున సంచి ఎట్లా మాయమైంది? ఆ ఖాళీ మైదానంలో దాన్ని ఎక్కడా దాచివుండడానికి వీలులేదు. కనుక ఆ సంచిని మరెవరికో ఇచ్చేసి వుండాలి. ఎందుకా సంచిని ఎవరికో ఇచ్చాడు? ఆ సంచిలో ఏముంది? రహస్య పత్రాలు ఆ సంచిలో ఉన్నాయా? నెం.888 లాంటి అనుభవశాలి అయిన గూఢచారి ఒక సామాన్యమైన తోలుసంచిలో అంత ముఖ్యమైన కాగితాలు పెట్టుకుంటాడా? అతను బొంబాయిలో విమానంలోంచి ఎవరి బలవంతం మీదా దిగలేదు. తన చేతిలోని తోలుసంచి మరొకరికి ఎందుకు ఇచ్చేస్తాడు?" యుగంధర్ ప్రశ్నలు వేస్తూ తనే జవాబు చెబుతున్నాడు.

"ఒకవేళ ఎవరయినా తనను వెంటాడుతున్నారని నెం.888కి అనుమానం కలిగి చేతిలో ఉన్న సంచి మరొక స్పెషల్ బ్రాంచి మనిషికి అందించారేమో!" అన్నాడు రాజు.

"అదీ సంభవమే! కాని నాకు కలుగుతున్న సందేహం ఒకటే. నెం.888లాటి అనుభవశాలి అంత ముఖ్యమైన కాగితాలను ఒక సామాన్యమైన తోలుసంచిలో పెట్టుకుని తెస్తాడా? అంతకన్న జాగ్రత్తగా దాచడా? ఇంకో సందేహం. నెం.888 ఇండియా చేరుకున్నాడు. ఇక విదేశ గుఢచారులకు భయపడవలసిన అవసరంలేదు. ఏర్ పోర్ట్‌లోకి వెళ్ళగానే పోలీసువాళ్ళను పిలిచి తనకు రక్షణ ఏర్పరచుకోవచ్చు. హోం మినిస్టరీకి తెలియచేస్తే ఢిల్లీకి వెళ్ళడానికి ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తారు. విదేశంలో లేడాయె. తనను ఎవరో వెంటాడుతున్నారన్న భయమెందుకు?" అన్నాడు యుగంధర్. రాజు ఇంకో సిగరెట్ వెలిగించాడు.

"ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. నెం.888కి ఎవరు టెలిఫోను చేశారు? అసలు నెం.888 బొంబాయిలో విమానంలో దిగాడని, అతను దిగేంతవరకూ ఎవరికీ, ఆఖరికి హోం మినిస్టర్‌కి కూడా తెలియదు. అలాంటప్పుడు ఎలా అతనికి ఎవరో టెలిఫోను చేశారు?"

"సార్! దీన్నిబట్టి చూస్తే బొంబాయిలో దిగడానికి నెం.888 ముందుగానే ఏర్పాటు చేసుకునుండాలి కదూ!"

"అలాగే అనిపిస్తోంది. అయితే ఢిల్లీకి టిక్కెట్టు ఎందుకు కొన్నాడు?" అడిగాడు యుగంధర్.

"తనను వెంటాడుతున్న వార్ని మోసగించటానికి."

యుగంధర్ తల విదిలించాడు. "ప్రతి ప్రశ్నకీ సమాధానం ఒకటే వస్తోంది. అతన్నెవరో వెంటాడుతున్నారనీ, తప్పించుకునేందుకు బొంబాయిలో దిగాడనీ, విమానం దిగి ఏర్‌పోర్టు రెస్టొరెంటుకి నడుస్తున్నప్పుడు చేతిలో తోలుసంచి ఎవరికో ఇచ్చాడనీ తేలుతోంది. ఎవరో అతన్ని వెంటాడుతున్నట్లు అతనికి అనుమానం కలగడంవల్ల అలా చేసివుండాలి. నెం.888కి తనను ఎవరో వెంటాడుతున్నారని న్యూయార్క్‌లోనే తెలిసి ఉండాలి."

రాజు నవ్వాడు. "మనం ఆలోచించిన విషయాలే ఆలోచిస్తున్నాం" అన్నాడు.

యుగంధరూ నవ్వాడు. "అవును, మెదడు వేడెక్కుతోంది. మన అనుమానాలు సరయినవో కావో నిర్ధారణ చేసుకుందాం పద" అన్నాడు యుగంధర్.

గబగబ కిందకి దిగివెళ్ళి ఇద్దరూ టాక్సీ ఎక్కారు.

పోలీసు కమీషనర్ ఆఫీసుకి వెళ్ళమని యుగంధర్ చెప్పాడు డ్రైవరుతో. కారు నడుస్తున్నంతసేపూ దీర్ఘాలోచనలో ఉన్నాడు. కారు దిగి తిన్నగా కమిషనర్ గదిలోకి వెళ్ళాడు. కమీషనర్ యుగంధర్ని చూడగానే "రండి, రండి!" అన్నాడు.

యుగంధర్ కూర్చోలేదు. "నేను స్పెషల్ బ్రాంచి డైరెక్టర్‌తో మాట్లాడాలి. ఎవరూ వినకుండా ఉండే ఏర్పాటు చేయగలరా?" అడిగాడు యుగంధర్.

పోలీసు కమీషనర్ లేచి నిలుచున్నాడు. బల్లమీద ఉన్న నాలుగు టెలిఫోనులలో ఒకదాన్ని పక్కకు తీసి, "మిస్టర్ యుగంధర్! ఇది నా ప్రయివేటు ఫోను, డైరెక్టరీలో దీని నెంబరు లేదు. దీన్ని ఉపయోగించండి. నేను బయటకు వెళతాను" అన్నాడు కమీషనర్.

"టెలిఫోను ఎక్స్చేంజ్?" అడిగాడు యుగంధర్.

"అక్కడ ఎవరూ మీ సంభాషణ వినకుండా నేను చూస్తాను. ట్రంక్ కనెక్షన్ ఇవ్వగానే ఆపరేటర్‌ని అక్కణ్నించి పంపించే ఏర్పాటు చేస్తాను" అని కమీషనర్ వెళ్ళిపోయాడు.

యుగంధర్ డైరీలో కాగితాలు తిరగేసి, ఒక నెంబరు చూసి, టెలిఫోనుతీసి "హల్లో! ఎక్స్‌ప్రెస్ ట్రంక్ కాల్! పర్టిక్యులర్ పర్సన్ కాల్ ఇప్పించండి" అన్నాడు. సరిగా అయిదు నిమిషాలలో స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ లైను మీదకు వచ్చాడు.

"మీ స్పెషల్ బ్రాంచి మనుష్యులందరికీ తెలుసా?" అడిగాడు యుగంధర్.

"నెం.888 గురించి అందరికీ తెలుసు. మా శాఖలో చాలాకాలంగా ఉన్న మనిషి అతను. చాలా ఘటికుడు కాని చాలామంది అతనెన్నడూ చూడలేదు."

"నెం.888కి మీ ఏజంట్లు చాలామంది తెలుసా?"

"ఆ!"

"అయితే వెంటనే ఒక విషయం వాకబుచేయండి నిన్న పొద్దున్న శాంటాక్రజ్ విమానాశ్రయంలో మీ ఏజంట్లు ఎవరైనా ఉన్నారా! ఉండివుంటే ఆ ఏజంటుకి ఎవరయినా ఓ తోలు సంచీ ఇచ్చారా?"

"సరే! వాకబు చేసి మీకు తెలియపరుస్తాను మీరెక్కడ బసచేశారు?"

"వెల్‌కం హోటల్లో, అక్కడికి ఫోను చేయకండి పోలీసు కమిషనర్‌కి ఫోను చేయండి. నేను అక్కణ్ణించి మీతో మాట్లాడతాను. జాగ్రత్తగా ఉండడం మంచిది ఇంకో విషయం. నెం.888 కి బొంబాయిలో ఎవరయినా స్నేహితులున్నారా?" అడిగాడు యుగంధర్.

స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ కాసేపు ఆలోచించి "అంత ఆప్తమిత్రులు ఎవరూ ఉన్నట్లు లేరు" అన్నాడు.

"నెం.888కి బొంబాయిలో ఎవరయినా ప్రియురాలు ఉండివుంటే మనకు సులభంగా, వెంటనే తెలిసే మార్గం ఏదయినా ఉన్నదా?" అడిగాడు యుగంధర్ మళ్ళీ.

"బొంబాయిలో మా ఏజంటున్నాడు. అతని నెంబర్.333. అతనూ చాలా కాలం నుంచి మా శాఖలో పనిచేస్తున్నాడు. అతనికీ, నెం. 888కీ స్నేహం. బహుశా అతనికి తెలిసి ఉండవచ్చు" అనాడు డైరెక్టర్.

"నెం.333 ని కలుసుకోవడం ఎలా?"

"మిమ్మల్ని కలుసుకోమని కబురు పంపుతాను" అన్నాడు డైరెక్టర్.

యుగంధర్ టెలిఫోను పెట్టేసి, కమీషనర్‌కి థాంక్స్ చెప్పి, తను బస చేసిన హోటలుకి తిరిగి వెళ్ళాడు. వెంటనే భోజనం చేసి పడుకున్నాడు.

"రాజూ! కాసేపు నిద్రపో. నా ఊహ సరయినదయితే ఈ రాత్రి మనకు చాలా పని తగులుతుంది" అన్నాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు హోటలు కుర్రాడు తలుపు తట్టగానే యుగంధర్ నిద్రనుంచి లేచాడు. "ఏమిటి?" అడిగాడు.

"మీకోసం టాక్సీ వచ్చింది సార్! పంపమని కంపెనీకి ఫోను చేశారుట మీరు" అన్నాడు ఆ కుర్రాడు.

అప్పుడే నిద్రలోంచి మేల్కొన్న రాజు చటాలున నిలబడి ఆశ్చర్యంతో చూశాడు. "ఈ చీటీ ఇవ్వమన్నాడు డ్రయివర్!" అన్నాడు ఆ కురాడు.

యుగంధర్ ఆ చీటీ తీసుకున్నాడు. అచ్చువేసిన కార్డు అది."స్పీడ్ బ్రయిట్ టాక్సీ కంపెనీ. టాక్సీ నెం.3333. డ్రయివర్ నెం.333" అని కార్డుమీద ఉంది.

యుగంధర్ ఆ కార్డును జేబులో పెట్టుకుని "ఉండమని చెప్పు! మూడు గంటలకు రమ్మని చెప్పిన విషయం మర్చేపోయాను" అన్నాడు ఆ కుర్రాడితో. రాజును డ్రెస్ చేసుకోమని చెప్పి, తనూ గబగబా డ్రెస్ చేసుకున్నాడు. అయిదు నిమిషాలలో టాక్సీ దగ్గిర కెళ్ళారు ఇద్దరూ.

కాకీ పాంటూ, కాకీ కోటూ, టోపీ పెట్టుకున్న డ్రయివర్ యుగంధర్‌కి సెల్యూట్ చేసి, కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. రాజూ, యుగంధరూ కారు ఎక్కగానే డ్రయివర్ సీట్లోకి వెళ్ళి కారు స్టార్టు చేసి, మీటర్ ఫ్లాగ్ నొక్కి కారును పోనిచ్చాడు. కారు కొంతదూరం వెళ్ళాక అతను "యుగంధర్ గారూ!" అన్నాడు.

"అవును. కారు మలబార్ హిల్స్‌వైపు నడుపుతాను. మీరు మాట్లాడవలసినది కారు వెళుతుండగానే మాట్లాడడం మంచిది" అన్నాడు అతను.

"గుడ్! నెం.888 మీకు బాగా తెలుసా!"

"తెలుసు. మా వృత్తిలో మాకు ఎవరితోనూ మా స్నేహాలు ఏర్పడేందుకు అవకాశం చాలా తక్కువ. కాని నెం.888, నేనూ చాలా కాలంగా స్నేహితులం" అన్నాడు.

"నిన్న నెం.888 శాంటాక్రజ్‌లో దిగినపుడు మీరు ఆయన్ని చూశారా?"

"లేదు. అతను వస్తున్నాడని నాకు తెలియదు. మా డిపార్టుమెంటుకి కూడా తెలియదు. అతనెక్కడున్నదీ తెలిస్తే వెంటనే తెలియజేయమని పైనుంచి ఆర్డరు వచ్చింది."

"మీరు కాక ఈ ఊళ్ళో అతనికి స్నేహితులు మరెవరయినా ఉన్నారా?"

"లేరు."

"అతనికి వివాహం అయిందా?"

"లేదు"

"అతనికి ఇక్కడ ఎవరైనా ప్రియురాలు ఉన్నదా?" అడిగాడు యుగంధర్. నెం.333 జవాబు చెప్పలేదు.

"నేను అడిగే ప్రశ్నలకు సందేహించకుండా జవాబు చెప్పమని మీకు పై అధికారులనుంచి కబురు రాలేదూ?"

నెం.333 తల ఊపాడు.

"అయితే సందేహించకండి!"

"నెం. 888 హాని కల్గజేయడం నాకు ఇష్టంలేదు. మీరు మా డిపార్ట్‌మెంటు మనిషి కారు. మీరు 888 ని గురించి ఎందుకు వాకబు చేస్తున్నారో, ఆ అనుమతి మీకు ఎందుకు ఇచ్చారో నాకు తెలియదు."

"నాకా అనుమతి ఎందుకిచ్చారని మీరనుకుంటున్నారు?" అడిగాడు యుగంధర్.

"మా డిపార్టుమెంటులోని ఏజంట్ల ప్రవర్తనను గురించి దర్యాప్తు చేయడానికి మిమ్మల్ని నియమించారు కదూ?" అడిగాడతను.

యుగంధర్ నవ్వాడు. "కాదు. నా పని అంతకన్నా చాలా ముఖ్యమైనది."

"ఏమిటి అనే ప్రశ్న స్పెషల్ బ్రాంచి ఏజంట్లు అడగడం తప్పని అనుకుంటాను. నేను మీకు ఏమీ చెప్పలేను. నా అనుమానం నిజమయితే నెం.888 చాలా ఆపదలో చిక్కుకున్నాడు. అతన్ని రక్షించడానికి ఈ దర్యాప్తు తోడ్పడుతుంది" అన్నాడు యుగంధర్.

"మీరు డిపార్టుమెంటులో కొత్తగా చేరారా?"

"లేదు. తాత్కాలికంగా పనిచేస్తున్నాను. నా ప్రశ్నకు జవాబు చెబుతారా?" అడిగాడు యుగంధర్.

"నెం.888కి ఒక స్నేహితురాలున్నది. ఆ అమ్మాయి పేరు లత. నెం.888 నీ, లతనూ ఒక రోజున జుహూ బీచిలో చూశాను" అన్నాడు నెం.333.

"ఆ అమ్మాయి ఎక్కడుంటున్నదో తెలుసా?" అడిగాడు యుగంధర్.

"తెలీదు. కాని ఆ అమ్మాయి ఓ రోజు పొద్దున్న ఓ ఆఫీసులోకి వెళుతుండగా చూశాను. బహుశా అక్కడ పనిచేస్తున్నదేమో!"

"ఆ ఆఫీసు ఎక్కడ ఉన్నదీ జ్ఞాపకమున్నదా?" అడిగాడు యుగంధర్.

"ఆ! దాదర్‌లో."

యుగంధర్ చేతి గడియారం చూసుకున్నాడు. "ఇంకా ఆఫీసులు మూసేవేళ కాలేదు. అక్కడికి పోనీయండి కారుని" అన్నాడు.

పదిహేను నిమిషాలలో దాదర్లో ఒక అయిదంతస్తుల మేడముందు కారు ఆపాడు నెం.333. కింద అంతస్తులోనే 'ఓరియంటల్ ట్రేడర్స్' అనే బోర్డు కనిపించింది. "ఇదే ఆ ఆఫీసు" అన్నాడు నెం. 333.

యుగంధర్ రాజువంక చూసి వెళ్ళమని చెప్పాడు. రాజు లోపలకు వెళ్ళి అయిదు నిమిషాలలో తిరిగివచ్చి లత అనే పేరుగల అమ్మాయి ఎవరూ ఆ కంపెనీలో ఉద్యోగం చేయడం లేదని చెప్పాడు.

"ఈ ఆఫీసులోకే వెళ్ళిందని మీకు సరిగా జ్ఞాపకమున్నదా? " అడిగాడు యుగంధర్ నెం.333 ని.

"అవును. మేము ఏదీ మరిచిపోము. నాకు అలా శిక్షణ ఇస్తారు" అన్నాడు నెం.333.

"లత ఎలా ఉంటుందో చెప్పండి?" అడిగాడు యుగంధర్.

నెం.333 లతని వర్ణించాడు. పంజాబీ దుస్తులు వేసుకుంటుంది. తెల్లగా సన్నగా నొక్కు జుట్టు రెండు జడలు వేసుకుంటుంది. కోల మొహం అయిదడుగుల రెండంగుళాల పొడుగుంటుంది. కుడివైపు చెంపమీద నల్లని చిన్న పుట్టుమచ్చ కాటుక చుక్కమల్లే ఉంటుంది. చెవులకు లోలకులు. పెద్దకళ్ళు, కళకళ మొహం. నవ్వుతున్నప్పుడు బుగ్గలమీద సొట్టలుపడతాయి. ఇరవై రెండుఏళ్ళు ఉంటాయి.

యుగంధర్ రాజువైపు తిరిగి "ఆ ఆఫీసులో ఎవరైనా స్త్రీలు పనిచేస్తున్నారా?" అడిగాడు.

"ఒక ఆంగ్లో ఇండియన్ అమ్మాయి ఎంక్వయిరీ గుమస్తా, ఒక టైపిస్టు హిందూ యువతి ఉన్నారు."

"లత ఆనవాలు చెప్పి, ఆమె ఎక్కడున్నదీ వాళ్ళకు తెలుసేమో అడుగు!" అని రాజుని పంపాడు యుగంధర్.

పదినిమిషాల తర్వాత రాజు తిరిగి వచ్చాడు.

"యస్ సార్! లత టైపిస్టు స్నేహితురాలట. ఆ టైపిస్టుని కలుసుకునేందుకు ఇక్కడికి వచ్చిందట" అన్నాడు రాజు.

"ఎక్కడుంటోంది?"

"కమలాదేవి ఉమెన్స్ హాస్టల్లో ఉంటున్నదట ఏ.జి. ఆఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తాగా పనిచేస్తున్నదట" అన్నాడు రాజు.

యుగంధర్ చేతిగడియారం చూసుకున్నాడు.

"ఏ.జి.ఆఫీసు ఇక్కడికెంత దూరం?" అడిగాడు నెం.333ని.

"ఆరుమైళ్ళున్నది."

"అయితే ఆఫీసు మూసేలోగా అక్కడికి చేరుకోలేము. ఎక్కడన్నా ఆగి కాస్తకాఫీ తాగి, అరగంట తర్వాత కమలాదేవి హాస్టలుకు వెళితే లత వచ్చి ఉంటుంది" అన్నాడు యుగంధర్.

నెం.333 కారు స్టార్టు చేశాడు. అరఫర్లాంగు వెళ్ళిందో లేదో నెం.333 "యుగంధర్!" అని పిలిచాడు.

"ఏమిటి?"

"ఎవరో మనల్ని వెంటాడుతున్నారని అనుమానంగా ఉంది నాకు. మనం ఆఫీసుముందు కారు ఆపగానే మనకు వెనక కొంచెం దూరంలో ఓ నల్లని కారు ఆగింది. మనం బయలుదేరగానే మన వెనకే బయలుదేరింది" అన్నాడు నెం.333.

యుగంధర్ వెనక్కు తిరిగి చూడలేదు.

"రెండు మూడు వీధులు తిరిగి మళ్ళీ ఇక్కడికే తీసుకురండి" అన్నాడు.

రెండుమూడు వీధులు తిప్పి కారుని మళ్ళీ అదే చోటికి తీసుకువచ్చాడు నెం.333. "ఆ నల్లకారు ఇంకా మన వెనకాలే వస్తోంది సార్!" అన్నాడు.

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. "మమ్మల్ని మా హోటలు దగ్గర దింపేయండి.మీరు వెళ్ళిపొండి. అరగంట తర్వాత కమలాదేవి హాస్టల్ దగ్గరికి వచ్చివుండండి. మీ టాక్సీ తీసుకురావద్దు" అన్నాడు యుగంధర్.

"మీ రెక్కడ బసచేసిందీ వెంటాడుతున్నవారికి ఎందుకు తెలియాలి" అడిగాడు నెం.333.

"వాళ్ళకు తెలిసే ఉంటుంది. లేకపోతే మనల్ని ఎలా వెంటాడి ఉంటారు? మేము వెళ్ళడమే మంచిది."

నెం.333 యుగంధర్ని, రాజుని వెల్‌కం హోటలు ముందు దింపాడు. తమ వెనకే నల్లని కారు కొంచెం దూరంలో ఆగడం చూశాడు యుగంధర్. జేబులోంచి పర్సుతీసి, నోట్లు లెక్కపెట్టి నెం.333 కి ఇచ్చాడు. "మీ ఆనవాలు కూడా వాళ్ళకు తెలియకుండా ఉండనీయండి" అన్నాడు నెమ్మదిగా. నెం.333 సలాం పెట్టి వెళ్ళిపోయాడు.

యుగంధరూ, రాజూ హోటల్లోకి అడుగుపెట్టగానే మేనేజర్ ఎదురు వచ్చి "సార్! ఎవరో మీకు ఒక పెద్ద ట్రంకు పెట్టె ఇచ్చి వెళ్ళారు" అన్నాడు.

"ట్రంకు పెట్టా!" అన్నాడు యుగంధర్ ఆశ్చర్యంతో.

"అవునుసార్! మీ గదిలో పెట్టించాను. చాలా బరువుగా ఉంది. నలుగురు కూలీలచేత మోయించాను" అన్నాడు అతను నవ్వుతూ.

యుగంధరూ, రాజూ గబగబ వాళ్ళ గదిలోకి వెళ్ళారు. గది మధ్య ఒక పెద్ద ట్రంకు పెట్టె ఉన్నది. యుగంధర్ తలుపు గడియపెట్టి పెట్టె దగ్గిరికి వచ్చి నిలుచున్నాడు. పెట్టె తెవడానికి ఒంగాడు యుగంధర్.

"ఆగండి సార్!" అని చెయ్యి పట్టుకుని వెనక్కి లాగాడు రాజు.

"ఏం?" అడిగాడు యుగంధర్.

"అందులో ఏమున్నదో మనకు తెలియదు. టయింబాంబుండవచ్చు. మనం తెరవగానే పేలేటట్టు ఏర్పాటు చేసివుండవచ్చు. మనం ఈ కేసులో పని చేస్తున్నామని అవతలవాళ్ళకు తెలిసి ఉంటుంది. లేకపోతే మనల్ని ఎవరో ఎందుకు వెంటాడుతారు? ఒద్దు. తెరవద్దు" అన్నాడు రాజు ఉద్రేకంతో.

యుగంధర్ లేచి నిలుచున్నాడు. "అవును. జాగ్రత్తగా ఉండడంలో తప్పులేదు" అని కిందకి దిగి వెళ్ళి, మేనేజర్ బల్లమీద టెలిఫోను తీసి, గవర్నమెంట్ ఎక్స్‌ప్లోజివ్స్ శాఖకు ఫోను చేశాడు.

"హల్లో! ఛీఫ్ ఆఫీసర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ బడార్కర్‌కి కనెక్ట్ చెయ్యండి" అన్నాడు. బండార్కర్‌తో యుగంధర్‌కు బాగా పరిచయమున్నది. అతను టెలిఫోనులో పలకగా "మీ సహాయం కావాలి" అన్నాడు. "ఏమిటది చెప్పండి. వెంటనే చేస్తాను."

"ఎక్స్‌ప్లోజివ్ డిటెక్టర్ ఒకసారి కావాలి. నేను మనిషిని పంపుతాను. పంపించగలరా?" అడిగాడు.

"మీరు మనిషిని పంపడం దేనికి? నేనే పంపిస్తాను. ఎక్కడికి పంపించమంటారు?"

"వెల్ కం హోటలుకి. అర్జంటు. థాంక్స్" అని యుగంధర్ టెలిఫోను పెట్టేసి అక్కడే నిలుచున్నాడు. సరిగా ఇరవై నిమిషాలలో బండార్కర్ పంపిన మనిషి వచ్చాడు. యుగంధర్ అతని దగ్గర ఉన్న ఒక పనిముట్టును అడిగి తీసుకుని మేడమీదకు వెళ్ళాడు.

"ఏమిటది సార్!" అడిగాడు రాజు.

"ఎక్స్‌ప్లోజివ్ డిటెక్టర్. ఈ పరికరంలో వున్న మీటర్ దరిదాపుల్లో ఎక్కడయినా ఏదయినా బాంబున్నదీ లేనిదీ చూపుతుంది" అని ఆ పరికరాన్ని ఆ పెట్టెమీద పెట్టాడు.

యుగంధరూ, రాజూ ఆత్రంగా మీటర్ వైపు చూశారు. మీటర్ మీద ముల్లు కదలలేదు. రాజు బరువుగా ఊపిరి ఒదిలాడు. "రాజూ! ఈ పరికరం మేనేజర్ బల్లదగ్గరున అతనికిచ్చి అతన్ని పంపివెయ్యి. బండార్కకి నా థాంక్స్ చెప్పమను" అని యుగంధర్ చెప్పగానే రాజు దాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

యుగంధర్ మోకాళ్ళమీద కూర్చుని పెట్టెమూత తెరవడానికి ప్రయత్నించాడు. తాళం వేసివుంది. జేబులోంచి మారుతాళాల గుత్తితీసి ఒక తాళం ఏరి దానితో మూత తెరిచాడు. తెరిచి అలాగే మూతను పట్టుకున్నాడు. పెట్టెలోకి చూస్తున్నాడు. అలా చూస్తూ ఊపిరి పీల్చడం మరచిపోయాడు.

పెట్టెలోకి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. రాజు గదిలోకి రావడం యుగంధర్ చూడలేదు. రాజు అడుగుల చప్పుడు అతనికి వినపడలేదు.

"పెట్టెలో ఏముంది సార్!" అంటూ రాజు వెనకగా వచ్చి ఒంగి చూసి, నోటమాటలేకుండా ఉండిపోయాడు.

అది చాలా పెద్ద పెట్టె. పెట్టెలో గెడ్డానికి మోకాలు తగిలేటట్టు ముడుచుకుని పడుకున్నాడు ఓ మనిషి. ప్రాణం లేదు. మొహం కనిపించడంలేదు. మొహం మీద ఓ తోలు సంచి ఉంది. దానికి జిప్ ఉంది. దాని మీద సిరాతో నెం.888 అని రాసి ఉంది..!!

***

## 4

ఎవరో తలుపు తట్టారు.

యుగంధర్ చప్పున పెట్టె మూసేశాడు. రాజు వెళ్ళి తలుపు తీశాడు.

"మీకు ఉత్తరం వచ్చింది సార్!" అన్నాడు హోటలు కుర్రాడు ఒక కవరు అందిస్తూ.

రాజు ఆ కవరు తీసుకుని, మళ్ళీ తలుపు లోపల గడియ పెట్టి "మీకే సార్!" అన్నాడు యుగంధర్‌కి ఇస్తూ,

"చింపి చదువు" యుగంధర్ పరధ్యానంగా అన్నాడు.

రాజు కవరు చింపాడు. అందులోంచి ఒకే ఒక తెల్ల కాగితం బయటికి తీశాడు.

"మైడియర్ మిస్టర్ యుగంధర్!

మీ మీద మాకు చాలా గౌరవం. అందుకే ఈ హెచ్చరిక పంపుతున్నాము. మేము సామాన్యమైన దొంగలము కాము. మీలా మాకు మా దేశమంటే భక్తి. మాతృదేశం కోసం ఏమైనా చేస్తాము. అంతర్జాతీయ గూఢచారిత్వం సామాన్య అపరాధ పరిశోధన కాదు. అపరాధ

పరిశోధనలో మీరు గొప్పవారు. కాని గూఢచారిత్వం చాలా ప్రమాదకరమైనది. తన పనిని నిర్వహించడానికి చెయ్యకూడని పని అంటూ ఉండదు గూఢచారికి, అందుకే హెచ్చరిస్తున్నాం.

దయచేసి తక్షణం మీరు ఈ పనిలోంచి విరమించుకుని, మద్రాసుకి వెళ్ళిపొండి. మీకే హాని జరగదు.

లేదా!

మీకు వచ్చిన పెట్టెలాంటి పెట్టెలో మిమ్మల్ని పెట్టి హోం మినిష్టర్‌కి పంపవలసి వస్తుంది.

భగవంతుడు మీకు వివేకం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము."

రాజు ఉత్తరం చదివి, యుగంధర్ వైపు చూశాడు. రాజు పిరికివాడు కాడు కాని గది మధ్య ఉన్న ట్రంకు పెట్టె, పెట్టెలో శవం జ్ఞాపకం రాగానే అతని మొహంలో నెత్తురు చుక్కలేదు.

యుగంధర్ నవ్వాడు. "మనకు తెలియకుండానే మనం పురోగమిస్తున్నాం. మనం తెలుసుకున్న విషయాలలో ముఖ్యమైన విషయాలు ఏవో కొన్ని ఉన్నాయన్నమాట. లేకపోతే ప్రతి కక్షులు నన్ను బెదిరించడానికి ప్రయత్నించరు" అన్నాడు యుగంధర్.

యుగంధర్ ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో మట్లాడేసరికి కొత్త ధైర్యం వచ్చింది. "మనం తెలుసుకున్న విషయాలలో ముఖ్యమైనదేదో గ్రహించగలిగితే ముందుకు సాగవచ్చు" అన్నాడు.

"ముందు ఈ పెట్టెలో ఉన్న అభాగ్యుడెవరో తెలుసుకుందాం" అని యుగంధర్ మళ్ళీ ట్రంకు పెట్టె తెరిచాడు. మొహం మీద ఉన్న తోలుసంచిని దాని మీద వ్రాసి ఉన్న నెం.888 ని చూస్తూ ఆలోచించసాగాడు.

"ఇంకెవరు? నెం. 888" అన్నాడు రాజు.

యుగంధర్ తల విదిలించాడు. "కాదు" అన్నాడు.

"తోలు సంచి ఉంది. దాని మీద నెంబరూ ఉంది" అన్నాడు రాజు.

"నెం.888 ని ప్రతి కక్షులు చంపి ఉండరు. చంపితే వారికే నష్టం. రాజూ! ప్రతి కక్షులు మనల్ని బెదిరిస్తూ ఉత్తరం రాసారంటే వాళ్ళ పని పూర్తికాలేదని మనం గ్రహించవచ్చు. వాళ్ళ చేతికి ఆ రహస్య పత్రాలు చిక్కివుంటే మనల్ని బెదిరించడంలో కాలం వృధాచేయరు. ఆ కాగితాలు పుచ్చుకుని వాళ్ళ స్వదేశానికి తుర్రుమని పారిపోతారు. వాళ్ళింకా ఇక్కడే ఉన్నారంటే వాళ్ళకు ఆ రహస్యపత్రాలు దొరకలేదన్నమాట. అవి ఎక్కడున్నదీ ఒక్క నెం.888కే తెలుసు. అతన్ని చంపితే ఆ కాగితాలు దొరికే అవకాశం పోతుంది. నెం.888 వాళ్ళ చేతుల్లో చిక్కివుంటే ఇప్పటికింకా సజీవంగానే ఉండివుంటాడు. లేదా అతను వాళ్ళకు కనిపించకుండా ఎక్కడో దాక్కుని ఉండాలి - ఆ దాక్కున్న చోటునుంచి బయటకి వచ్చి అధికారులకు తెలిపే అవకాశం అతనికి లేకపోవచ్చు" అన్నాడు యుగంధర్.

రాజు ఒక నిమిషం ఆలోచించి "ప్రతి కక్షులు ఒక వర్గం వారేనని ఎలా నిశ్చయించగలం? మనకు ఈ హెచ్చరిక పంపింది ఒక దేశం గూడచారులయి ఉండవచ్చు. నెం.888 ఇంకో దేశం గూఢచారులకు చిక్కివుండవచ్చు. వారు అతన్ని చంపి కాగితాలను తీసుకుని వాళ్ళదేశం వెళ్ళిపోయి ఉండవచ్చు" అన్నాడు.

యుగంధర్ నవ్వాడు. "మనకు వచ్చిన హెచ్చరికలో ట్రంకు పెట్టెను గురించి రాశారని మర్చిపోతున్నావు రాజూ! నువ్వు వెళ్ళి నలుగుర్ని పిలుచుకురా. ఒక టాక్సీ గుమ్మం దగ్గర ఆపమని చెప్పు" అన్నాడు యుగంధర్.

పదినిమిషాల తర్వాత యుగంధరూ, రాజూ టాక్సీలో పోలీసు కమీషనర్ ఆఫీసుకు బయలుదేరారు. కారు వెనక సీటు దగ్గర శవం ఉన్న ట్రంకు పెట్టెను పెట్టుకున్నారు. కమీషనర్ ఆఫీసుకు చేరుకోగానే ఆ పెట్టెను వసారాలో పెట్టించి, యుగంధర్ కమీషనర్‌ని కలుసుకున్నాడు.

"నేను ఒక ట్రంకు పెట్టె తెచ్చి వసారాలో పెట్టించాను. అందులో ఒక శవం ఉంది. పోస్టుమార్టం చేయించి చావుకు కారణం కనుక్కోండి. ఆ మనిషి ఎవరో కనుక్కోగలిగితే మరీ మంచిది. మిమ్మల్ని తర్వాత మళ్ళీ కలుసుకుంటాను" అని చెప్పి హడావిడిగా యుగంధర్ అక్కణ్ణించి బయలుదేరాడు.

టాక్సీ ఎక్కి కమలాదేవి హాస్టల్ ప్రాంతాలకు వెళ్ళి ఒక అర ఫర్లాంగు దూరంలో ఆపమని చెప్పాడు డ్రయివరుతో. కారు కదలగానే వెనక్కి ఆనుకుని కళ్ళుమూసుకున్నాడు.

"ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు?" అడిగాడు రాజు.

"మనం ఇలా రహస్య పత్రాలకోసం అన్వేషణ ప్రారంభించాం అని ప్రతి కక్షులకు ఎలా తెలిసింది? బాహాటంగా మనం పరిశోధన చెయ్యలేదు. చాలా గోప్యంగా ఉంచాము. అయినా ఎలా తెలిసింది? ఏర్ పోర్ట్ బట్లర్ని, టెలిఫోను ఆపరేటర్ని మాత్రమే నెం.888 గురించి మనం అడిగాం" అన్నాడు యుగంధర్.

"అవును, ఆ మాటకొస్తే ఏర్‌పోర్ట్ మేనేజర్‌ని కూడా అనుమానించాలి. ఎవరు పర ప్రభుత్వం డబ్బు తింటూ గూఢచారులుగా పనిచేస్తున్నారో ఊహించడం కష్టం" అన్నాడు రాజు.

"అవును. మనం ప్రశ్నించిన వారిలో ఎవరో విదేశగూఢచారులున్నారు. వాళ్ళెవరో తెలుసుకుంటే వారి ద్వారా కొంత ఆచూకీ తియ్యవచ్చు" అని టాక్సీ ఆపమని చెప్పి, యుగంధర్ దగ్గిర వున్న టెలిఫోను బూత్‌లోకి వెళ్ళి అయిదు నిమషాలలో తిరిగివచ్చాడు. కమలాదేవి ఉమెన్స్ హాస్టల్‌కి అరఫర్లాంగు దూరంలో టాక్సీ ఆగింది. అదేనండి హాస్టల్" అని చెప్పాడు డ్రయివర్, టాక్సీకి డబ్బిచ్చి యుగంధరూ, రాజూ హాస్టల్ వైపు నడిచారు. హాస్టల్ గేటులోకి వెళ్ళబోతుండగా "సార్!" అని వెనకనుంచి పిలుపు వినపడింది.

యుగంధరూ, రాజూ ఒకేసారి వెనక్కి తిరిగిచూశారు.

రిబ్బన్లు, గుండీలూ; జేబు రుమాళ్ళూ అమ్ముతున్న ఒక మనిషి వాళ్ళ దగ్గిరకు వచ్చాడు.

"సార్! మంచి రోల్డుగోల్డ్ గుండీలు సార్! చాలా చవుక" అన్నాడు.

రాజు విసుగ్గా అతన్ని చూసి "గుండీలు వద్దు. ఏమీవద్దు" అని వెనక్కి తిరిగాడు.

యుగంధర్ ఆ మనిషిని చూశాడు. వెండి ఫ్రేము కళ్ళదాలు, మాసిన గెడ్డం, తురక టోపీచూసి చిరునవ్వుతో "ఈ ప్రాంతంలోనే ఉండు. తిరిగి వచ్చేటప్పుడు గుండీలు కొంటాను" అన్నాడు ముందుకి సాగిపోతూ.

"మనకు గుండీలెందుకు సార్!" అడిగాడు రాజు.

యుగంధర్ జవాబు చెప్పకుండా నవ్వాడు.

యుగంధరూ, రాజూ హాస్టలులోకి వెళ్ళి "లత ఉందా?!" అని అడిగారు హాల్లో కనిపించిన అమ్మాయిని చూసి.

ఆ అమ్మాయి ఆ ఇద్దర్నీ ఎగాదిగా చూసి చరచరా లోపలకు వెళ్ళింది. అయిదునిమిషాలలో ఇంకో అమ్మాయి వచ్చింది. యుగంధర్ మళ్ళా "లత ఉందా?"అని అడిగాడు. ఈ అమ్మాయీ జవాబేమీ చెప్పకుండా లోపలకు పరిగెత్తింది.

మొదట లోపలకు వెళ్ళిన అమ్మాయి కాసేపటికి తిరిగివచ్చిది. "మేట్రన్ వస్తున్నారు. కూర్చోండి" అంది.

"మేట్రన్ కాదు కావలసింది. ఈ హాస్టల్లో లతానే ఆమె ఉంది. ఆమె కావాలి" అన్నాడు యుగంధర్ చిరాకుగా.

ఆ అమ్మాయి జవాబు చెప్పకముందే నలభై యేళ్ళ ఆమె చరచరా హాల్లోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే యుగంధర్ వైపు తిరిగి "ఎవరు మీరు?" అని అడిగింది. ఆమె ఠీవి, గాంభీర్యమూ చూసి ఆమె మేట్రన్ అయి ఉండాలని యుగంధర్ అనుకున్నాడు.

"లతనే ఆమె ఈ హాస్టల్లో ఉన్నదా?" అడిగాడు.

మేట్రన్ మొహం చిట్లించి, "మీ పేరేమిటి? ఆమెతో మీకేం పని?" అని అడిగింది.

"నా పేరు శర్మ" అన్నాడు యుగంధర్.

"లతతో మీకేం పని?"

"చాలా అంతరంగికమైన విషయం మాట్లాడాలి."

"సూచనగా చెప్పండి."

"చెప్పలేను."

"అయితేకాసేపు కూర్చోండి" అని కుర్చీ చూపించి మేట్రన్ లోపలకు వెళ్ళింది. అయిదునిముషాలు గడిచాయి. యుగంధర్ చాలా కోపంగా లేచి నిలుచున్నాడు.

"ఈ మేట్రన్ ప్రవర్తన, ఈ హాస్టల్లో మనుష్యుల ప్రవర్తన చాలా విచిత్రంగా ఉందే" అంటుండగా బయట బూట్సుల చప్పుడయింది. అటు చూశాడు. యూనిఫారంలో ఉన్న ఒక పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సార్జెంట్ని వెంటపెట్టుకుని హాల్లోకి వస్తున్నాడు. సరిగా అదే సమయానికి మేట్రన్ హాల్లోకి వచ్చింది.

యుగంధర్ ఆమెవైపు తిరిగి "మమ్మల్ని కూర్చోమని చెప్పి -" అంటుండగా ఆమె అతని మాటలకు అడ్డం వచ్చి "దయచేసి ఆ పోలీసు ఉద్యోగితో మాట్లాడండి" అని, సబ్ ఇన్స్పెక్టర్ వైపు తిరిగి "వీరే  నేను చెప్పిన మనుష్యులు" అన్నది. సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ దగ్గరకు వచ్చాడు. "మీరెవరు?" అడిగాడు.

"నా పేరుశర్మ" అని చెప్పాడు యుగంధర్.

"మీకు లతతో ఏం పని?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"మీ కెందుకు చెప్పాలి?" ఎదురు ప్రశ్న వేశాడు యుగంధర్

ఇన్స్పెక్టర్ యుగంధర్ని ఎగాదిగా చూశాడు. "చెప్పవలసిన అవసరం ఉంది కనకే అడిగాను" అన్నాడు.

"చెప్పను" అన్నాడు యుగంధర్.

"అయితే నాతో పోలీసు స్టేషన్కి రావలసి వస్తుంది" అన్నాడు ఇన్స్పెక్టర్. యుగంధర్ తలవూపాడు.

"పదండి!" అని కాస్త గట్టిగా అని సార్జంటు వైపు చూసి తల తిప్పి బయటికి దారితీశాడు ఇన్స్పెక్టర్. గేటు దాటగానే యుగంధర్ ఇన్స్పెక్టర్ వైపు తిరిగి "ఇన్స్పెక్టర్! హాస్టల్లో అందరిముందూ నేనెవర్నో చెప్పడం ఇష్టంలేక అబద్ధమాడాను" అంటూ తన జేబులోంచి హోం మినిష్టరు ఇచ్చిన అధికార పత్రాన్ని చూపించాడు. దాన్ని చూడగానే ఇన్స్పెక్టర్ మొహం చిన్నబోయింది. తడబడుతూ "క్షమించండి. మిమ్మల్ని పూర్వం నేను ఎప్పుడూ చూడలేదు" అని యుగంధర్ చెయ్యిపట్టుకున్నాడు.

"దానికేం తప్పుమీది కాదు" అని సర్ది, యుగంధర్ ఇన్స్పెక్టర్ను లతను గురించి అడిగాడు.

"ఇవాళ పొద్దున్నే లత అనే అమ్మాయి కనబడడం లేదని మాకు కంప్లయింటు ఇచ్చింది మేట్రన్" అని చెప్పాడు ఇన్స్పెక్టర్.

"దయచేసి వివరంగా చెప్పండి" యుగంధర్ అడిగాడు.

"వివరాలు అట్టేలేవు. లత అనే అమ్మాయి ఆ హాస్టల్లో రెండేళ్ళనుంచీ ఉంటున్నది. ఆ అమ్మాయి ఊరు రేవా. ఏ.జి. ఆఫీసులో పనిచేస్తున్నది. నిన్న మధ్యాహ్నం ఆఫీసుకు శెలవు పెట్టిందిట. ముగ్గురు స్నేహితురాళ్ళతో మెట్రో థియేటరుకు మధ్యాహ్నం ఆటకు వెళ్ళిందిట. సినిమా అయిన తర్వాత ఆ నలుగురూ దగ్గర ఉన్న ఇరానీ హోటలుకి వెళ్ళారు. హోటల్లో ఫలహారాలు తింటూ ఉండగా ఎవరో ఒకామె వారి బల్ల దగ్గిరికి వెళ్ళి లతను తనతో రమ్మనీ, మాట్లాడాలనీ చెప్పిందిట. లత వెంటనే లేచి ఆమెతో బయటకు వెళ్ళిందట. ఆ ముగ్గురు స్నేహితురాళ్ళు ఒక గంటసేపు ఆ హోటల్లోనే కాచుకున్నారట లత కోసం, ఎంతసేపటికీ రాకపోయేసరికి ముగ్గురూ హాస్టల్కి వెళ్ళారు. లత అక్కడ లేదు. హాస్టల్కి రావలసిన టయం దాటిపోయింది. ఆ ముగ్గురూ జరిగిన సంగతి మేట్రన్కి

చెప్పారు. మేట్రన్ పొద్దున్న పదిగంటలవరకూ లత తిరిగివస్తుందేమోనని చూసింది. రాకపోయేసరికి ఆమె మాకు కంప్లయింటు ఇచ్చింది" అన్నాడు ఇన్స్పెక్టర్.

"మీరు దర్యాప్తు చేశారా?" అడిగాడు యుగంధర్.

ఇన్స్పెక్టర్ మొహం వంచుకున్నాడు. "ఇంకా దర్యాప్తు ప్రారంభించలేదు. ఆ హోటలు ప్రాంతాల్లో వాకబు చేయమని ఒక కాన్స్టేబుల్ని పంపాను. అంతే! ఇవాళంతా చాలా బిజీగా ఉండిపోయాను" అన్నాడు.

యుగంధర్ నవ్వి "బహుశా ఏ స్నేహితురాలి ఇంటికో వెళ్ళివుంటుందని అనుకున్నారు. అంతేనా! ఫర్వాలేదులెండి. నేను దర్యాప్తు చేస్తాను. ఆమె ఆచూకీ తెలిస్తే మీకు తెలియజేస్తాను. మీరు ఈ కేసులో జోక్యం కల్పించుకోకండి" అన్నాడు. ఇన్స్పెక్టర్ కాస్త సందేహంతో చూశాడు.

"నేను చెప్పానని కమీషనర్కు టెలిఫోను చేయండి. మీకేమీ చిక్కు కలగదు" అన్నాడు యుగంధర్.

ఇన్స్పెక్టర్ తలవూపి "మీతో పాటు నన్నూ దర్యాప్తు చెయ్యనిస్తే -?" అంటూన్నాడు.

"గుడ్! తప్పకుండా. అయితే ఈ విషయాలు తెలుసుకోండి. లత ఊరేది, తల్లితండ్రులెవరు, బొంబాయిలో బంధువులెవరైనా ఉన్నారా కనుక్కోండి" అని రాజుని చూసి సంజ్ఞ చేసి "ఇన్స్పెక్టర్! లతను పిలుచుకు వెళ్ళిన స్త్రీ ఆనవాలు చెప్పగలరా?" అడిగాడు.

"లత స్నేహితురాళ్ళు చెప్పారు. వయస్సు పాతికేళ్ళు. లేత గులాబీ రంగు చీర కట్టుకున్నది. కత్తిరిపు జుట్టు హైహీల్స్ షూస్, తెల్లని ఒళ్ళు, బొట్టులేదు. చేతులకు గాజులు లేవు. రిస్టువాచీ ఉంది. ఒక వేలికి ఖరీదైన ఉంగరం. తీర్చిదిద్దిన ముఖరేఖలు, సన్నని పల్చని పొడుగాటి ముక్కు, చిన్న నోరు, రంగు వేసుకున్న ఎర్రని పెదిమలు, నీలమూ, నలుపూ కాని కనుగుడ్లు" అని డైరీలో చూసి చెప్పాడు.

ఈ వర్ణన రాజు పుస్తకంలో వ్రాసుకున్నాడు.

"వెరీ గుడ్!" అన్నాడు యుగంధర్ ఇన్స్పెక్టర్ని వీపు మీద చరిచి. ఇన్స్పెక్టర్ సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. రాజు టాక్సీకోసం వచ్చేపోయే కార్లను చూస్తున్నాడు.

"గుండీలు సార్!" అంటూ యుగంధర్ కి ఎదురుగా వచ్చినిలుచున్నాడు వాళ్ళు లోపలకు వెళుతున్నప్పుడు ఎదురయిన మనిషి. యుగంధర్ జేబులోంచి చిల్లరతీసి గుండీలు కొన్నాడు. కొంటూ అతనికేదో రహస్యంగా చెప్పాడు. ఇంతలో రాజు ఒక టాక్సీని ఆపాడు. యుగంధరూ, రాజూ టాక్సీ ఎక్కారు.

***

**టాక్సీని పోలీసు కమీషనరు** ఆఫీసుకి వెళ్ళమన్నారు. కమీషనరు గదిలోకి వెళ్ళగానే "మా ఇద్దరికీ పోలీసు కానిస్టేబుల్ యూనిఫాంలు కావాలి" అన్నాడు యుగంధర్.

యుగంధర్ అలా అడగ్గానే కమీషనరు నవ్వి "కానిస్టేబుల్ యూనిఫాం కావలసిన ఖర్మమేం! మీకు కావలిస్తే ఐ.జి. యూనిఫాం ఇవ్వబడుతుంది" అన్నాడు.

"మాకు కానిస్టేబుల్ యూనిఫాంలే కావాలి" అన్నాడు యుగంధర్ కుర్చీలో కూర్చుంటూ.

కమిషనరు యూనిఫాం కోసం మనిషిని పంపి "మీరు తెచ్చిన శవం పరీక్ష పూర్తయింది ఇప్పుడే" అన్నాడు.

"చావుకు కారణం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

పోలీసు కమిషనరు మొహంలో మార్పు వచ్చింది. కళ్ళు పెద్దవి చేసి "ఉరి" అన్నాడు.

"ఆత్మహత్య చేసుకున్నాడా?" అడిగాడు యుగంధరు.

"ఆత్మహత్య కాదని డాక్టర్ అభిప్రాయం. ఆ మనిషి ఒంటిమీద చాలా గాయాలున్నాయి."

"ఏమిటవి?"

"వేళ్ళ చివర్న గోళ్ళకింద గుండుసూదులు గుచ్చినట్టు రక్తం చిమ్మివుంది. వీపుమీదా, అరిచేతులమీదా కాలుతున్న సిగరెట్టు పెట్టినట్టు బొబ్బలున్నాయి. మేకులమీద నిలబెట్టినట్టు అరికాళ్ళకింద చిల్లులు పడ్డాయి."

"అలాగా!" అన్నాడు యుగంధర్.

"ఆ మనిషి ఎవరో తెలిసేందుకు సూచనలేవీ లేవు. శవం వంటిమీద ఉన్న బట్టలు అతనివి కావు. చాలా ఒదులుగానూ, పొడుగ్గాను ఉన్నాయి. వాటిమీద చాకలి గుర్తులు కానీ, దర్జీ పేరుగానీ లేకుండా కత్తిరించేసారు. తోలుసంచి లోపల న్యూయార్కులోని ఒక షాపు పేరు ముద్రవేసి ఉంది. కనుక అది ఈ దేశంలో కొన్నది కాదు."

యుగంధర్ ఆలోచిస్తున్నాడు.

కమిషనర్ కుర్చీలోంచి లేచాడు. కిటికీ వరకూ వెళ్ళి బయటకు చూస్తూ "యుగంధర్! ఆ మనిషిని ఎవరో హింసించి, చంపారు!" అన్నాడు కమీషనర్. అతని గొంతు జీరపోయింది - కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

"అవును" అన్నాడు యుగంధర్ ముక్తసరిగా.

"యుగంధర్! మీరు దర్యాప్తు చేస్తున్న కేసేమిటో నాకు తెలీదు. చాలా ముఖ్యమైనదే అయివుండాలి. లేకపోతే కేంద్ర ప్రభుత్వం మిమ్మల్ని నియమించదు. మీకిన్ని అధికారాలు ఇవ్వదు. మీరు ఒంటరిగా, రహస్యంగా ఈ దర్యాప్తు జరపడం మీకు మంచిది కాదు. మీ ప్రతికక్షులు ఎవరైనా వారు చాలా క్రూరులూ, రాక్షసులూ అందులో సందేహం లేదు."

"అవును" అన్నాడు యుగంధర్.

"క్షమించండి యుగంధర్! మీ శక్తిసామర్థ్యాలలో గాని, మీ ప్రతిభావిశేషాలలో గాని నాకు విశ్వాసం లేక కాదు. ఎంతటి సమర్థుడైనా ఒంటరిగా సాధించలేనివి కొన్ని వుంటాయి" అన్నాడు కమీషనర్ మృదువుగా.

అప్పటికీ యుగంధర్ వైపు తిరిగాడు. అతని కళ్ళల్లో వాత్సల్యమూ, అభిమానమూ, ఆత్మీయతా గోచరిస్తున్నాయి. "యుగంధర్! ఓ ట్రంకుపెట్టెలో మీరు ఇక్కడికి తీసుకురాబడడం నాకు ఇష్టంలేదు. మీరు సమ్మతించినా, సమ్మతించకపోయినా ఈ క్షణం నుంచి మీ కూడా ఇద్దరు సాయుధ పోలీసులను పంపిస్తాను."

యుగంధర్ నవ్వాడు."బాగానే ఉంది. ఆ సాయుధ పోలీసులను పెట్టుకుని నేను చేసే పనేముంది! దానికి బదులు నేను ఇక్కడే కూర్చోవచ్చు."

"అది మరీ మంచిది. మీరిక్కడే ఉండండి. బయటకు వెళ్ళి చెయ్యవలసిన పనులుంటే ఇతర్లను పంపిద్దాం."

యుగంధర్ మొహం ఎర్రనయింది. "ప్రమాదాలుంటే అవి ఇతర్లని అనుభవించనియ్యమనీ, ప్రాణం పోయేటట్లయితే మరొకరి ప్రాణం పోనీయమనీ అంటారా! వీల్లేదు. మైడియర్ ఫ్రెండ్! నాలో ఏం వున్నా ఏదిలేక పోయినా పిరికితనం మాత్రంలేదు. ఏదయినా ప్రమాదం ఉంటే ఆ ప్రమాదాన్ని నేనే ఎదుర్కొంటాను. అభిమానం కొద్దీ మీరు ఇలా చెప్పారని నాకు తెలుసు. కాని ఈ కేసు పూర్తి అయ్యేంతలోపున ఇంకా ఎంతమంది ప్రాణాలు పోతాయో చెప్పలేను. దురదృష్టవశాత్తు నేను విజయం సాధించలేకపోతే కొన్ని ప్రాణాలే కాదు, వేలకు వేలు లక్షలకి లక్షలు జనం మరణిస్తారు.

"మైడియర్ కమిషనర్! హింసించి చంపబడిన ఆ మనిషి అలా చంపబడినందుకు మనం చింతించినా, అతని శవానికి మోకరిల్లి సాష్టాంగ నమస్కారం చేయాలి. తుపాకీ గుళ్ళకూ, కత్తిపోట్లకూ జడవకుండా యుద్ధరంగంలో దిగిన సైనికుడు నిజంగా వీరుడే కాని ఎంత చిత్రహింస పెట్టినా భరించి, ప్రాణాలు పోతున్నా మాతృ దేశ రక్షణకోసం రహస్యాలను శత్రువులకు వెల్లడి చేయని మనిషి వీరాధివీరుడు! మాతృదేశం కోసం ఈ విధంగా ప్రాణం అర్పించిన వీరాధివీరులకు స్మారక చిహ్నాలు నిర్మించరు. వీరి వీర గాథలు

బయటకు రావు. అవి నిగూఢంగా ఉండిపోతాయి. కాని గూఢచారత్వంలో పాల్గొనే కొద్దిమంది తరతరాలుగా వీరిపేర్లు చెప్పుకుంటారు. వారిని ఆదర్శాలుగా పెట్టుకుంటారు" అన్నాడు యుగంధర్ ఆవేశంతో. యుగంధర్ ఉద్రేకపూరితంగా చెప్పిన మాటలను కమీషనర్ ఆశ్చర్యంతో విన్నాడు.

చటుక్కున యుగంధర్ బల్లమీద టెలిఫోన్ తీసి, "ఎక్స్‌ప్రెస్ ట్రంకాల్, ఢిల్లీ, నెం. 1345" అన్నాడు. పదినిమిషాల తర్వాత ఢిల్లీ నుంచి కంఠస్వరం టెలిఫోనులో వినపడింది, "దయచేసి తమరు వెంటనే బయలుదేరిరండి. పోలీసు కమీషనర్ ఓ శవాన్ని చూపిస్తారు. మీరు గుర్తుపట్టగలరేమో చూడాలి" అన్నాడు యుగంధర్.

టెలిఫోన్ పెట్టేసి "దుస్తులు మార్చుకునేందుకు మేము మా పక్క గదిలోకి వెళతాము" అన్నాడు లేచి నిలబడి.

******

పోలీసు దుస్తులలో యుగంధరూ, రాజా కమీషనర్ ఆఫీసులో నుంచి బయటికి వచ్చారు.

"ఈ వేషం ఎందుకు సార్?" అడిగాడు రాజు.

"ప్రతికక్షులు మనల్ని ఓ కంట కనిపెడుతూ ఉన్నారని ట్రంకు పెట్టెవల్ల తెలిసింది. బహుశా మనం ఎక్కడికి వెళ్ళేదీ, ఏం చేసేదీ కనిపెడుతూనేవుంటారు. వాళ్ళెవరూ మనల్ని వెంటాడకుండా ఉండేందుకు ఈ మారువేషం ఆలోచించాను" అన్నాడు యుగంధర్.

"ఈ వేషాలలో మనం దర్యాప్తు చెయ్యవలసిన పరిస్థితి రావచ్చు. జాగ్రత్తగా అంతా గ్రహిస్తూ ఉండు" అని ఒక క్షణం తర్వాత, "లతను తనకూడా తీసుకువెళ్ళిన స్త్రీ ఆనవాలు ఒకసారి జ్ఞాపకం చేసుకో రాజూ! నీకేమైనా స్ఫురిస్తోందా?" అడిగాడు.

రాజు కొంచెం సేపు ఆలోచించి "చాలా నవనాగరికురాలని తెలుస్తోనే ఉంది ఆ వర్ణననుబట్టి. చాలా అందమైన స్త్రీ అని కూడా అనిపిస్తోంది –"

"కళ్ళు –?" అడిగాడు యుగంధర్.

రాజు జేబులోంచి డైరీ తీశాడు. "నలుపూ నీలమూకాని కళ్ళ గుడ్లు" అని చదివి ఆలోచిస్తూ కొంత దూరం నడిచాడు. తర్వాత "సార్! ఆమె మన దేశస్తురాలు కాదు. చీర కట్టుకున్నా కత్తిరింపు జుట్టున్నది. పెదిమలకు రంగు వేసుకున్నది. సన్నని పల్చని ముక్కు - అవును సార్! మన దేశస్తురాలు కాదు."

"మన దేశస్తురాలే అయివుండవచ్చు. ఏ ఆంగ్లో ఇండియనో, ఏ ముస్లిం యువతో అయివుండవచ్చు. బొట్టు లేదు. అది జ్ఞాపకమున్నదా?" అన్నాడు యుగంధర్.

ఇద్దరూ బస్సెక్కారు.

"అన్నట్లు ఆ గుండీల విషయం చెప్పలేదు సార్! మీకిప్పుడు గుండీలు ఎందుకు?" అడిగాడు రాజు.

యుగంధర్ నవ్వాడు. "రాజూ! నువ్వు అనుక్షణమూ వెయ్యి కళ్ళతో చూస్తూ, వెయ్యి చెవులతో వింటూ చురుకుగా ఉండాలి. మనం ఇప్పుడు దర్యాప్తు చేస్తున్న కేసు సామాన్యమైనది కాదు. మనతో కూడా మనకు సహాయం చేసే స్పెషల్ బ్రాంచి ఏజంట్లు మనకేమీ తీసిపోరు. ఇందాక గుండీలు అమ్మిన మనిషి నెం. 333."

రాజుమొహం చిన్నబోయింది. యుగంధర్ రాజుని వీపు మీద తట్టి "నీ అసమర్థతేమీ లేదులే. అతనంత తెలివిగా మారువేషం వేసుకున్నాడు. నాకు అతను అక్కడ ఉంటాడని ముందే తెలుసు."

బస్సు బైకుల్లా పోస్టాఫీసు దగ్గర ఆగింది. యుగంధరూ, రాజూ బస్సు దిగారు. తిన్నగా ఇరానీ రెస్టారెంటులోకి వెళ్ళారు. రెస్టారెంటు కెదురుగా ఒక టాక్సీస్టాండు ఉన్నది. అక్కడ ఒకే ఒక బేబీ టాక్సీ ఉన్నది. టాక్సీ డ్రైవర్ ఫుట్ బోర్డు మీద కాలు ఆనించి సిగిరెట్ తాగుతున్నాడు.

యుగంధర్ అతన్ని సమీపించి "సిగిరెట్ ఉంటే ఒకటి ఇయ్యి భాయీ!" అని అడిగాడు. డ్రైవర్ యుగంధర్ని ఎగాదిగా చూసి, కాస్త అయిష్టంతోనే జేబులోంచి చార్మినార్ పాకెట్స్ తీసి, ఒక సిగిరెట్ ఏరి యుగంధర్కు ఇచ్చాడు.

"నీ సహాయం కావాలి భాయీ! నాకు సహాయం చేస్తే నీకు కూడా లాభం ఉంటుంది" అన్నాడు యుగంధర్.

డ్రైవర్ ప్రశ్నార్థకంగా చూసి "ఇంతవరకూ నష్టం తప్ప లాభమేమీ లేదు" అన్నాడు.

యుగంధర్ నవ్వి "ఒక కేసు దర్యాప్తు చేస్తున్నాం. మాకు సహాయం చేస్తే పది రూపాయలు బహుమానం యిస్తాను" అన్నాడు.

డ్రైవరూ నవ్వాడు, "నువ్వు బహుమానం ఇవ్వడమూ, నేను పుచ్చుకోవడమూ! బాగానే ఉంది.."

"లేదు భాయీ! నిజంగా ఇస్తాను. కంప్లయింట్ ఇచ్చిన పెద్దమనిషి సహాయం చేసినతనికి బహుమానం ఇవ్వమని చెప్పాడు."

"ఊఁ! ఏమిటా సహాయం?" అన్నాడు డ్రైవర్.

"నిన్న సాయంకాలం ఆరుగంటలకు ఇరానీ రెస్టారెంటులోకి ఒకామె వెళ్ళింది. ఆమె ఇంకో ఆమెను వెంటబెట్టుకుని బయటికి వచ్చింది. బయట నీ టాక్సీ ఎక్కి ఆ ఇద్దరూ వెళ్ళివుంటారు. వాళ్ళెక్కడికి వెళ్ళారు?" అడిగాడు యుగంధర్.

టాక్సీ డ్రైవర్ మొహంలో సంతోషం పోయింది. జాలిగా యుగంధర్ చేతిలో పదిరూపాయల నోటును చూశాడు. "నిన్న సాయంకాలం అయిదుం ముప్పావు నుంచి ఏడున్నర వరకూ నేనిక్కడే ఉన్నాను. సవారీ దొరకనేలేదు."

"నీకు దొరక్కపోతే పోయింది. ఇంకే డ్రైవరయినా ఎక్కించుకు వెళ్ళాడా?"

అతను ఒక నిముషం ఆలోచించాడు. "ఊహూ! అప్పుడు ఇక్కడ నా బండికాక ఇంకొక్క బండిమాత్రమే ఉంది. ఆరుంపావుకి ఆ రెండో బండిని ఒక ముసలాయన పిలిచాడు. నేను ఏడున్నరవరకూ ఇక్కడే ఉన్నాను."

"సరే! పోనీలే! ఇరానీ హోటల్లోంచి ఇద్దరు స్త్రీలు రావడం నువ్వు చూశావా?"

డ్రైవర్ నవ్వాడు. "ఇరానీ హోటల్లోంచి ఇద్దరేం ఖర్మం. ఇరవైమంది స్త్రీలు రావడం చూశాను నిన్న."

"సాయంకాలం ఆరుగంటలు దాటిన తర్వాత - అప్పటికింకా చీకటిపడలేదు - సరిగా జ్ఞాపకం చేసుకో! లేతగులాబీ రంగుచీర కట్టుకున్న ఓ అమ్మాయి - కత్తిరింపు జుట్టు, పెదిమలకు రంగు. రెండో అమ్మాయికి రెండు జడలు. పంజాబీలాగూ, వల్లెవాటు. పొడుగ్గా ఉంటుంది. జ్ఞాపకం చేసుకో!"

డ్రైవర్ కళ్ళు మెరిశాయి. "చూశాను" అన్నాడు.

"వాళ్ళిద్దరూ హోటల్లోంచి బయటికి రాగానే హోటలుముందు కారు ఆగింది. దాంట్లో ఎక్కి వెళ్ళారు."

"ఆ కారులో ఇంకా ఎంతమంది ఉన్నారు?"

"డ్రైవర్ మాత్రం ఉన్నాడు. వెనక సీటులో ఎవరూ లేరు."

"కారు నెంబరు తెలుసా?"

"ఉహూ! నల్ల ఫోర్డు కారు. 1948 మోడల్."

"డ్రైవర్ ఆనవాలు చెప్పగలవా?"

"ఊహూ! సరిగా చూడలేదు."

"ఆ కారు ఎటువేపు వెళ్ళింది?"

"తిన్నగా హారన్ బీ రోడ్డువైపు వెళ్ళింది."

యుగంధర్ పదిరూపాయల నోటు డ్రైవర్ కిచ్చాడు. డ్రైవర్ తెల్లబోయి చూశాడు. "నేనేమీ సహాయం చెయ్యనిదే!" అన్నాడు.

"చేసిన సహాయం చాలు" అని యుగంధర్ వెనక్కి తిరిగాడు. యుగంధరూ, రాజూ ఇరవై గజాలు నడిచారో లేదో "భాయీ! భాయీ!" అంటూ డ్రైవర్ కేకవేశాడు. ఇద్దరూ మళ్ళీ వెనక్కి తిరిగి, అతని దగ్గరకి వెళ్ళి "ఏమిటి?" అని అడిగారు.

"ఓ విషయం జ్ఞాపకమొచ్చింది. ఆ ఫోర్డు కారు బయలుదేరిందో లేదో వెనకే ఒక టాక్సీ వచ్చింది. ఆ టాక్సీ ఫోర్డు కారు వెనకే వెళ్ళింది" అన్నాడా డ్రయివర్.

"టాక్సీ నెంబరు తెలుసా?"

"బి.ఎం.వై. 1645. హిల్ మన్ మిన్క్స్. ఆ డ్రైవర్ నా స్నేహితుడు."

"ఆ టాక్సీ సామాన్యంగా ఏ స్టాండువద్ద ఉంటుంది?"

"ఒక స్టాండని లేదు. ఏ స్టాండు లోనైనా ఆగుతుంది."

"సులభంగా ఆ టాక్సీని పట్టుకోవడం ఎలా?"

డ్రయివర్ నవ్వి, "నా టాక్సీ ఎక్కి బాడుగ ఇస్తే -" అంటూ ఉండగానే యుగంధర్ కారెక్కి " పోనీ!" అన్నాడు. డ్రయివర్ మొహం మాడ్చుకుని "ఇపుడు నాకు వేరే బాడుగ ఉన్నది" అన్నాడు.

యుగంధర్ మాట్లాడలేదు. జేబులోంచి ఇంకో పదిరూపాయల నోటు తీసి ఇచ్చాడు. "త్వరగా" అన్నాడు.

టాక్సీ కదిలింది. పదిగజాలు ముందుకు వెళ్ళగానే ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ చెయ్యి చూపించి ఆపాడు.

"ఆపు" అన్నాడు యుగంధర్.

టాక్సీ ఆగగానే ట్రాఫిక్ కానిస్టేబుల్ కారెక్కాడు. "పోనీ!" అన్నాడు యుగంధర్.

ట్రాఫిక్ కానిస్టేబుల్ తలమీద టోపీతీసి, జేబురుమాలుతో నుదురు తుడుచుకున్నాడు.

"గుడ్ ఈవినింగ్! ఇందాకా గుండీలు కొంటున్నప్పుడు మిమ్మల్ని గుర్తుపట్టలేదు" అన్నాడు రాజు.

మాతుంగా కింగ్స్ సర్కిల్ దగ్గిర స్టాండులో కనిపించింది హిల్ మన్ కారు. డ్రయివర్ని పిలిచి "నిన్న సాయంకాలం ఆరుగంటలప్పుడు నువ్వు బైకుల్లా మీదుగా సవారీ వెళ్ళావు కదూ!" అని యుగంధర్ ఎక్కిన కారు డ్రయివర్ అతన్ని అడిగాడు.

"అవును. ఏం భాయీ?"

"ఇరానీ రెస్టారెంటు ముందున్న ఒక నల్ల ఫోర్డుకారు నీ టాక్సీ ముందు వెళ్ళింది. ఆ కారు వెనకాలే నువ్వు వెళ్ళావు?"

"అవునవును. నలభయి ఎనిమిది మోడల్ ఫోర్డు. మహా చికాకు పెట్టాడు ఆ డ్రయివర్. ఓవర్ టేక్ చేద్దామంటే వీల్లేకుండా పోయింది" అన్నాడు డ్రయివర్.

"చివరికి ఓవర్ టేక్ చేశావా?" అడిగాడు యుగంధర్.

డ్రయివర్ నవ్వాడు. "లేదు. ఆ కారు ఆగింది. అప్పుడు నేను దాటి వెళ్ళిపోయాను."

"ఎక్కడ ఆగింది?"

"హారన్ బీ రోడ్ మీద ఒక దర్జీ షాపు ముందు."

"ఆ షాపు పేరూ?"

"తెలీదు."

"ఆ షాపేదో చూపించగలవా?"

"ఆ"

నెం.333. యుగంధరూ, రాజూ హిల్మన్ కారు ఎక్కారు. "పద!" అన్నాడు యుగంధర్.

పదిహేను నిమిషాలలో హారన్ బీ రోడ్ చేరుకున్నారు. అది చాలా పెద్ద రోడ్

"ఆ షాపుముందు కారు ఆపక. నెమ్మదిగా పోనిస్తూ ఆ షాపు సమీపించగానే చూపించు చాలు!" అన్నాడు యుగంధర్.

కుడిచేతివైపున అయిదంతస్తుల మేడ చూపించాడు ఆ డ్రైవర్. కిందనున్న ఓ దర్జీ షాపు చూపించి "ఈ షాపు ముందే ఆ ఫోర్డ్ కారు ఆగింది" అని చెప్పాడు.

"సరే! పోనీ!"

యుగంధర్ నెం. 333 చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు. నెం.333 తల తిప్పాడు. రెండు ఫర్లాంగులు వెళ్ళిన తర్వాత టాక్సీ ఆపించి నెం.333 దిగేశాడు.

"కమీషనరాఫీసుకు పోనీ" ఆజ్ఞాపించాడు యుగంధరు.

యుగంధర్ రాజుకి కొన్ని ఆదేశాలు ఇచ్చాడు. రాజు అంతా శ్రద్ధగా విన్నాడు. ఒక టాక్సీ స్టాండు దగ్గర రాజుని దింపి "జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

పోలీసు కమీషనర్ ఆఫీసు చేరుకోగానే యుగంధర్ టాక్సీ డ్రైవర్‌కి మీటర్ ఛార్జీ పైన ఓ అయిదు రూపాయలు ఇచ్చి, తిన్నగా కమీషనర్ గదికి పక్కనున్న గదిలోకి వెళ్ళాడు. కానిస్టేబుల్ యూనిఫాం తీసేసి, తన దుస్తులు వేసుకుని కమీషనర్ గదిలోకి దారితీశాడు.

"మీకోసమే కాచుకున్నాను" అన్నాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

"శవాన్ని చూశారా?"

"ఆ మా ఏజంటే. నెం.888కి అతను అసిస్టెంటు. నెం.888 కే అతను బాధ్యుడు. అతను ఈ ఊళ్ళో ఎందుకు ఉన్నాడో ఎందుకు వచ్చాడో తెలీదు. అది మీరే ఊహించగలరు."

యుగంధర్ తలూపాడు. స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ చాలా ఆదుర్దాగా ఉన్నాడు. "యుగంధర్ మీరెంతవరకూ పురోగమించారు?" అడిగాడు.

యుగంధర్ పెదిమ విరిచాడు. "ఏమో! మొత్తానికి ప్రతి కక్షులలో సంచలనం బయలుదేరింది. లేకపోతే ఆ ట్రంకు పెట్టి పంపరు. నన్ను హెచ్చరిస్తూ ఉత్తరం వ్రాయరు."

"మా జాగ్రత్తలు మేము తీసుకుంటున్నాము ప్రతి విమానాశ్రయమూ కాపలా కాస్తున్నాం. అనుమానాస్పదులను సోదా చేస్తున్నాం" అన్నాడు డైరెక్టర్.

"ప్రతికక్షులకు ఆ విషయం తెలిసేవుంటుంది. వాటిని దేశంలోంచి తీసుకుపోవాలంటే వాళ్ళకు వేరే మార్గాలు ఉండిఉంటాయి. కనుక ఆ ఏర్పాటు మీద ఆశ పెట్టుకుని లాభంలేదు."

"అయితే ఈ పాటికి వాటిని విదేశానికి తీసుకుపోయి ఉంటారేమో!"

యుగంధర్ తల తిప్పాడు. "ఊహూ! అవి ఇంకా ప్రతి కక్షులకు చిక్కలేదనుకుంటాను" అన్నాడు.

డైరెక్టర్ మొహం వికసించింది.

"అవును. ప్రతి కక్షులకు ఆ కాగితాలు చిక్కివుంటే ఇంకా ఈ దేశంలో కార్యక్రమాలు సాగిస్తూ ఉండరు. నన్ను బెదిరించి నా దర్యాప్తు మానమని చెప్పవలసిన అవసరమూ ఉండదు. వాళ్ళు కూడా వాటికోసం ఇంకా ప్రయత్నిస్తున్నారు."

"అయితే ఆవేమయ్యాయి? నెం.888 ఏమయ్యాడు!"

"నెం. 888 వాళ్ళ చేతిలో చిక్కాడనే నా భయం. వాటిని ఎక్కడ దాచిందీ చెప్పలేదు కనుకనే ఇంకా ప్రతి కక్షులు అతనిని ప్రాణాలతో ఉండనిచ్చారు. నెం.888 ధైర్యంగా ఉన్నంతకాలమూ, అవి ఎక్కడున్నదీ చెప్పనంత కాలమూ అతని ప్రాణానికి ముప్పు ఉండదు" అని చటుక్కున ఆగిపోయాడు యుగంధర్ - దీర్ఘాలోచనలో పడ్డాడు. గదిలో ఇటూ అటూ పచార్లు చేయసాగాడు.

"మీరిలా చెప్పారని హోం మినిష్టర్‌కి చెప్పనా!" అడిగాడు డైరెక్టరు.

యుగంధర్ జవాబు చెప్పలేదు. చెయ్యెత్తి మాట్లాడవద్దని సంజ్ఞ చేశాడు. సిగరెట్ వెలిగించి, పచార్లు చేస్తూనే ఉన్నాడు. ముడిచిన కనుబొమలు, చిట్లించిన కళ్ళు, బిగించిన పెదిమలు. యుగంధరు ఆలోచనలు వాయువేగంతో పరిగెత్తుతున్నాయనీ, ఆ ఆలోచనాక్రమాన్ని భంగపరచకూడదనీ కమీషనర్‌కి తెలిసి మౌనంగా ఉండిపోయాడు. ఎస్.బి. డైరెక్టర్‌కి యుగంధరుతో అంత పరిచయం లేదు. చేతి గడియారం చూసుకుని "నేను హోం మినిష్టర్‌ని ఇంకో పదినిమిషాలలో కలుసుకోవాలి" అన్నాడు.

యుగంధర్‌కి అతని మాటలు వినిపించలేదు. కుర్చీలో కూర్చున్నాడు. బల్లమీదనున్న సిరాబుడ్డీవైపు దీర్ఘంగా చూస్తున్నాడు. యుగంధరు చూపు ఆ సిరాబుడ్డిమీద లేదు. అతని చూపుకాని, ఆలోచనలుకాని ఆ క్షణంలో అక్కడ, ఆ గదిలో లేవు. తనే నెం.888. తను అతని స్థానంలో ఉన్నట్టు ఊహించుకుని ఆలోచిస్తున్నాడు.

ఎస్.బి. డైరెక్టరు లేచాడు. "నేను వెళుతున్నాను" అన్నాడు కాస్త బిగ్గరగా.

యుగంధరు ఆలోచనలోంచి మేల్కొన్నాడు. ఆ క్షణంలో ఎస్. బి. డైరెక్టర్ని 'నువ్వెవరు?' అన్నట్లు చూశాడు. చటుక్కున లేచి "సారీ! క్షమించండి. ఏదో ఆలోచనలో ఉండిపోయాను. ఆలస్యం అయిపోయిందా?" అన్నాడు.

"ఫర్వాలేదులెండి. హోం మినిష్టర్ నన్ను ఏడున్నరకు కలుసుకోమన్నారు. లేకపోతే నాకేం తొందరలేదు" అన్నాడు డైరెక్టరు.

"ఆయన ఈ ఊరికి వచ్చారా?"

"అవును. ఇవాళ పొద్దున్న వచ్చారు. మీరూ ఒకసారి ఆయన్ని కలుసుకుంటే బాగుంటుంది" అన్నాడు డైరెక్టరు.

"తర్వాత కలుసుకుంటాను, ఇప్పుడు వేరే పనున్నది" అని లేచాడు యుగంధర్. తలుపువరకూ వెళ్ళి, వెనక్కి తిరిగి "నాకు రాజు టెలిఫోన్ చేస్తే ఒక అరగంటలో వస్తాను అని చెప్పండి. మళ్ళీ ఫోను చెయ్యమనండి" అని కమీషనర్‌కి చెప్పి వెళ్ళిపోయాడు.

యుగంధరు బయటకు వెళ్ళగానే ఎస్.బి. డైరెక్టరు భుజాలు చైచి "గర్విష్టిలాగున్నాడు" అన్నాడు.

కమీషనర్ అతన్ని తేరిపార చూసి 'యుగంధర్‌తో మీకు సన్నిహిత్యం ఏర్పడితే అలా అనరు. ఆయనలో గర్వం ఏ కోశానా లేదు' అనుకున్నాడు లోలోపల.

✡✡✡

5

**లతను ఎక్కించుకు** వెళ్ళిన ఫోర్డుకారు దర్జీషాపు ముందు ఆగింది కనుక ఆ షాపుకూ, ప్రతికక్షులకూ ఏదో సంబంధం ఉండి వచ్చనీ, ఆ షాపుకు ఓ కంట కనిపెడుతూ ఎవరెవరు ఎపుడు ఆ షాపుకు వచ్చేదీ గమనించమని చెప్పి యుగంధర్ రాజును టాక్సీ స్టాండు దగ్గర దింపాడు.

రాజు ఒక టాక్సీ ఎక్కాడు. డ్రయివర్ "ఎక్కడికి?" అని అడగ్గానే ఎక్కడికని చెప్పాలో రాజుకు తెలియలేదు. తను అలాగే ఆ దర్జీ షాపుముందు నిలుచుని కాపలా కాయడం మంచిది కాదు. యుగంధర్నీ, తనను కూడా ప్రతికక్షులు కనిపెడుతూనే ఉన్నారు కనుక గుర్తుపట్టకమానరు.

"జూహూ బీచికి పోనీ!" అన్నాడు రాజు. టాక్సీ శరవేగంతో పరిగెత్తుతోంది. రాజు ఆలోచిస్తున్నాడు. చటుక్కున ముందుకు ఒంగి ఓ చిరునామా చెప్పి టాక్సీని అటు మళ్ళించమన్నాడు. టాక్సీ మలబార్ హిల్స్‌లో ఓ బంగళాముందు ఆగింది. రాజు చరచర లోపలకు వెళ్ళాడు.

అప్పుడే బయటికి బయలుదేరబోతున్న సినిమా నటుడు జయంత్ రాజుని చూడగానే సంతోషంతో "రాజూ! ఎప్పుడు వచ్చావ్! రా! రా!" అంటూ చేతులు పట్టుకుని లోపలకు పిలుచుకు వెళ్ళాడు.

"మంచి టైంకే వచ్చావ్. నేను నటించిన కొత్త పిక్చర్ రషెస్ వేస్తున్నారు. పోదాం పద. తర్వాత.."

"సారీ బ్రదర్! నాకు చాలా అర్జంటు పనివున్నది. మళ్ళీ కలుసుకుంటాను. ప్రస్తుతం నువ్వు నాకు ఓ సహాయం చెయ్యాలి. అందుకు వచ్చాను." అన్నాడు రాజు.

"ఏమిటది?

"బటాణీలు, వేరుశెనగలూ అమ్మే మనిషిని ఎవర్నయినా పట్టుకుని బఠానీల బుట్టతో తీసుకురావాలి. నాకు చిరిగి మాసిపోయిన పంచా, కుర్తా ఇవ్వాలి. నీ మేకప్ బాక్సు, ఒక అద్దమూ కావాలి."

"డ్యూటీమీదున్నావా?" అడిగాడు జయంత్.

"అవును."

"సరే, లోపలకు రా!" అని జయంత్ గదిలోకి తీసుకువెళ్ళి, ఒక అద్దం చూపించి "అదుగో! ఆ పెట్టె నా మేకప్ బాక్సు. ఈ బీరువాలో పంచలూ, కుర్తాలు ఉన్నాయి. మాసినవీ, చిరిగినవీ లేవుకాని, వాటిని నీ ఇష్టమొచ్చినట్లు చింపి ఉపయోగించు, బఠానీల బుట్ట ఇప్పుడే తెప్పిస్తాను. ఈ వీధి చివర్న ఒకడున్నాడు" అని జయంత్ వెళ్ళిపోయాడు. పదినిమిషాలలో నౌకరుచేత బుట్ట పట్టించుకుని తిరిగివచ్చాడు.

అప్పటికే రాజు వేషం మార్చేశాడు. అక్కడక్కడ చిరుగులు, మరకలు ఉన్న పంచ కట్టుకున్నాడు. మాసిపోయిన కుర్తా తొడుక్కున్నాడు. తలకు గుడ్డకట్టుకున్నాడు. మూసిన గెడ్డమూ, అడ్డదిడ్డంగా పెరిగిన మీసాలూ, ముడతలతో పీక్కుపోయిన మొహం. ఒక్క నిమషం పాటు రాజుని విస్తుపోయి చూశాడు జయంత్. "నువ్వు గొప్ప మేకప్ ఆర్టిస్టువి" అన్నాడు.

రాజు నవ్వి, జయంత్ తెచ్చిన బుట్ట ఒకసారి తనిఖీ చేశాడు. తృప్తిపడి బుట్ట పక్కన పెట్టి, తను విప్పిన కోటు జేబులోంచి రివాల్వరు తీసి దానిలో తూటాలు నింపి, మొలలో పెట్టుకున్నాడు.

"నీ కారులో తీసుకువెళ్ళి నన్ను హారన్ బీ రోడ్ ప్రాంతంలో ఎవరూ చూడకుండా దింపాలి" అన్నాడు రాజు.

జయంత్ షెవర్లె అరవైమైళ్ళ స్పీడులో వెళుతున్నా కదులుతున్నట్టే తెలియలేదు. రాజు వీధిలో జనానికి కనిపించకుండా సీటు వెనక నక్కి కూర్చున్నాడు. హారన్‌బీ రోడ్ కు దగ్గరగా వల్లభాయి పార్కున్నది. ఆ పార్కు దగ్గర కారు ఆపాడు జయంత్. రాజు చటుక్కున బుట్టతో దిగేశాడు. బుట్ట తలమీద పెట్టుకుని చర చర నడుచుకుంటూ బయలుదేరాడు. ఆ షెవర్లె కారువైపు ఎవరైనా చూస్తూవున్నా కన్ను మూసి తెరిచేటంతలో రాజు కారు దిగడం ఎవరూ గమనించి ఉండటానికి వీలులేదు.

రాజు హారన్ బీ రోడ్ చేరుకున్నాడు. అప్పుడప్పుడు 'బఠానీలు' అని కేక వేస్తూ ముందుకు నడిచాడు. హుస్సేన్ దర్జీ షాపు ప్రాంతాలకు చేరుకున్నాక, ఆ షాపుకు ఎదురుగా పేవ్‌మెంట్ మీద తిష్టవేశాడు. బుట్ట ఎదురుగా పెట్టుకున్నాడు. వచ్చేపోయే జనాన్ని జాలిగా అడుగుతున్నాడు బఠానీలు కొనమని, కాని అతని దృష్టంతా ఎదురుగా ఉన్న హుస్సేన్ దర్జీ షాప్ మీద ఉంది. ఆ షాపులోకి ఎవరెవరు వెళుతున్నదీ, ఎవరెవరు బయటకు వస్తున్నదీ గమనిస్తూనే ఉన్నాడు. బఠాణీల సంచికీ, వేరుశెనగల సంచికీ మధ్య షార్ట్‌హేండ్ నోట్ బుక్ ఉంది. దాని మీద ఆ షాపుముందు ఆగే ప్రతికారు నెంబరూ, షాపులోకి వచ్చివెళ్ళే మనుష్యుల ఆనవాళ్ళు, వాళ్ళుషాపులో

ఎంతసేపున్నదీ చకచక రాసుకుంటున్నాడు. దర్జీగా హుస్సేన్‌కు చాలా మంచి పేరు ఉండివుండాలి. అతని వ్యాపారం చాలా బాగా సాగుతుంది. ఆ దర్జీ షాపు గుమ్మం పక్కనే కళ్ళులేని ఒక బిచ్చగాడు కూర్చుండడం రాజు గమనించాడు. నెం.333ని కూడా ఆ షాపు కనిపెట్టమని యుగంధరు చెప్పాడని రాజుకు తెలుసు. ఆ విషయం తెలియకపోతే ఆ బిక్షగాడు నిజంగానే బిక్షగాడని రాజు అనుకునేవాడు.

కాలేజీ స్టూడెంట్లు, ఆఫీసర్లు, సొసయిటీ స్త్రీలు, కొంతమంది విదేశీయులూ, ఆ షాపులోకి వస్తున్నారు. కొంతమంది బట్టలు తెచ్చి, ఆదులిచ్చి వెళుతున్నారు. అనుమానాస్పదులైన మనుష్యులు గానీ, అనుమానించతగ్గపనులుగానీ ఏవీ జరగడంలేదు. అయినప్పటికీ రాజు అక్కణ్ణించి కదలలేదు. రాత్రి తొమ్మిదిగంటలయింది. షాపులోకి జనం రావడంలేదు. నలుగురు మనుష్యులు లోపల్నించి వచ్చారు. వాళ్ళ మెళ్ళల్లో కొలత టేపులను చూసి వాళ్ళు దర్జీ వాళ్ళు అయివుండాలి అనుకున్నాడు రాజు. బొత్తాములు కుడుతున్న ముగ్గురు కుర్రాళ్ళు లేచి వెళ్ళిపోయారు. తురక టోపీ పెట్టుకున్న నలభైఏళ్ళతను మాత్రం మిగిలాడు షాపులో. కొన్ని నోటుపుస్తకాలు తీసి లెక్కలు వేశాడు. గల్లాపెట్టెలో ఉన్న డబ్బు లెక్కపెట్టి, పెట్టె తీసుకుని వీధి తలుపు గడియపెట్టి, పెట్టె తీసుకుని వీధి తలుపు గడియపెట్టి లోపలకు వెళ్ళాడు.

అరగంట తర్వాత తలుపు తెరుచుకుని బయటకు వచ్చి తలుపుకు పెద్ద ఇనపవూచ తగిలించి తాళం వేశాడు. నడుచుకుంటూ బయలుదేరాడు. బిచ్చగాడు కూడా లేచాడు, కుంటుకుంటూ ఆ దర్జీ వెనకాలే అతను నడిచాడు.

రాజు ఇంకో అయిదు నిమిషాలు అక్కడే కూర్చున్నాడు. తర్వాత తనూ లేచి, బుట్ట నెత్తిమీద పెట్టుకుని బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక ఓ టెలిఫోన్ బూత్ దగ్గర ఆగి అక్కడ చతికిలపడ్డాడు. బుట్ట ఎదురుగా పెట్టుకున్నాడు. చుట్టుపక్కల జనమెవరూ లేకుండా చూసి చటుక్కున టెలిఫోను బూతులోకి వెళ్ళి ఒక నెంబరు తిప్పాడు.

"పోలీసు కమిషనర్ ఆఫీసా? కమిషనర్ గదిలో యుగంధరుంటారు. ఆయనకు కనెక్ట్ చెయ్యండి" అన్నాడు.

## 6

యుగంధర్ పోలీసు కమీషనర్ గదిలోంచి టెలిఫోను ఆపరేటర్ దగ్గరకు వెళ్ళాడు.

"పోస్ట్‌మాస్టర్ జనరల్ ఇంటికి కనెక్ట్ చెయండి" అని చెప్పాడు.

యుగంధర్ని చూడగానే ఆపరేటర్ లేచి నిలుచుని "యస్ సార్" అన్నాడు. గబగబ డైరెక్టరీ తిరగేసి ఒక నెంబరు తిప్పి, విని, యుగంధరు వైపు తిరిగి "ఆయన ఇంట్లోలేరట" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళారో అడగండి" అసహనంతో యుగంధరు అన్నాడు.

రెండు క్షణాలసేపు టెలిఫోనులో విని "ఆఫీసర్స్ క్లబ్బుకి వెళ్ళారట" అని చెప్పాడతను.

"అదెక్కడ ఉంది?"

"ఇదే రోడ్ మీద కుడిచేతివైపున ఉంది. ఇక్కడికి దగ్గరే!" అన్నాడు ఆపరేటర్.

"గుడ్" అని యుగంధర్ బయటకు వెళ్ళాడు. కాంపౌండులో ఉన్న ఒక పోలీసు జీపు ఎక్కి డ్రయివర్‌తో బయలుదేరమని చెప్పాడు.

"లోపలకు వెళ్ళి అడిగి వస్తాను" అన్నాడా డ్రైవర్.

"టయిం లేదు" యుగంధర్ చికాకుతో గట్టిగా అన్నాడు.

"క్షణంలో వస్తాను" అని డ్రయివర్ లోపలకు పరిగెత్తాడు. యుగంధర్ డ్రైవర్ సీటులోకి జరిగాడు. కారు స్టార్టు చేశాడు. ఆఫీసు గదిలోకి పరిగెత్తి వెళుతున్న పోలీసు డ్రయివరు జీపు బయలుదేరడం చూసి వెనక్కి తిరిగి, "ఆగండి!" అని కేకవేశాడు. యుగంధర్ ఆగలేదు.

అయిదునిమిషాలలో ఆఫీసర్ల క్లబ్బుముందు కారు ఆపి, లోపలకు వెళ్ళి, మెట్లమీద మొదట కనిపించిన మనిషిని "పోస్ట్‌మాష్టర్ జనరల్ క్లబ్బులో ఉన్నారా?" అని అడిగాడు యుగంధర్.

"ఉన్నారు."

"ఎక్కడ?"

"రమ్మీ ఆడుతున్నారు."

యుగంధర్ తిన్నగా హాల్లోకి వెళ్ళి హాలంతా కలయచూశాడు. ఒక మూల బల్ల దగ్గరకు వెళ్ళి "పోస్ట్‌మాష్టర్ జనరల్‌ని కలుసుకోవాలి" అన్నాడు.

ఆరుగురూ తలలెత్తి చూశారు. యాభై ఏళ్ళకు పైబడ్డ ఒక బట్టతల ఆయన తలవూపి "నేనే, ఎందుకు?" అడిగాడు.

"మీతో మాట్లాడాలి" అన్నాడు యుగంధర్.

ఆటపట్టులో ఉన్న ఆ ముసలాయన మొహం చిట్లించి "కూర్చోండి. ఈ ఆట పూర్తికాగానే వస్తాను" అన్నాడు.

"ఈ ఆట కన్నా చాలా ముఖ్యమైన పని కనకే ఇక్కడికి వచ్చాను. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నాను. దయచేసి కోపగించుకోకుండా ఆ పేకముక్కలు పెట్టేసి ఒకసారి రండి" అన్నాడు యుగంధర్.

"మీరెవరు?" కోపంగా అడిగాడు ఆయన.

"చెబుతాను, ఇట్లా రండి."

పోస్ట్‌మాష్టర్ జనరల్ ఒకసారి అందరివంకా చూశాడు. లేచి "సరే! పదండి" అని వెనక్కి తిరిగి, "కలిపేయకండి. ఇప్పుడే వస్తాను" అన్నాడు వాళ్ళతో.

"మీరిప్పుడప్పుడే తిరిగి రావడానికి వీలుండదు" అన్నాడు యుగంధర్.

పోస్ట్ మాష్టర్ జనరల్‌కి చాలా కోపం వచ్చింది. అధికారం చెలాయించడానికి బాగా అలవాటుపడ్డ ఆ ఉన్నతోద్యోగి ఎవరో వచ్చి తనకు ఇలా చెప్పడం భరించలేకపోయాడు. చటుక్కున ఆగిపోయి, "మిష్టర్! మీరు ఎవరో నాకు తెలియదు. పేరు చెప్పమంటే తర్వాత చెబుతానన్నారు. పనేమిటో చెప్పమంటే చెప్పలేదు. అయినప్పటికీ మిమ్మల్ని పెద్దమనిషిగా ఎంచి మీరు కోరినట్లు ఆట ఆపి బయలుదేరాను. కాని మీరు మితిమీరారు. కనుక మీరెవరో ఏం పనిమీద వచ్చారో చెబితేగాని నేను రాను" అన్నాడు.

యుగంధర్ జవాబు చెప్పలేదు. జేబులోంచి ఒక కాగితం తీసి ఇచ్చాడు. ఆయన దాన్ని చదివి కళ్ళు పెద్దవి చేసి యుగంధర్ని చూశాడు. "క్షమించండి. నాకు తెలియదు. పదండి" అన్నాడు యుగంధర్‌తో నమ్రతగా.

"నన్నే క్షమించాలి, మిమ్మల్ని శ్రమ పెడుతున్నందుకు" అని యుగంధర్ కాగితాన్ని తీసుకున్నాడు.

అది హోం మంత్రి ఇచ్చిన అధికార పత్రం.

యుగంధర్ ఆయన్ని తిన్నగా కారు దగ్గరకు తీసుకు వెళ్ళి కారెక్కమన్నాడు. కారు స్టార్టు చేశాడు.

"బహుశా మీరీ రాత్రంతా మేలుకోవలసి ఉంటుంది. ఈ ఊళ్ళో ఉన్న సబ్ పోస్టాఫీసులన్నిటికీ మనుష్యులను పంపాలి. కేరాఫ్ పోస్ట్ మాష్టర్ అని వచ్చిన ఉత్తరాలను, కవర్లనూ, రిజిష్టర్డ్, ఇన్సూరెన్స్ వస్తువులను అన్నిటినీ మీరు మీ ఆఫీసుకి తెప్పించాలి. నేను వచ్చి వాటి నన్నిటినీ తనిఖీ చేసేంతవరకూ వాటిని మీవద్దే జాగ్రత్తగా దాచాలి. ఏ ఒక్కటీ ఎవరికీ ఇవ్వకూడదు" అన్నాడు యుగంధర్.

పోస్ట్‌మాష్టర్ జనరల్ తెల్లబోయి యుగంధర్ని చూశాడు. "అది మా రూల్సుకు విరుద్ధం" అన్నాడు.

"అయితే కావచ్చు. దేశ రక్షణకు సంబంధించిన విషయం ఇది. ఏ రూలు ప్రకారం ఈ పని జరిపిస్తారో అది మీరే ఆలోచించుకోండి" అన్నాడు యుగంధర్.

"కాని ఈ రాత్రికి రాత్రి ఇంతపని ఎలా చేయించను. అన్ని సబ్ పోస్టాఫీసులు మూసి ఉంటాయి. అక్కడ ఎవరూ ఉండరు" అన్నాడు.

"మూసివుంటే పోస్టాఫీసులను తెరిపించండి. ఇళ్ళకు వెళ్ళిన ఉద్యోగులను పిలిపించండి. మీకు బలగం అవసరమైతే పోలీసు కమీషనర్‌కి ఫోను చేయండి. కావలసినంత సిబ్బందిని పంపిస్తారు."

యుగంధర్ కారును ఒక టాక్సీ స్టాండువద్ద ఆపాడు. "మీరు టాక్సీ ఎక్కి వెళ్ళండి. నేనే మిమ్మల్ని ఇంట్లో దింపేవాణ్ణి కాని, నాకు వేరే అవసరమైన పనున్నది. క్షమించండి" అన్నాడు.

"దానికేం ఫర్వాలేదు. మీరు మళ్ళీ నన్ను ఎప్పుడు కలుసుకుంటారు?"

"ఇవన్నీ తెప్పించాక కమీషనర్ ఆఫీసుకు ఫోను చేయండి" అన్నాడు యుగంధర్.

పోస్ట్‌మాష్టర్ జనరల్ కారు దిగి టాక్సీ ఎక్కగానే యుగంధర్ తన జీపును శరవేగంగా పోనిచ్చాడు. బొంబాయి ముఖ్యమంత్రి ఇంటిఇ వెళ్ళాడు.

"కేంద్ర ప్రభుత్వం హోం మంత్రి ఇక్కడే బసచేశారా?" అడిగాడు గుమ్మం దగ్గర ఎదురయిన జవానును.

"అవునుసార్!"

"ఉన్నారా?"

"లేరండి. గవర్నర్ ఏర్పాటు చేసిన డిన్నర్‌కి ముఖ్యమంత్రితో వెళ్ళారు."

✡✡✡

**యుగంధర్** వెనక్కు తిరిగి మళ్ళీ జీపు ఎక్కాడు. కారు తిన్నగా గవర్నర్ బంగళాకు నడిపాడు. గవర్నరూ, చీఫ్ మినిష్టరూ, కేంద్ర ప్రభుత్వ హోం మినిష్టర్ సిన్హా డిన్నర్ కి కూర్చున్నారని చెప్పాడు గవర్నర్ సెక్రటరీ.

"యుగంధర్ వచ్చాడనీ, అత్యవసరంగా మాట్లాడాలనీ దయచేసి హోమినిష్టర్‌కి చెప్పండి" అన్నాడు యుగంధర్.

సెక్రటరీ తలవూపి "కూర్చోండి. భోజనాలు అయ్యాక చెబుతాను" అన్నాడు.

యుగంధర్ కూర్చోలేదు. ఆ యువకుణ్ణి భుజం మీద తట్టి, "మిష్టర్! భోజనాలయేంతవాకూ నేను కాచుకుని ఉండడానికి వీలులేదు. నాకు అర్జంటు పనున్నది. కనుక వెంటనే వెళ్ళి సిన్హా గారికి చెప్పండి!" అన్నాడు

సెక్రటరీ యుగంధర్ని ఎగాదిగా చూశాడు. "ఓ పదినిమిషాలు ఓపిక పట్టండి" అన్నాడు చివరకి.

"ఈ డిన్నర్లు ఎంతసేపు పడతాయో నాకు తెలుసు. కనుక తాత్సారం చేయక వెంటనే వెళ్ళి చెప్పండి."

సెక్రటరీ లోపలకు వెళ్ళిపోయాడు. యుగంధర్ చేతి గడియారం చూసుకుంటూ వసారాలోనే నిలుచున్నాడు. లోపలకు వెళ్ళిన సెక్రటరీ అయిదు నిమషాలయినా బయటకు రాలేదు. యుగంధర్‌కు ఓపిక పోతోంది. దర్జీ షాపును కనిపెడుతూ ఉండమన్న రాజు, నెం.333 టెలిఫోను చేశారేమో! తను అక్కడ అవసరమేమో! తన టైం వృధా అయిపోతోంది.

మరో అయిదు నిమషాలు గడిచాయి. అప్పటికీ సెక్రటరీ బయటకి రాలేదు. యుగంధర్ ఇక కాచుకోదలచుకోలేదు. చరచర లోపలకు నడిచాడు. విశాలమైన హాలులోకి వెళ్ళాడు. ఆ హాలులోంచి తిన్నగా ఇంకో గదిలోకి నడిచాడు. ఆ గది వెనకాల నవ్వులు, మాటలు వినబడుతున్నాయి. యుగంధర్ ముందుకి సాగాడు. ట్రేలో ఫలహారాలు తీసుకువెళుతున్న బట్లర్ యుగంధర్ని చూసి "సార్!" అని పిలిచాడు. ఆ సమయానికి సెక్రటరీ ఎక్కణ్ణించో ఊడిపడ్డాడు.

"నో! నో! లోపలకు వెళ్ళకూడదు" అంటూ యుగంధర్ అడ్డంగా వచ్చి నిలుచున్నాడు. బట్లర్ తలుపు తెరుచుకుని లోపలకు వెళుతున్నప్పుడు బల్ల దగ్గర కూర్చుని తాపీగా భోజనం చేస్తున్న మంత్రులను చూశాడు యుగంధర్. తన తోవకు అడ్డంగా వచ్చి నిలుచున్న ఆ యువకుణ్ణి, ఏదో వస్తువును తీసి పక్కన పెట్టినట్లు అమాంతం రెండు చేతులతోనూ పక్కకు తోసి యుగంధరు తలుపు తెరుచుకుని లోపలకు నడిచాడు.

"గుడ్ ఈవినింగ్ సిన్హాగారూ!" అన్నాడు. అనుమతి లేనిదే చొరవచేసుకుని డిన్నర్ హాలులోకి వచ్చిన మనిషి ఎవరా అని గవర్నరూ, చీఫ్ మినిష్టరూ నివ్వెరపోయి చూస్తున్నారు.

"క్షమించండి, ఇలా వచ్చినందుకు" అన్నాడు ఆ ఇద్దర్నీ చూసి. హోం మినిష్టర్ వైపు తిరిగి "మీతో అర్జంటుగా మాట్లాడాలి" అన్నాడు యుగంధర్.

హోం మినిష్టర్ సిన్హా వెంటనే లేచి, "పదండి. ఆ పక్క గదిలోకి వెళదాం" అని గదివైపు నడిచాడు.

యుగంధర్ లోపలకు వెళ్ళిన రెండు నిమషాలకు గాని సెక్రటరీ షాక్‌నుంచి తేరుకోలేదు. తేరుకుని గదిలోకి వచ్చేసరికి హోం మినిష్టరూ, యుగంధరూ పక్కనున్న గదిలోకి వెళ్ళడం చూశాడు.

తన తప్పులేదని గవర్నర్‌కి చెప్పబోయాడు సెక్రటరీ. గవర్నర్ ఫర్వాలేదని చెప్పి పంపేసాడు.

గదిలోకి వెళ్ళగానే యుగంధరు హోం మినిష్టర్ వైపు తిరిగాడు, "తమరు వెంటనే ఢిల్లీలోని పోస్టల్ అధికారులతో సంప్రదించాలి."

"ఎందుకు?"

పోష్టు మాష్టర్ జనరల్ కి చెప్పిన విషయాలే చెప్పాడు.

"ఢిల్లోలో కేరాఫ్ పోష్టు మాష్టర్ అని వచ్చిన ఉత్తరాలన్నిటిని వెంటనే మీ ఆఫీసుకు పంపమని చెప్పండి. మీరు ఢిల్లీకి వెళ్ళగానే మీరే వాటిని తెరచి చూడండి. ఆ కాగితాలుంటాయేమో!" అన్నాడు యుగంధర్.

హోం మినిష్టర్ ఒక్క క్షణం ఆలోచించి "నేనే వెళ్ళి ఆ కవర్లను, పాకెట్లను చూడాలా, లేక నా సెక్రటరీని పంపించవచ్చా?"

"మీ సెక్రటరీని పంపితే చాలు. ఆ కాగితాలు చూసి అవి అవునో కాదో తెలుసుకోగలడా ఆయన?"

"ఆ!"

"అయితే ఆయన్నే పంపండి. నేను మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటాను. మీరింకా ఇక్కడ కొన్ని రోజులుంటారా?" అడిగాడు యుగంధర్.

"ఎల్లుండి బయలుదేరుతాను ఢిల్లీకి" అన్నాడు హోం మినిష్టర్. యుగంధర్ హోం మినిష్టర్ వద్ద సెలవు తీసుకుని తిన్నగా పోలీసు కమీషనర్ ఆఫీసుకు వెళ్ళాడు

"యుగంధర్! పోలీసు జీపును దొంగతనం చేసినట్టు మీమీద ఫిర్యాదు దాఖలు చేయబడింది!" అన్నాడు కమీషనర్ నవ్వుతూ.

"పాపం! ఆ కానిస్టేబులుకి నా క్షమాపణలు తెలియ చేయండి" అని చేతి గడియారం చూసుకుని "నాకు ఎవరయినా టెలిఫోను చేశారా?" అడిగాడు.

"పది నిమిషాల క్రితం మీ అసిస్టెంటు రాజు టెలిఫోను చేశాడు. మళ్ళీ చేస్తానన్నాడు."

"గుడ్!" అని యుగంధర్ కుర్చీలో చతికిలబడ్డాడు.

సరిగా పదినిమిషాల తర్వాత కమీషనర్ బల్లమీద టెలిఫోను గణ గణమోగింది. యుగంధర్ టెలిఫోను తీశాడు.

"హల్లో!"

"యుగంధర్ గారా?" అడిగాడు రాజు.

"అవును. ఏమిటి విశేషం?"

"ఏమీలేదు. తొమ్మిదిగంటలదాకా అక్కడే కాపలా కాచాను. అంతా సవ్యంగానే ఉంది. అనుమానించవలసినదేమీ కనిపించలేదు."

"చాలామంది వచ్చి వెళ్ళారా?"

"అవును. వాళ్ళ ఆనవాళ్ళూ, కార్ల నెంబర్లూ వ్రాసుకున్నాను."

"గుడ్! చెప్పు! ఆ కార్లెవరివో దర్యాప్తు చేయిస్తాను."

"ఒక్క క్షణం ఆగండి" అనడం, "చెపుతాను వ్రాసుకోండి" అనడం వినిపించింది యుగంధర్‌కి.

తర్వాత ఒక మూలుగు వినిపించింది, "రాజూ!" పిలిచాడు యుగంధర్. జవాబు లేదు.

"రాజూ! రాజూ!" ఖంగారుగా కేకవేశాడు టెలిఫోనులో. అప్పటికి జవాబు లేదు. టెలిఫోను రిసీవరు హుక్కులో పెట్టినట్లు క్లిక్ మన్న శబ్దం అయింది.

యుగంధరు ఇక తాత్సారం చెయ్యలేదు. ఎక్స్ఛేంజ్ నెంబరు తిప్పాడు. "హల్లో! ఇది పోలీసు కమీషనర్ ఆఫీసు. ఇప్పుడు పోలీసు కమీషనరుకి ఫోను చేసింది ఎక్కణ్ణించో చెప్పండి. కాల్ ట్రేస్ చెయ్యమని చెప్పాముగా."

"వల్లభాయి పార్కు వెనక ఉన్న పబ్లిక్ టెలిఫోను బూత్ నుంచి" ఆపరేటర్ జవాబు చెప్పిందో లేదో యుగంధరు టెలిఫోను బల్లమీద పడేసి బయటకు పరిగెత్తారు. పరిగెత్తుతూనే జేబులోంచి రివాల్వరు తీసి అందులో తుటాలు పెట్టి, సేఫ్టీకాచ్ తీశాడు. దోవలో ఆగివున్న ఒక కారు కనబడింది. ఆ కారెక్కి స్టార్ట్ చేశాడు. ట్రాఫిక్ రూల్సునూ, స్పీడ్ లిమిట్‌ని పాటించకుండా గంటకు 60 మైళ్ళ స్పీడులో కారు తోలాడు.

వల్లభాయ్ పార్కు చేరుకునేందుకు సరిగా ఎనిమిది నిమిషాలు పట్టింది. టెలిఫోను బూత్ పక్కన చప్పున కారు ఆపి, కారులోంచి దూకాడు యుగంధరు. చేతిలో రివాల్వరు సిద్ధంగా ఉంది. రివాల్వరు ముందుకు గురిపెట్టి, టెలిఫోను బూత్ తలుపు తెరిచాడు.

టెలిఫోను బూత్ ఖాళీగా ఉంది. బఠానీలు, వేరుశెనగలు వున్న ఒక బుట్ట మాత్రం ఉందక్కడ. జేబులోంచి టార్చి తీసి, వెలిగించి టెలిఫోను బూతును జాగ్రత్తగా పరీక్ష చేశాడు. రాజు ఏమైనదీ తెలిసేందుకు సూచన ఒక్కటికూడా లేదు.

రాజు తనకు టెలిఫోను చేస్తుండగా ఆ చీకట్లో ఎవరో వెనకనుంచి వచ్చి అతన్ని ఏ తలమీదో కొట్టారు. రాజు స్పృహ తప్పిపడిపోయాడు. ఆ కొట్టిన మనిషి టెలిఫోను హుక్కుమీద పెట్టి, రాజుని తనతో తీసుకు వెళ్ళివుండాలి. అంటే కనీసం ఇద్దరయినా వచ్చి ఉండాలి. రాజుని ఒక్క మనిషి మోసుకు వెళ్ళలేడు.

రాజుని మారువేషంలో వెళ్ళి దర్జీ షాపును కనిపెడుతూ ఉండమని తను చెప్పాడు. బఠాణీల బుట్ట చూశాక రాజు ఏ మారువేషంలో దర్జీ షాపుముందు కాప కాచాడో యుగంధర్ గ్రహించాడు.

అయితే రాజు అలా మారువేషంలో కాపు కాస్తున్నాడని ప్రతి కక్షులకు ఎలా తెలిసింది? అక్కడే కాపు కాస్తున్న నెం 333 ఏమయ్యాడు? రాజుతో కూడా లేడా? అతనికీ ఆపద సంభవించిందా? రాజు తెలివిలేని వాడు కాదు. మోసపోయేవాడు కాడు. సంవత్సరాల తరబడి తన దగ్గర శిక్షణ పొందిన రాజు మారువేషం వేసుకున్నాక సులభంగా ఆనవాలు తెలియనీయడు.

ఎవరూ తనను గుర్తుపట్టలేదనుకునే రాజు తనకు టెలిఫోను చేశాడు. ఎక్కడా రక్తంలేదు. ఒక నిట్టూర్పు వదిలాడు. అంతవరకూ నయమే. రాజుకు టెలిఫోను బూత్‌లో పెద్ద ప్రమాదం జరగలేదు.

యుగంధరు టార్చి ఆర్పేశాడు. టెలిఫోను బూత్‌లో ఒంటిగా నిలుచున్నాడు. చీకటిగా ఉంది. వీధిలో ఉన్న దీపాల వెలుతురు అంతవరకూ పడటంలేదు.

ఇప్పుడు తనేం చెయ్యాలి? పోష్టు మాష్టర్ జనరల్ ఇంటికెళ్ళి తనపని తను చూసుకోవాలా, స్వప్రయత్నంతో తప్పించుకునేందుకు రాజును విడిచిపెట్టడం మంచిదా?

ఊహూ! ప్రతికక్షులు సామాన్యమైన దొంగలు కారు. మామూలు రకమైతే వాళ్ళ బారినుండి రాజు తప్పించుకోగలడు. వాళ్ళను పట్టుకుని, తీసుకువచ్చే సమర్ధతకూడా ఉంది రాజుకు. కాని ఈ ప్రతికక్షులు ఆరితేరిన గూఢచారులు. ప్రాణాలకు తెగించిన సాహసులు. రాజుని, వారి దయాదాక్షిణ్యాలకు వదిలివేయడం అతన్ని బలివ్వడమే అవుతుంది. తను రాజు సహాయానికి వెళ్ళాలి.

హుస్సేన్ దర్జీ షాపుకి, ఈ దుష్కార్యాలకూ చాలా సంబంధం ఉండాలి, లేకపోతే రాజుమీద బలం ప్రయోగించవలసిన అవసరం ఏముంది!? రాజు ఆ షాపుకు వచ్చినవాళ్ళ ఆనవాళ్ళూ, కార్ల నెంబర్లూ చెప్పబోతుండగా ఎవరో అతన్ని కొట్టారు. అతని చేతిలో డైరీ ఉండివుండాలి. అదేమయింది?

రాజుని ఎలా, ఎంతమంది తీసుకు వెళ్ళారు? ఈ ఆలోచనలు రాగానే యుగంధర్ బూత్ లోంచి బయటకు వచ్చి టార్చి వెలిగించి నేలను పరీక్ష చేసాడు. రోడ్డు ప్రక్కన సిమెంటు పేవ్‌మెంట్ మీద ఉన్నది ఆ టెలిఫోను బూత్. ఆ సిమెంటు నేలమీద అడుగుజాడలు కనిపించవు. ఎంత తెగించిన వారయినా నడిరోడ్ మీద ఎవర్నీ మోసుకు వెళ్ళరు. కనక టెలిఫోన్ బూత్ వెనక ఉన్న పార్క్ వైపు తీసుకువెళ్ళి ఉండాలి. యుగంధర్ టార్చి వెలుగులో నేలను పరిక్షిస్తూ అటు నడిచాడు. నేలమీద చాలా జతల అడుగుజాడలు మట్టిలో కనిపించాయి. ఆ సాయంకాలం పార్కులోకి వచ్చివెళ్ళిన జనం ఎంతమందో! అందుకనే ఆ అడుగుజాడలు చిందరవందరగా కలిసిపోయి ఉన్నాయి. వాటి పైన తర్వాత పడ్డ అడుగుజాడలు స్పష్టంగా కనిపించాయి. వాటినే యుగంధర్ పరీక్షగా చూస్తున్నాడు. చాలా పెద్ద పాదాలవి. ఇద్దరు మనుష్యులు ఒకళ్ళ వెనక ఒకరు నడిచారు. ఆ రెండు జతల జాడలకూ మధ్య దూరం ఎక్కువా కాదు తక్కువా కాదు. ఆ జాడలు పార్కులోంచి, చెట్ల వెనకనుంచి, గేటు దగ్గర వరకూ ఉన్నాయి. అక్కడ ఆగిపోయాయి. అక్కడే ఓ కారు టైర్ల గుర్తులున్నాయి. కారు టైర్లను బట్టి ఆ కారు పెద్ద కారని గ్రహించాడు యుగంధర్. ఆ రెండు జతల జాడలు సమదూరంలో ఉండడంవల్ల వాళ్ళిద్దరూ రాజుని మోసుకు వెళ్ళారని యుగంధరు నిశ్చయించాడు.

మూడో జత అడుగుజాడలు కూడా కనిపించాయి. అయితే ఈ జాడలు ఆ ముందు జాడల వెనక లేవు. ఒక చెట్టునుంచీ ఇంకో చెట్టుకీ, ఆ చెట్టునుంచీ ఒక పొదకీ వెళ్ళినట్లు అగుపిస్తున్నాయి. రాజును మోసుకు వెళ్ళిన మనుష్యుల పాదాల జాడల వెనక ఉన్నాయి ఈ జాడలు. కనుక మొత్తం ముగ్గురు వచ్చివుండాలి. ఇద్దరు రాజుని మోసుకు వెళుతుండగా ఒక మనిషి వెనక ఎవరూ రాకుండా కాపుకాచి ఉండాలి.

యుగంధర్ కారు టైర్ల గుర్తులను చూస్తూ, ఆ కారు ఎటు వెళ్ళిందీ చూస్తున్నాడు. ఇంతలో అతని దృష్టి ఆ కారు టైర్ల గుర్తుల పక్కన ఉన్న ఒక చిన్న రాయిమీద పడ్డది. ఆ రాయి కింద మడిచి పెట్టిన ఒక కాగితం తెల్లగా కనబడింది. యుగంధర్ రెండంగలలో ఆ రాయి దగ్గరకు వెళ్ళి కాగితం తీశాడు. చేతిలోకి రెండు కాగితాలు వచ్చాయి. ఒకటి చాలా చిన్నది. డైరీలోంచి చింపినట్టు తెలుస్తోంది. "భయంలేదు. 333" అని రాసి ఉంది.

రెండోది కొంచెం పెద్ద కాగితం. చాలా రాసివుంది.

"యుగంధర్!

ఇది ఆఖరు హెచ్చరిక. మీరు వెంటనే దర్యాప్తు ఆపి మద్రాసుకు తిరిగి వెళ్ళితే కొద్ది దినాలలో రాజు సురక్షితంగా అక్కడకు చేరుకుంటాడు. లేదా మీకు ట్రంకు పెట్టెలో పంపించబడతాడు."

యుగంధర్ కళ్ళు కఠినమయ్యాయి. పెదిమలు బిగించాడు. శరీరంలోని కండరాలన్నీ బిగుసుకున్నాయి. బరువుగా ఊపిరి పీల్చి, ఒదిలాడు. జేబులోంచి పిసోలు తీశాడు. మళ్ళీ ఓసారి తూటాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకున్నాడు. చకచక నడవడం మొదలు పెట్టాడు.

✡✡✡

## 7

**డైరీలో రాసుకున్న** వివరాలను టెలీఫోనులో చదివి వినిపించేందుకు రాజు జేబులోంచి డైరీ తీసి, టార్చి వెలిగించాడో లేదో, వెనక లీలగా అలికిడి అయింది. రాజు చటుక్కున వెనక్కు తిరగబోయాడు, కాని అప్పటికే ఆలస్యం అయింది. చీకట్లో ఒక చెయ్యి తనమీదకు రావడం కనిపించింది. మరుక్షణం అతనికి స్పృహపోయింది. కుప్పలా కూలిపోయాడు. క్రింద పడిన వెంటనే అతనికి తిరిగి స్పృహ వచ్చింది. తల పక్కకు తిప్పడంవల్ల దెబ మాడుమీద కాకుండా పక్కకు తిప్పడంవల్ల దెబ్బ మాడుమీద కాకుండా పక్కకు తగిలింది. పిస్తోలు పిడితో కొట్టాడు.

తను కిందపడగానే ఇద్దరు ఆజానుబాహులు బూత్‌లోకి రావడం చూశాడు. ఒక పక్క తల వేయిముక్కలు అవుతున్నట్లు బాధ. మరొక పక్క వాళ్ళచేతికి చిక్కిపోతున్నాననే బెంగ. తను లేచి వాళ్ళతో పోట్లాడడానికి అవకాశంలేదు. టెలిఫోనుబూత్ చిన్నది. తను కదిలాడా ఈసారి తలమీద గట్టిగా కొడతారు.

రాజు తెలివైన పనిచేశాడు. ఆ మొదటి దెబ్బకే స్పృహ పోయినట్టు నటించి, జీవచ్ఛవంలా ఉండిపోయాడు.

"కొంపతీసి గట్టిగా కొట్టావా ఏమిటి? మనిషిలో చలనం లేదు." అన్నాడు రహస్యంగా ఒకతను.

"గట్టిగానే కొట్టాను కానీ ప్రాణం పోలేదులే" అన్నాడు రెండో మనిషి రాజు ముక్కు దగ్గిర చెయ్యిపెట్టి శ్వాస ఆడుతుందో లేదో చూసి.

టెలిఫోను హుక్ మీద పెట్టి ఒకతను తలా, రెండో అతను కాళ్ళు పట్టుకుని బయటకు మోసుకువెళ్ళారు రాజుని. అంతా చకచక జరిగిపోయింది. తను తన్నుకుని విదిలించుకుని, పారిపోవడానికి అవకాశాలు ఆలోచించాడు రాజు. ఒక కన్ను కొంచెంగా తెరిచి చూశాడు. ఇద్దరి చేతుల్లోనూ పిస్తోళ్ళున్నాయి. ఇద్దరూ బలశాలులు. అందువల్ల రాజు స్పృహ తప్పినవాడిలా నటించాడు.

ఒక పెద్ద కారులో వెనక సీటుకింద రాజును పడుకోబెట్టారు. ఒకతను డ్రయివర్ సీటులో కూర్చున్నాడు. రెండోమనిషి వెనకసీటుమీద రాజు పక్కనే కూచున్నాడు. "కాగితం పెట్టడం మర్చేపోయాను" అంటూ డ్రైవింగ్ సీటులో అతను దిగి వెళ్ళి ఒక నిముషంలో తిరిగివచ్చి కారెక్కి స్టార్ట్ చేశాడు.

రాజు కళ్ళుమూసుకుని చలనం లేకుండా పడివున్నాడు. తను ప్రతికక్షులచేతికి చిక్కాడు కనుక ఈ అవకాశం తీసుకుని ప్రతికక్షుల్ని గురించి వీలయినంత తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కారు ఎన్నిసార్లు, ఎటువేపు తిరుగుతోందో జ్ఞాపకం పెట్టుకుంటున్నాడు.

ఇరవై నిమిషాలు కారు ప్రయాణం చేసింది. కారులో ఆ ఇద్దరూ ఆ ఇరవై నిమిషాలూ ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. ఉన్నట్లుండి కారు ఆగింది.

"లేచాడా?" అడిగాడు డ్రయివర్ సీటులో ఉన్న అతను. రెండో అతను ఒంగి రాజుని కదిల్చి చూశాడు. "ఊహూ!" అన్నాడు.

"అయితే మళ్ళీ మొయ్యవలసిందేనా?" అంటూ డ్రయివర్ సీటులోంచి దిగివచ్చి, వెనక తలుపు తెరిచి, రాజు కాళ్ళు పట్టుకుని లాగాడు. వెనక సీటులో ఉన్న అతను రాజు భుజాలు పట్టుకుని ముందుకు తోశాడు.

రాజుని కారులోంచి బయటికి లాగారు. రాజు ఓరకంటితో ఒకసారి చుట్టూ చూశాడు. చాలా పెద్దతోట. గుబురుగా చెట్లు, పూల మొక్కలు కనిపించాయి. దూరంగా ప్రహరీగోడ తెల్లగా కనిపిస్తోంది. ఇంకోవైపున ఇరవై గజాల దూరంలో ఒక పెద్ద బంగళా కనిపించింది. ఆ బంగళాలో మేడమీద గదుల్లో మాత్రం మసకగా దీపాలు వెలుగుతున్నాయి.

ఇక తాత్సారం చేస్తే మంచిది కాదని నిశ్చయించుకున్నాడు రాజు. ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చాడు. కండలన్నిటినీ బిగదీశాడు. బలాన్నంతటినీ కూడదీశాడు. బిగించిన ఉక్కుతీగెలా తయారయింది అతని శరీరం.

ముందు కాళ్ళు పట్టుకుని నడుస్తున్న అతన్ని గట్టిగా నడుంలో తన్నాడు. సరిగా అప్పుడే క్షణం కూడా తేడా లేకుండా గుప్పిట బిగించి బలంకొద్దీ భుజాలు పట్టుకున్న మనిషి పొట్టలో గుద్దాడు.

కాళ్ళు పట్టుకున్న మనిషి అయిదు గజాల దూరంలో రాజు తన్నిన తన్నుకి బోర్లాపడ్డాడు. భుజాలు పట్టుకున్న మనిషి ఒక్క గావుకేకపెట్టి నేలమీద కూలాడు రాజు క్షణం ఆలస్యం చేయలేదు. వెనక్కి తిరగిచూడలేదు. ఆ ఇద్దరూ ఏమయ్యారో అతనికి పట్టలేదు. ప్రాణం కోసం పరిగెత్తాడు - వాయువేగంతో పరిగెత్తాడు - పూల మొక్కల్లోకి - చెట్లనీడల్లోకి - పొదల వెనకాలకు - తెల్లని ప్రహరీ గోడ దగ్గరకు - పరిగెత్తాడు.

## 8

రాత్రి పదిగంటలు దాటింది. యుగంధరు వల్లభాయి పార్కునుంచి బయలుదేరి చకచకనడుస్తున్నాడు. రాజు ఏమయ్యాడో అనేదే అతని మనస్సులో ఉన్న ఆలోచన. ఆ ఆలోచనకి అడ్డంగా అతని మనస్సులో ట్రంకు పెట్టె, ట్రంకు పెట్టెలో శవం గురించిన ఆలోచనలు వస్తున్నాయి. తను ఇప్పుడు ఆదుకోకపోతే రాజుని కూడా అదే స్థితిలో చూస్తాడేమో! ఆ దర్జీ కొట్టుకీ, ప్రతికక్షులకూ చాలా సంబంధం ఉంది. కమీషనర్‌కు ఫోను చేసి, పోలీసు సిబ్బందిని పిలిపించి దర్జీ కొట్టుమీద దాడి జరిపి సోదా చేద్దామా అనే ఆలోచన కలిగింది. వెంటనే ఆ ఆలోచన మానుకున్నాడు. ప్రతికక్షులు అంత తెలివిమాలినవారు కారు. రాజుని అక్కడ అట్టే పెట్టరు. తను ఒంటిగా వెళితేనే ప్రతికక్షులు అంత తెలివిమాలినవారు కారు. రాజుని అక్కడ అట్టే పెట్టరు. తను ఒంటిగా వెళితేనే ప్రతికక్షుల రహస్యాలు కనుక్కొని, రాజును రక్షించేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయి.

హారన్ బీ రోడ్ మీదున్న హుస్సేన్ దర్జీ షాపు దగ్గరకు చేరుకున్నాడు. ఆ షాపు దగ్గర వీధిదీపం లేనందువల్ల చీకటిగా ఉంది. కిందవున్న షాపులన్నీ మూసి ఉన్నాయి. వీధిలో కూడా అట్టే జనసంచారం లేదు. రెండుసార్లు యుగంధర్ షాపుకు వేసివున్న తాళాన్ని చూస్తూ ఆ షాపుముందు నడిచాడు. మూడోసారి తిరిగి అటు వచ్చినపుడు అతని చేతిలో మారుతాళం చెవుల గుత్తి ఉన్నది. ఒకసారి వెనక్కి చూసి, తననెవరూ గమనించడం లేదని నిర్ధారణ చేసుకుని యుగంధర్ చటుక్కున ఆ తలుపు దగ్గరకు వెళ్ళాడు. ఒక నిమిషంలో తాళం తెరుచుకుంది. అడ్డ గడియ తీశాడు. కొంచెం కొంచెంగా తలుపు తెరిచాడు. నీడలా చీకట్లో లోపలకు వెళ్ళి, తలుపు మూసేశాడు.

ఊపిరి బిగపట్టి, నిశ్చలంగా ఆ షాపులో తలుపుకు ఆనుకుని నిలుచున్నాడు. లోపల కటిక చీకటి.

లోపల ఎవరయినా ఉన్నారేమో! మరొక తలుపు ఉందేమో! యుగంధర్ అయిదు నిమిషాలపాటు కదలకుండా నిలుచున్నాడు.

అంతా నిశ్శబ్దంగా ఉంది. యుగంధర్ గుండె కోట్టుకోవడమ తనికే వినిపిస్తోంది. ఆ గదిలో ఎవరూ లేరని నిశ్చయించుకున్నాడు. జేబులోంచి టార్చిలైటూ తీసి వెలిగించాడు. దర్జీ కొట్టు ఎలా ఉంటుందో అలాగే ఉంది ఆ గది. ఒక పొడుగాటి బల్ల, దానిమీద లెక్కల పుస్తకం, కత్తిర, టేపు, నేలమీద చాపలు, చాపల మీద నూలు పోగులు, గుడ్డపీలికలు, ఎక్కడ చూసినా కత్తిరించిన గుడ్డలు, కొత్తగుడ్డలు.

వీధి తలుపు కెదురుగా ఒక తలుపు ఉన్నది. యుగంధర్ ఆ తలుపును కొంచెంగా తెరచి చూశాడు. గదిలో ఎవరూ లేరు. లోపలకు వెళ్ళాడు. ఒక అరడజను కుట్టుమిషన్లున్నాయి. తీగలమీద ఉతికిన బట్టలు ఆరేసి ఉన్నాయి. బీరువాలు, వాటిలో కుట్టిన బట్టలు కనపడాయి. ఆ గదిలోంచి ఇంకో తలుపు ఉన్నది. ఆ తలుపు గడియవేసి ఉంది. కనక అటునుంచి లోపలకెవరూ రాలేరని

నిశ్చయించుకున్నాడు యుగంధర్: ఆ తలుపు తప్ప ఆ గదికి మరో తలుపు లేదని ధ్రుఢపరచుకున్నాడు. వెనక్కి తిరిగి ముందున్న గదిలోకి వెళ్ళాడు. ఓపిగ్గా ఆ గదిలో వస్తువులన్నిటినీ పరీక్ష చేయసాగాడు. ముందు లెక్కల పుస్తకం తీశాడు. అందులో ఎవరు ఏమిటి కుట్టడానికి ఇచ్చినదీ, వారి కొలతలు, వారి బట్టలు ఎప్పుడు కుట్టి ఇవ్వవలసినదీ వ్రాసి ఉంది. మిస్. లత, కమలాదేవి ఉమెన్స్ హాస్టల్ రెండు వెల్వెట్ జాకెట్లు కుట్టడానికి ఇచ్చినట్లు వ్రాసి ఉంది అది చూసి యుగంధర్ కి సందేహం కలిగింది.

ఆ దర్జీ షాపులో మోసం ఏమీ లేదేమో! లత స్నేహితురాలితో గుడ్డలు కుట్టించుకోవడానికి ఇక్కడకు వచ్చిందేమో! ఆమెకు తర్వాత మరెక్కడయినా ఆపద సంభవించిందేమో! లేకపోతే దర్జీ పుస్తకంలో ఆమె పేరు, వివరాలు ఎందుకుంటాయి? ఈ దర్జీ కొట్టూకూ, గూఢచారులకూ సంబంధం లేకపోతే తను అక్కడ కాలం వృధాచేస్తున్నాడు. అనుమానించ తగ్గవి ఏవీ కనిపించడంలేదు ఆ గదిలో.

యుగంధర్ కు ఒక ఆలోచన తట్టింది. గబగబ బీరువాలు అన్నీ వెదకడం ప్రారంభించాడు. తర్వాత లోపల గదిలో బీరువాలన్నీ వెదికాడు. రకరకాల బట్టలున్నాయి. కానీ ఎక్కడా వెల్వెట్ బట్టలేదు. మళ్ళీ ముందుగదిలోకి వచ్చి కుట్టిన దుస్తులు ఇచ్చినప్పుడు సంతకం చేయించుకునే పుస్తకం తిరిగేశాడు. అందులో ఎక్కడా వెల్వెట్ జాకెట్లు ఇచ్చినట్లు లేదు. యుగంధర్ నవ్వుకున్నాడు. "ప్రతికక్షులు కూడా పొరపాట్లు చేస్తున్నారు" అనుకున్నాడు.

వెనకాల గదిలో నిలుచుని ఆలోచించసాగాడు. ఎక్కడో ఏదో రహస్యం ఉండి ఉండాలి. బహుశా ఈ కొట్టు గూఢచారులు ఒకరికి ఒకరు వార్తలు అందజేసుకునే కార్యాలయం మాత్రం అయివుంటుంది. వెనక గదిలో లోపల గడియవేసి ఉన్న తలుపు ఎక్కడికి దారి తీస్తుందో తెలుసుకోవాలనుకుని, యుగంధర్ టార్చ్ ఆర్పేశాడు. చప్పుడు కాకుండా గడియతీశాడు. నెమ్మదిగా తలుపు తెరిచాడు. చేతిలో పిస్తోలు పట్టుకున్నాడు. అవతల ఒక నడవా ఉంది. యుగంధర్ ఆ నడవాలోకి వెళ్ళాడు. చాలా పొడుగాటి నడవా అది. ఇవతల అవతల వరసగా తలుపులున్నాయి. వరసగా ఉన్న కొట్లకు వెనక వేపు నడవా అది. నీళ్ళ పంపుకి, నీళ్ళ గదులకూ వెళ్ళడానికి అన్ని షాపులవాళ్ళూ ఉమ్మడిగా వాడుకుంటున్నారు దాన్ని.

యుగంధర్ ఆలోచిస్తూ ఆ నడవాలో నిలుచున్నాడు. పిస్తోలు మీటమీద వేలు నొక్కి పెట్టాడు. తను అజాగ్రత్తగా ఉండి ప్రమాదాన్ని ఆహ్వానించదలుచుకోలేదు. ఒక క్షణం ఆగి, ఆ గంట మళ్ళీ మోగింది.

అది టెలిఫోను గంట అని యుగంధర్ గ్రహించాడు. పక్క కొట్టులో ఎక్కడో టెలిఫోను మోగుతోంది. ఇంతరాత్రివేళ ఎందుకు ఎవరు టెలిఫోను చేస్తున్నారు. అది మందుల కొట్టేమో! యుగంధర్ చప్పుడు చేయకుండా గంట వినిపించిన షాపువైపు నడిచాడు. మళ్ళీ గంట మోగింది. ఆ తలుపు దగ్గిర ఆగాడు. దర్జీ కొట్టుకి నాలుగు గదుల అవతలవున్న కొట్టు అది. ఆ చీకట్లోనే యుగంధర్ వెనక తలుపు చూశాడు. కనుబొమలు చిట్లించి ఆలోచిస్తూ చూశాడు.

వెనక తలుపులు సామాన్యంగా లోపల గడియపెట్టుకుని ముందు తలుపుకు తాళం వేసుకుంటారు. ఎవరూ వెనక తలుపుకు కూడా బయట తాళం వేయరు. ఈ షాపు వెనక తలుపుకు తాళం ఉంది. కాని గొళ్ళెం పెట్టి తాళం గొళ్ళానికి వేలాడుతుండడం బట్టి ఆ షాపువాళ్ళు అప్పుడప్పుడు వెనక తలుపుకు బయట తాళం వేస్తుంటారని యుగంధర్ గ్రహించాడు.

ఎవరయినా ఎందుకు వెనక తలుపుకు తాళం వేస్తారు? జాగ్రత్తకా? అయితే లోపలే గొళ్ళెం పెట్టించి లోపలే తాళం వేసుకుంటారు. బయట తాళం వేశారంటే ఆ షాపువాళ్ళు వెనక తలుపులోంచి అప్పుడప్పుడు షాపులోకి వచ్చి వెళుతుంటారని అనుకోవచ్చు. ముందు తలుపు తెరిచి షాపులోకి వచ్చే బదులు వెనక తలుపు తెరిచి షాపులోకి వచ్చి వెళుతుంటారని అనుకోవచ్చు. ముందు తలుపు తెరిచి షాపులోకి వచ్చే బదులు వెనక తలుపు తెరిచి షాపులోకి వెళ్ళే అవకాశం కోసం అలా వెనక తాళం వేస్తున్నారు.

యుగంధర్‌కి అసహజమైనదేది కనబడ్డా అనుమానం కలుగుతుంది. నడవాలోంచి బయటకు వెళ్ళేందుకు దారివున్నదా అని చూశాడు. నడవా చివర్న ఒక తలుపు ఉంది. ఆ తలుపు తెరిచాడు. అది వెనకవున్న సందులోకి ఉంది. కనుక ఆ షాపువాళ్ళు రాత్రిళ్ళు వెనకనుంచి వచ్చి, వెనక తలుపులు తెరచుకుని షాపులోకి వెళ్ళే ఏర్పాటు చేసుకున్నారన్నమాట. ఇదేమీ అంత అనుమానించవలసిన విషయం కాదు నిజానికి. ఆ షాపువాళ్ళు పని ఎక్కువగా ఉండి రాత్రిళ్ళు కూడా పని చేస్తుండవచ్చు. రాత్రిపూట ముందు తలుపు తెరుచుకురావటం కన్నా వెనక తలుపు తెరుచుకురావడం సులభం.

టెలిఫోను గంట ఇంకా ఆ షాపులో మోగుతోంది. యుగంధర్‌కు మళ్ళీ అనుమానం కలిగింది. ఎవరయినా అవసరంగా ఏదయినా ఆఫీసుకు ఫోను చేస్తే, ఎంతసేపటికీ అవతలనుంచి టెలిఫోను తీసినట్లు చప్పుడు వినపడకపోతే ఎవరూ లేరేమోనని టెలిఫోను పెట్టేస్తారు. కాని ఈ టెలిఫోను మోగుతూనే ఉంది. యుగంధర్ తలుపు దగ్గరకు వెళ్ళి నిలుచున్నాడు.

ఉన్నట్లుండి టెలిఫోను ఆగింది. ఎవరో టెలిఫోను రిసీవర్ హుక్ మీదనుంచి తీసినట్లు 'టిక్'మని చప్పుడు అయింది. కానీ మాటలేమీ వినపడలేదు.

యుగంధర్‌కు అంతా అసహజంగా కనపడింది. అనుమానాస్పదంగా ఉంది. యుగంధర్ మనసు ఆ క్షణంలో దేన్నయినా అనుమానించే స్థితిలో ఉంది. ప్రతికక్షుల ఆచూకీ తెలిసేందుకు ఏ చిన్న విషయమైనా కనబడుతుందా అని చూస్తున్నాడు.

తలుపు నెమ్మదిగా తోశాడు. అది చప్పుడూ చెయ్యకుండా తెరుచుకుంది. లోపల ఇంకో గదిలో అంటే ముందున్న గదిలో టెలిఫోను ఉండి ఉండాలి అని చప్పుడు బట్టీ యుగంధర్ గ్రహించాడు. తలుపు వెనక నక్కి నిలుచుని తల లోపలకు పెట్టి చూశాడు. కారు చీకటి - ఏమీ కనిపించడంలేదు.

"దయచేసి కదలవద్దు. కదిలితే పిస్తోలు పేలుతుంది."

టార్చిదీపం యుగంధర్ మొహం మీద పడింది. కళ్ళు చిట్లించాడు. కాని తల తలుపు వెనక్కి తీసుకునేందుకు ధైర్యంలేదు. టార్చికింద నల్లని పిస్తోలు, తెల్లని చెయ్యి కనబడుతున్నాయి. ఆ చేతిలో పిస్తోలు కదలడంలేదు. సూటిగా తన తలవైపు గురిపెట్టబడ్డది. ఆ మనిషి చెయ్యి గురితప్పే చెయ్యిలా లేదు. పిస్తోలు పట్టుకోడానికీ, పేల్చడానికీ బాగా అలవాటుపడ్డ చెయ్యిలా కదలకుండా ఉంది.

✡✡✡

"**ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్** - హంతకులకూ దొంగలకూ సింహస్వప్నం అయిన యుగంధర్ ఎలుకలా తనంతట తను బోనులోకి వచ్చాడు" అంటూ నవ్వు వినిపించింది.

యుగంధర్ మాట్లాడలేదు. పిస్తోలు పట్టుకున్న చేతినే చూస్తున్నాడు. తెల్లని పల్చని చేయి అది. గులాబీ రంగులో ఉన చెయ్యి. మెత్తగా, పల్చగా సున్నగా ఉన్న ఆ చేతివేళ్ళ గోళ్ళకున్న రంగు ఎర్రగా మెరుస్తోంది. బెదిరిస్తూ, పైలిన ఆ కంఠస్వరం మధురంగా, ఖంగున వీణ మీటినట్లుంది. ఆ నవ్వు గుడిగంటలు మోగినట్లు గణగణమన్నది. ఆమె స్త్రీ. వయసులో ఉన్న స్త్రీ. ఆ చేయి, కంఠస్వరం చాలు ఆమె అమోఘమైన సౌందర్యవతి అని అనుకోవడానికి.

అయితే ఆమె ఏ దేశస్తురాలు? ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది. కాని పాశ్చాత్యుల ఉచ్చారణ కాదు.

"నువ్వెవరు?" అడిగాడు యుగంధర్.

"నా పేరూ, ఊరూ చెప్పి నన్ను నేను పరిచయం చేసుకోవడం మర్యాదే అవును. కాని మిష్టర్ యుగంధర్! ఈ పరిస్థితి అటువంటి మర్యాదలకు అనుకూలమైనది కాదు. ఆ మర్యాదలు మరొక సందర్భంలో ఆచరిద్దాం. సరేనా!" అని నవ్వింది. మరుక్షణం ఆమె స్వరం మారింది. "మిష్టర్ యుగంధర్ తిన్నగా నడిచి ఆ ముందు గదిలోకి వెళ్ళండి. చేతులు పైకెత్తే ఉంచండి" అంది.

యుగంధర్ చేతులు పైకెత్తి నడిచాడు. అతని వీపు మీద టార్చి వెలుగుపడుతోంది. ఏ ఉపాయానికి అవకాశంలేదు. చేతులు దింపితే వెనక పిస్తోలు పేలవచ్చు. ముందున్న గదిలోకి నడిచాడు.

"ఇంకా లోపలకు, గది చివరకు వెళ్ళండి" అంది.

చివరికి వెళ్ళాడు. ఉన్నట్లుండి వెనక టార్చి వెలుగు పోయింది. యుగంధర్ చటుక్కున వెనక్కి తిరిగాడు. సరిగ్గా అదే సమయానికి వెనక తలుపు మూసుకుంది. గడియ వేసిన శబ్దం అయింది. యుగంధర్ తలుపు దగ్గిరకు పరిగెత్తి లాగి చూశాడు. రాలేదు.

"హాయిగా పడుకుని నిద్రపొండి. మనం మళ్ళీ కలుసుకుందాం. తప్పించుకునేందుకు అనవసరంగా శ్రమ పడకండి, ప్రయోజనం లేదు" అన్నదామె తలుపు అవతలనుంచి.

యుగంధర్ జేబులోంచి టార్చి తీసి వెలిగించాడు. ఒకసారి గదంతా ఆ వెలుగులో చూశాడు. దర్జీ షాపును పోలిన కొట్టే అది. ఒక బల్ల, రెండు కుర్చీలూ మాత్రం ఉన్నాయి. ఒక షెల్ఫు ఉన్నది బల్లపక్కన. షెల్ఫులో కొన్ని పుస్తకాలున్నాయి. అవి లెక్కల పుస్తకాలు. యుగంధర్ తలుపులు చూశాడు. ముందు తలుపు బయట తాళం వేసివుందని తెలుసుకున్నాడు. ఎందుకయినా మంచిదని ఎవరూ లోపలకురాకుండా రెండు తలుపులూ లోపల గడియపెట్టాడు. దొరికిన అవకాశం పోగొట్టుకోవడం ఎందుకని షెల్ఫులోని పుస్తకాలూ బల్ల సొరుగులోనూ వెతకడానికి ఉపక్రమించాడు. బల్లమీద ఉన్న టెలిఫోను అప్పుడు చూశాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. ప్రతికక్షుల చేతిలో చిక్కానని నిరాశ చెందిన యుగంధర్‌కి ఆశ అనేది మళ్ళీ కలిగింది.

టెలిఫోను తీసి పోలీస్ కంట్రోల్ రూం నెంబరు తిప్పాడు.

"హల్లో! పోలీస్ కంట్రోలా?" అడిగాడు నెమ్మదిగా.

"యస్ సార్!" స్త్రీ జవాబు చెప్పింది.

"హల్లో ఆపరేటర్! నేను యుగంధర్ని. హారన్ బీ రోడ్ మీద హుస్సేన్ దర్జీ షాపున్నది. దానికి కుడివైపున నాలుగు షాపులవతల ఉన్న ఒక కొట్లోకి తాళం బద్దలు కొట్టి వెంటనే రమ్మని నేను చెప్పానని కమీషనర్‌కి చెప్పు. ఆలస్యం చెయ్యక. అర్జంట్!"

"యస్ సార్!"

"ఊ!" అని యుగంధర్ టెలిఫోను పెట్టేశాడు. బల్ల సొరుగులూ, లెక్కల పుస్తకాలూ తనిఖీ చేయనారంభించాడు. "ఈస్టర్న్ ట్రేడర్స్" అనే షాపులో బంధింపబడ్డాననీ, ఆ కంపెనీవాళ్ళు నిజానికి ఏ వ్యాపారమూ చేయడంలేదనీ, అంతా నాటకమేననీ ఆ పుస్తకాలు తిరగేయడం వల్ల యుగంధర్ తెలుసుకున్నాడు. షెల్ఫులో ఉన్న రైల్వే గైడ్ ఒక్కటే తరచూ వాడబడేదని గైడ్ లోని కాయితాలు నలిగి ఉండడం వల్ల గ్రహించాడు. అందులోనైనా ఏదయినా ఆచూకీ తెలుస్తుందేమోనని యుగంధర్ ఓపిగ్గా ఆ పుస్తకం పేజీ పేజీ తిరగేసి చూశాడు. అందులో ఏమీ కనిపించలేదు. యుగంధర్ చేతిగడియారం చూసుకున్నాడు. తను పోలీసు కమీషనర్‌కు టెలిఫోను చేసి పదిహేను నిమిషాలు గడిచాయి. పోలీసువారు ఇంత తాత్సారం చేయడం ఆశ్చర్యంగా ఉంది యుగంధర్‌కి. మళ్ళీ టెలిఫోను తీశాడు.

ఈసారి పోలీసు కమీషనర్ పర్సనల్ నెంబర్ తిప్పాడు. అవతలనుంచి జవాబు లేదు. అవతల గంట మోగుతున్నట్టు కూడా చప్పుడు లేదు. యుగంధర్ అనుమానంతో టెలిఫోను హుక్‌ని రెండు సార్లు నొక్కాడు. టిక్ మనలేదు.

యుగంధర్ కళ్ళు మూసుకుని ఆలోచించాడు. పోలీసు కంట్రోలు రూం ఆపరేటర్ కూడా ఈ గూఢచారుల మనిషేనేమో! ఆ ఆపరేటర్ కంఠస్వరం గుర్తుతెచ్చుకున్నాడు. అంతకుముందు టెలిఫోనులో "యస్ సార్!" అన్న కంఠస్వరం అదివరకు తను విన్న కంఠంలా ఉంది. ఆ గొంతు తను ఎక్కడ ఎప్పుడు విన్నాడు!? మనస్సంతా ఆ విషయం మీద కేంద్రీకరించి యుగంధర్ ఆలోచించాడు. చప్పున స్ఫురించింది. యుగంధర్ తనలో తనే నవ్వుకున్నాడు. ఆ కంఠస్వరం ఎవరిదో కాదు. తనను పిస్తోలు చూపి బెదిరించి ఈ గదిలోకి తోసి, తలుపు మూసిన స్త్రీదే అయితే ఆమె టెలిఫోను కంట్రోలు రూంలోంచి ఎలా మాటలాడింది? యుగంధర్‌కు స్ఫురించింది. తన ముందున్న టెలిఫోను ఎక్స్టెన్షన్ టెలిఫోను, అవతల గదిలో ఇంకో టెలిఫోనున్నది. తను టెలిఫోను తియ్యగానే ఎక్స్టెన్షన్ టెలిఫోను తీసి, లైను డిస్కనెక్ట్ చేసిందామె. తనే కంట్రోలు రూం ఆపరేటర్‌లా మాట్లాడింది.

తెలివీ, సమయస్ఫూర్తిగల మనిషామె. తనకు సమవుజ్జీ. ఆమె ఎవరు? ఆ గదిలోంచి ఎలా తప్పించుకోవడం? అరిస్తే ఎవరికీ వినపడదు. తలుపు విరగగొడితే అవతల నుంచి పిస్తోలు పేలుస్తారు. ఉపాయంతో తప్పించుకోవాలి కాని, బలప్రయోగంతో తప్పించుకోలేడు.

ఉన్నట్టుండి తీయని వాసన వచ్చింది. ఏమిటా వాసన అనుకుంటూ యుగంధర్ లేచి నిలుచున్నాడు. తల తిరిగింది. నిలుచోలేకపోయాడు. కుర్చీలో కూర్చున్నాడు.

ఈథరా? క్లోరోఫారమా! కాక మరేదయినా మత్తుమందా! ఎక్కణ్ణించి వస్తోందా వాసన? ఆలోచిస్తూ యుగంధర్ తెలివి తప్పి కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. స్పృహ తప్పే ఆఖరు క్షణంలో యుగంధర్ జేబులోంచి తన డైరీ తీసి అందులోంచి ఒక రెండు కాగితాలు చించికింద పారేసాడు. వాటిమీద ఎర్ర పెన్సిలుతో అంతకు ముందే రాసి ఉంది.

## 9

రాజు ఒక్క ఉరుకు ఉరికి ప్రహరీ గోడమీద నుంచి దూకి అవతలకు దిగాడు. వెనక్కి చూడలేదు. ఆగలేదు. ప్రతికక్షులు ఎంతమందో, ఎక్కడెక్కడ కాపలా ఉన్నారో అతనికి తెలియదు. ఈ సమయంలో సాహసించడం మూర్ఖం. రాజు పరిగెత్తాడు. వెనక అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో పరిగెత్తుకుని వస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, నలుగురు. రాజు మరింత వేగంగా పరిగెత్తాడు. వీధి మలుపు తిరిగాడు.

ఒక మోటరు సైకిలున్నదక్కడ. దానిమీద ఎవరో కూర్చుని ఉన్నారు.

ఒక క్షణం రాజు గుండె ఆగిపోయినట్లయింది. వెనక నుంచి శత్రువులు తరుముకు వస్తున్నారు. ముందు మోటారు సైకిలు మీద ఎవరో కాపలా కాస్తున్నారు. అతని చేతిలో పిస్తోలున్నది. ఏం చెయ్యాలి!

"రాజూ! వెనకెక్కు" అని మోటారు సైకిలు స్టార్టు చేసాడతను.

అది అపరిచిత కంఠం. స్నేహపూర్వకంగా ఉంది. రాజు మోటారు సైకిలు వెనక సీటుమీద కూర్చోగానే దడదడమంటూ సైకిలు కదిలింది - చాలు స్పీడుగా వెళుతోంది.

"ఎవరు నువ్వు?" అడిగాడు రాజు వెనకనుంచి గాలి హోరులోంచి ఇంజను చప్పుడులోంచి.

"నెం.333" అరిచాడు అతను.

"మీరు సమయానికి ఇక్కడికెలా వచ్చారు?"

"చెబుతాను" అన్నాడతను. కొంచెం దూరం వెళ్ళాక ఒక టీ షాపు దగ్గర సైకిలు ఆపాడు. వెనక్కి చూశాడు. "మనల్ని ఎవరూ వెంటాడడంలేదు" అన్నాడు.

తర్వాత రాజుకు చెప్పాడు. నెం.333. దర్జీ హుస్సేనుని వెంటాడుతూ అతని ఇంటివరకూ వెళ్ళాడు తను. షాపుకు అరఫర్లాంగుదూరంలో హుస్సేన్ ఇల్లున్నది. హుస్సేన్ భార్య పిల్లలతో ఆ ఇంట్లో కాపురం ఉంటున్నాడని విచారించి తెలుసుకున్నాడు. అక్కడవుండి తనింకేమీ చేయగలిగిందిలేదని వెనక్కి తిరిగి వచ్చాడు. అప్పటికి రాజు దర్జీ షాపుముందు లేడు. ఏమయ్యాడా అని అతనికోసం వెతుక్కుంటూ తిరిగాడు. వల్లభాయ్ పార్కు టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళడం, తిరిగి వచ్చి కూర్చోవడం గమనించాడు. తర్వాత మళ్ళీ రాజు టెలిఫోను బూతులోకి వెళ్ళడం చూశాడు. ఎవరో ఇద్దరు నీడల్లా టెలిఫోను బూత్ లోకి వెళ్ళడం, ఒక నిమిషం తర్వాత రాజుని మోసుకుని బయటికి రావడం చూశాడు. చీకట్లో నడుస్తూ పార్కులోకి వెళ్ళివాళ్ళను వెంటాడాడు.

"అయితే అప్పుడే వాళ్ళను బెదిరించి, పట్టుకునేందుకు అవకాశం ఉందిగా?" అడిగాడు రాజు.

"అవును. ఆ ఇద్దరి చేతుల్లో పిస్తోళ్ళున్నా వాళ్ళు నన్ను గమనించలేదు. కనుక ఆ ఇద్దర్నీ షూట్ చేసి ఉండవచ్చు. కాని చెయ్యలేదు. ఆ ఇద్దర్నీ మనం పట్టుకున్నా మనకేమీ తెలియదు. వాళ్ళ వెనకే వెళ్ళితే, వాళ్ళ కార్యాలయం ఎక్కడున్నదీ, వాళ్ళ ముఠా పెద్ద ఎవరో తెలుస్తుందనే ఆశతో మోటారు సైకిలు మీద వెంటాడాను." అన్నాడు నెం.333.

"ఆ వీధి పేరూ, ఇంటి నెంబరూ జ్ఞాపకమున్నాయా?" అడిగాడు రాజు.

333 జ్ఞాపకమున్నాయని తల ఆడించాడు.

"దగ్గర్లో ఉన్న టెలిఫోను బూత్‌కి వెళదాం" అన్నాడు రాజు. అయిదు నిమషాలలో ఒక టెలిఫోను బూత్‌కి చేరుకున్నారు. రాజు పోలీస్ కమీషనర్‌కి టెలిఫోన్ చేశాడు.

"సార్! ఫిరోజ్ షా వీధిలో నెం.34 ఇల్లును ముట్టడించి, లోపల ఉన్న వాళ్ళను వెంటనే అరెస్ట్ చేయండి. నేను రాజుని మాట్లాడుతున్నది" అన్నాడు రాజు.

కమీషనర్ రాజు చెప్పిన చిరునామా వ్రాసుకుని, "సరే!" అన్నాడు.

"యుగంధర్ గారు ఉన్నారా?" అడిగాడు రాజు.

"లేరు. చాలాసేపయింది వెళ్ళి, మీరింతకు పూర్వం టెలిఫోను చేశారే అప్పుడే వెళ్ళిపోయారు" అన్నాడు.

రాజు టెలిఫోను పెట్టేసి ఒక క్షణం ఆలోచించాడు. "పదండి, అర్జంట్. హుస్సేన్ దర్జీ షాపుకి వెళ్ళాలి" అన్నాడు రాజు. 333 ప్రశ్నలేమీ అడక్కుండా మోటారు సైకిల్ హుస్సేన్ దర్జీ షాపు ముందు ఆగింది. రాజు ఒక్క గంతులో సైకి మీదనుంచి దూకి, షాపు తలుపు వైపు పరిగెత్తాడు. తలుపు పరీక్షగా చూశాడు. తాళం వేసివుంది. రాజు ఆలోచిస్తూ తలుపు దగ్గర నిలుచున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు 333.

"నేను టెలిఫోనులో యుగంధర్‌తో మాట్లాడుతూ ఉంటే నన్ను తలమీద కొట్టారు. కనక నా మాటలు ఆగిపోయాయి. దాన్ని బట్టి నాకేదో ప్రమాదం జరిగి ఉంటుందని యుగంధర్ గ్రహించి వెంటనే బయలుదేరి వుంటారు. వల్లభాయ్ పార్క్ దగ్గర నేను కనిపించి ఉండను. కనక ఈ దర్జీ షాపుకు వచ్చి ఉంటాడు. ఆయన తత్వం నాకు తెలుసు. ఈ దర్జీ షాపు సోదా చేసి ప్రతి కక్షుల ఆచూకీ, నా ఆచూకీ, తెలుసుకోవడానికి ప్రయత్నించి ఉంటారు."

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు 333.

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు రాజు.

ఇంతలో వెనక అలికిడి అయింది. ఇద్దరూ చేతుల్లో పిస్తోళ్ళు తయారుగా ఉంచుకుని వెనక్కి తిరిగారు. ఎవరూ కనిపించలేదు. చెవులు నిక్కపొడుచుకు విన్నారు.

మళ్ళా ఏదో అలికిడి అయింది. రాజు నాలుగడుగులు ముందుకు వేశాడు. చీకటిగా ఉంది. దగ్గరే ఉన్న పోస్టు బాక్సు వెనక ఎవరో కదిలినట్లయింది. రాజు కదలకుండా నిలుచున్నాడు ఓ క్షణం ఆగి, ఒక ఉరుకు ఉరికి, ఆ పోస్టు బాక్సు వెనక్కి వెళ్ళి, ఆ మనిషి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. "ఎవరు నువ్వు?" గర్జించాడు.

ఆ మనిషి స్త్రీ. గజగజ వొణుకుతోంది. చీకట్లో ఆమె మొహం స్పష్టంగా కనిపించలేదు రాజుకి.

"నువ్వెవరు?" అంటూ రాజు ఆమె చెయ్యి పట్టుకుని షాపు దగ్గరకు లాక్కుని వచ్చాడు. జేబులోంచి టార్చి తీసి వెలిగించాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండి ఉన్నాయి. ఈదురుగాలిలో రెపలాడుతున్న ఎండటాకుమల్లే వణికిపోతోంది.

"నువ్వెవ్వరు?" మళ్ళీ అడిగాడు రాజు.

ఆమె జవాబు చెప్పలేదు. రాజును విప్పారిన కళ్ళతో చూసింది. తర్వాత వెక్కి వెక్కి ఏడ్వనారంభించింది.

టార్చి వెలుగులో ఆమె మొహం జ్యోతిలా వెలుగుతోంది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. ఆమె ఎర్రని పెదవులు ఒణుకుతూ ఉంటే రాజు గుండె ఎవరో నలిపినట్లయింది.

"ఎందుకు ఏడుస్తావ్?" అన్నాడు రాజు లాలనగా, టార్చిలైటు ఆర్పేసి ఆమె చేతిని వదిలాడు.

"నన్ను పోనియ్యండి. నేనెవరికీ చెప్పను" అన్నదామె ఏడుస్తూ.

"ఎక్కడికి పోనివ్వాలి? ఏమిటో చెప్పు?" అడిగాడు 333. అతను టార్చి వెలిగించాడీసారి. కాని ఆమె మొహం మీద వెలుగు వెయ్యలేదు.

"మీరు చేస్తున్న పని ఎవరికీ చెప్పను. నన్ను వెళ్ళనియ్యండి" అంది ఆమె చేతులు నలుపుకుంటూ.

టార్చి వెలుగులో రాజుకు ఆ చేతులు కనిపించాయి. ఆమె వేళ్ళ మధ్య వున్న కాగితం చూశాడు, "ఏమిటది?" అడిగాడు.

ఆమె జవాబు చెప్పకుండా రాజుని దీనంగా చూసింది.

రాజు ఆ కాగితాన్ని ఆమె వేళ్ళ మధ్యనుంచి లాక్కున్నాడు. టార్చి వెలుగులో దాన్ని చూశాడు. రాజు మొహం మారిపోయింది. మళ్ళీ ఆ కాగితాన్ని జాగ్రత్తగా చూశాడు.

"ఈ కాగితం నీకెక్కడ దొరికింది" అడిగాడు బొంగురుపోయిన గొంతుతో.

ఆమె మళ్ళీ ఏడుపు ప్రారంభించింది. "నాకొద్దు. ఇది నాకొద్దు. తీసుకోండి. చింపివేయండి. మీ ఇష్టం నేనెవరికీ చెప్పనని ఒట్టేస్తాను. నన్నేం చేయకండి. నా మాట నమ్మండి." అని ఏడుస్తూ ఆమె రాజు కాళ్ళమీద పడింది.

"ఏడవకు! నీకేమీ హాని చెయ్యము. మేము దొంగలముకాము" అని రాజు ఆమెను లేవదీసి "నీకీచీటీ ఎవరు ఇచ్చారు? విశదంగా చెప్పు!" అడిగాడు.

"ఎవరో ఒక మనిషిని ఇటువేపు మోసుకుపోతున్నారు. అతనిచీటీ కింద జారవిడిచాడు" అన్నదామె.

రాజు అసహనాన్ని దిగమింగుతూ "ఎంత సేపటి క్రితం జరిగింది? విశదంగా చెప్పు! "అడిగాడు.

"నేను సినిమానుంచి వస్తున్నాను. ఇక్కడ ఓ కారు ఆగివుంది. ఈ షాపులోంచి ఇద్దరు మనుష్యులు ఎవర్నో మోసుకు వస్తున్నారు. నా కారు హెడ్ లైట్స్‌లో స్పష్టంగా కనిపించింది. ఆ మోసుకు రాబడుతున్న మనిషి వేళ్ళాడేసిన చేతిలోంచి ఈ కాగితం జారికిందపడ్డది. నేను ఆలోచించకుండా చటుక్కున కారు ఆపాను. ఆలోచించివుంటే ఆపేదాన్ని కాను. నా దారిన నేను వెళ్ళిపోయేదాన్ని. నా కారు ఆగగానే, వాళ్ళు అతన్ని తీసుకుని వాళ్ళ కారు ఆగగానే, వాళ్ళు అతన్ని తీసుకుని వాళ్ళ కారు ఎక్కి వెళ్ళిపోయారు. నేను దిగివచ్చి ఈ కాగితం తీసుకున్నాను. ఇంతలో మీ మోటారు సైకిలు వచ్చింది. అప్పుడు భయమేసి దాక్కున్నాను" అన్నది.

"వాళ్ళు కారు వెళ్ళిపోయి ఎంతసేపయింది?"

"మీరు వచ్చేముందు వాళ్ళ కారు వెళ్ళింది."

"ఎటు వెళ్ళింది?"

"అటు కుడివైపు."

"ఏం కారది?"

"నల్లని ఫోర్డు కారు."

రాజు 333 వైపు తిరిగి "రండి!" అన్నాడు.

"మీరెవరు?" అడిగిందామె.

"మేము ఈ కాగితం పడేసిన ఆయన సన్నిహితులం" అన్నాడు రాజు.

"అయితే నా కారులో వెళ్ళండి. అది చాలా హై పవర్ ఇంజన్ ఉన్న కారు" అన్నది.

"ఎక్కడున్నది?"

"అదిగో!" అని కొంచెం దూరంలో ఉన్న కారుని చూపించింది. రాజూ, 333 అటు పరిగెత్తారు. "నన్ను ఒంటరిగా వదలి వెళ్ళకండి. నేనూ వస్తాను" అని కారు దగ్గరకుపరిగెత్తింది. రాజు డ్రయివ్ చేస్తున్నాడు. 333 అతని పక్కన కూర్చున్నాడు. ఆమె వెనక సీటులో కూర్చున్నది.

డ్రయివ్ చేస్తూ రాజు 333 కి చెప్పాడు "ఆ కాగితం యుగంధర్ గారు పడేశారు. ఆ గుర్తు 'ఆపద' గుర్తు. మా ఇద్దర్లో ఎవరు ఆపదలో ఉన్నా ఆ గుర్తుగల కాగితాలను నేలమీద పడేస్తాం. మా డైరీలో అటువంటి కాగితాలు కొన్ని పెట్టుకుంటాం" అన్నాడు.

ఆమె కూడా ఆ మాటలు శ్రద్ధగా విన్నది. "అవును. నేనూ అలాగే అనుకున్నాను" అన్నది.

"నీకెలా తెలుసు?" అడిగాడు రాజు ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి.

"దయచేసి వెనక్కు తిరగవద్దు" అన్నదామె. ఆమె ఆ మాటలు అంటున్నప్పుడు అతని మెడమీద చల్లగా ఏదో తగిలింది. అది ఉక్కు. నెం.333 మెడమీద కూడా ఏదో చల్లగా నిల్చింది.

"ఇద్దరూ వెనక్కి తిరగవద్దు. తిరిగారా పిస్తోలు పేలుతుంది. ఇంత దగ్గిర్లో, మెడమీద పిస్తోళ్ళుండగా గురితప్పే అవకాశం లేదని మీరు అంగీకరిస్తారు" అన్నదామె.

333 కొంచెం కదిలాడు.

"పిచ్చి వేషాలు వెయ్యకండి. నిజంగానే కాల్చేస్తాను" అని మళ్ళీ హెచ్చరించిందామె.

"కాల్చడానికి నీకు ఎన్ని గుండెలున్నాయి! మమ్మల్ని కాలిస్తే కారు దేనికో కొట్టుకుంటుంది. యాభై మైళ్ళ స్పీడులో పోతున్న కారు దేనికయినా కొట్టుకుంటే, నువ్వు మా కన్నా ఘోరమైన చావు చస్తావు" అన్నాడు రాజు.

ఆమె నవ్వింది. ఆమె నవ్వు గుడిగంటలు మోగినట్లు గణగణమన్నది. "నాకా భయంలేదు. నా కాలుకింద బ్రేక్ ఒకటి ఉంది. అది నొక్కితే కారాగుతుంది. చూపిస్తాను చూడు" అన్నదామె.

ఉన్నట్లుండి కారు స్పీడు తగ్గింది. మళ్ళీ హెచ్చింది. "చూశావా! నేను అబద్ధం చెప్పడంలేదు" అన్నదామె.

రాజులు ఆ ఆఖరు ఆశ కూడా పోయింది.

"నువ్వెవ్వరు?" అడిగాడు.

ఆమె నవ్వింది. "క్షమించు. నా పేరూ, ఊరూ, చిరునామా. వృత్తి చెప్పి నన్ను నేను పరిచయం చేసుకునే సమయం కాదిది. ఇంకోసారి ఆ మర్యాదలు పాటిద్దాం" అన్నది.

"మమ్మల్ని ఎక్కడికి తీసుకు వెళుతున్నావు?"

"ఉష్! కుర్రాళ్ళకు ఓపిక ఉండాలి" అని నవ్వింది.

"యుగంధర్ ఎక్కడున్నారు?" అడిగాడు రాజు.

"త్వరలో కలుసుకుంటావ్!" అన్నదామె.

అయిదు మైళ్ళ దూరం వెళ్ళింది కారు. ఆమె చెప్పినట్లు ఆ కారు నిజంగానే హై పవర్ ఇంజన్ ఉన్న కారు ఒక పెద్ద బంగళా ముందున్న గేటులోకి తిప్పమన్నది.

✡✡✡

## 10

"ఇప్పుడయినా చెబుతావా?" అడిగాడు నోట్లో పెట్టుకుని పొగపీలుస్తున్న హవానా చుట్టను రెండు వేళ్ళ మధ్యా బెదిరింపుగా పట్టుకుని.

నేలమీద పడివున్న మనిషి తొణకకుండా బెణకకుండా చుట్టకాలుస్తున్నతని వైపు చూశాడు. చెంపలమీద నున్నగా క్షవరం చేసి, గెడ్డం దగ్గర గుబులుగా వెంట్రుకలు పెంచాడతను. తలమీద ఒక ముఖమల్ టోపీ ఉంది. పాంటూ, పాంటు లోపల షర్టు వేసుకున్నాడు.

దట్టమైన కనుబొమలు. ఆ కనుబొమల కింద రెండు గుంటల్లా ఉన్నాయి రెండు కళ్ళూ. వాటిలో కరుణా, ప్రేమాలాటివి ఎన్నడూ గోచరించవని అనిపిస్తుంది. స్వార్థమూ, క్రౌర్యమూ, కాఠిన్యమూ సూచిస్తున్నాయవి. అతను కొంచెం ముందుకు వంగి, తాపీగా కాలుతున్న చుట్ట నేలమీద పడివున్న మనిషి చెంప మీద పెట్టి, రెండు క్షణాల తర్వాత నవ్వుతూ లేచాడు.

నేలమీద పడివున్న మనిషి కదలలేదు. అరవలేదు బాధతో కళ్ళు ముయ్యలేదు. అప్పటికే అతని మొహం మీద చాలా బొబ్బలున్నాయి. అతను చలనం లేని కళ్ళతో ఎదురుగా నిలబడ్డ ఆ గెడ్డం మనిషిని కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

"888! నీ కెందుకీ బాధ? చెప్పెయరాదూ!" అడిగాడు గెడ్డం మనిషి.

నెం.888 జవాబు చెప్పలేదు. గెడ్డం మనిషి మళ్ళీ చుట్టను 888 మొహం దగ్గిరకు తెచ్చి నవ్వాడు. "మొహం మీద బొబ్బలు లేనిచోటు లేదు. కాల్చినచోటే మళ్ళీ కాల్చాలి" అన్నాడు. 888 మొహం మీద బొబ్బ కట్టిన చోటే కాలుతున్న చుట్ట పెట్టాడు.

నెం.888కి అరడుగుల దూరంలో ఒక యువతి నేల మీద పడి వున్నది. చేతులూ, కాళ్ళూ తాళ్ళతో కట్టివేసి ఉన్నాయి. నెం.888ని పెడుతున్న హింస చూడలేక పక్కకు తిరిగి పడుకున్నది. కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.

"నీ స్నేహితుడికి ఏ విధంగా బుద్ధి చెప్పామో జ్ఞాపకమున్నదిగా?" అన్నాడు గెడ్డం అతను.

నెం.888 మాట్లాడలేదు.

"ఇకనైనా చెప్పకపోతే ఇక మాకు ఓపిక పోతుంది. ప్రియురాలు లతకు కూడా ఇదే గతి పడుతుంది" అని లేచి లత దగ్గిరకు వెళ్ళాడు. మళ్ళీ వెనక్కి వచ్చి, నెం.888ని కాలితో తన్ని, లత 888కి కనిపించేలా అటువైపు తిప్పాడు. తర్వాత లత దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. తాపీగా నోట్లోంచి చుట్ట తీశాడు.

"ఈ అందమైన మొహాన్ని అందవికారంగా చేయడం నాకు నిజంగా ఇష్టం లేదు. అమ్మాయ్! నువ్వయినా చెప్పు ఆ మొండివాడికి. ఆ కాగితాలు ఎక్కడ దాచాడో చెప్పాడంటే తక్షణం మీ ఇద్దర్నీ వదిలేస్తాం" అన్నాడు.

888 గెడ్డం అతన్నే చూస్తున్నాడు. అతని చేతులూ, కాళ్ళూ తాళ్ళతో బిగించి ఉన్నాయి. అలా బిగించి ఉండకపోయినా నెం.888 నీరసంవల్ల కదలలేని స్థితిలో ఉన్నాడు. మూడు రోజులనుంచీ అతనికి తిండిలేదు. ప్రతికక్షులు పెడుతున్న బాధనుంచి తప్పించుకోకుండా, మూర్ఛపోకుండా అప్పుడప్పుడు నోరు తడుపుతున్నారు; కాస్త తిండిపెడుతున్నారు. చాలా నీరసించిపోయాడు. అందుకే అతను ఏమీ చెయ్యలేక కళ్ళు అప్పగించి చూస్తున్నాడు. తన అసిస్టెంటును చిత్రహింస పెట్టి, చంపి, ట్రంకు పెట్టెలో పెడుతుండగా కూడా కళ్ళు అప్పగించి చూస్తున్నాడు. ఇప్పుడు లతని హింసిస్తున్నా ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా చూస్తున్నాడు.

"ఏమమ్మాయ్! ఏదీ నీ బుగ్గ?" అంటు ఆ గెడ్డం మనిషి చుట్టను లత చెంపదగ్గరకు తెచ్చాడు. లత ఊపిరి బిగపట్టింది. పెదిమలు బిగించింది. తను అరవదల్చుకోలేదు. చలించదలచుకోలేదు. గోల చెయదల్చుకోలేదు. తను అటువంటిదేదయినా చేస్తే నిర్వీర్యుడయిపోతాడు. తనను బాధిస్తుంటే చూడలేక అతను కాగితాలు ఎక్కడ దాచినదీ చెప్పివేయవచ్చు. అలా చెబితే దేశానికి ద్రోహం చేసిన వాళ్ళవుతారిద్దరూ. లత పళ్ళు బిగించి గట్టిగా కళ్ళు మూసుకున్నది.

ఇంతలో బయట కారు ఆగిన చప్పుడయింది. గెడ్డం అతను చటుక్కున లేచి బయటకు వెళ్ళాడు. ఒక్క క్షణంలో తిరిగివచ్చాడు.

"అమ్మాయ్! ఇప్పుడు నీ బుగ్గన మచ్చ పెట్టేందుకు టైమ్ లేదు. తర్వాత చూస్తాను. ఇంకో అతిథి వచ్చాడు అతనిని ఆహ్వానించాలి" అని వెళ్ళిపోయాడు.

888 నెమ్మదిగా దొర్లి లత పక్కకు చేరుకున్నాడు. "లతా!" అన్నాడు. కళ్ళనీళ్ళతో ఉన్న లత అతన్ని చూడలేక మొహం తిప్పేసుకుంది. నెం.888 మొహమంతా బొబ్బలతో వికృతంగా ఉంది.

అయిదు నిమిషాల తర్వాత గెడ్డం అతను గదిలో మళ్ళీ వచ్చాడు. అతని వెనక ఇద్దరు మనుష్యులు ఎవర్నో మోసుకు తీసుకువచ్చారు. ఆ మోసుకు వచ్చిన మనిషిని నేలమీద కూలేశారు. ఆ ఇద్దరూ చేతులు జోడించుకుని తలుపు దగ్గర నిలుచున్నారు..

గెడ్డం అతను గెడ్డం సవరించుకుని వెకలిగా నవ్వాడు. అతనికి యాభై ఏళ్ళుంటాయి. లావుగా పొట్టిగా ఉన్నాడు. "మన కొత్త అతిథిని పరిచయం చేస్తాను" అని నేలమీద పడున్న మనిషి దగ్గిరకు వెళ్ళి "అవతల పడున్న మనిషి చూడు. అతనే నెం.888. ఆ యువతి అతని ప్రియురాలు లత. 888! ఇతను ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్" అన్నాడు.

యుగంధర్ ఎదురుగా ఉన్న గెడ్డం మనిషిని తేరిపార చూశాడు. దర్జీ షాపులో యుగంధర్‌కి స్పృహ పోయిన తర్వాత మళ్ళీ స్పృహ వచ్చేటప్పటికి అతని కళ్ళకు గంతలు, చేతులకు, కాళ్ళకు తాళ్ళు కట్టివున్నాయి. కారులో తనను ఎక్కడికో తీసుకువెళుతున్నారని ఇంజన్ చప్పుడు, కదిలిక పట్టి గ్రహించాడు. సీట్ మీద ఇద్దరు మనుష్యులు కాపలా ఉన్నారని నడుంకీ, తొడలకూ తగులుతున్న బూడ్సు కాళ్ళను బట్టి తెలుసుకున్నాడు, మానసిక శక్తిని వృధా ప్రయాసతోనూ వ్యయపరచడం యుగంధర్‌కు ఇష్టంలేదు. ఎటువంటి విషమ పరిస్థితులోనైనా నిశ్చింతగా విశ్రాంతి తీసుకునే మనోనిబ్బరం, ఆత్మ విశ్వాసంగల మనిషి అతను. తనను గదిలోకి తీసుకు వెళ్ళేముందు కళ్ళకున్న గంతలు తీసేశారు. నేలమీద కూలేసిన తర్వాత కళ్ళు తెరచి గెడ్డం మనిషిని పరిశీలనగా చూశాడు.

అతను విదేశీయుడే అయివుండాలి. ఆ గెడ్డం చూసి ముసల్మానేమోనని పొరబడే అవకాశం ఉంది, కాని ముసల్మాను కాడు. పాశ్చాత్యుడు.

యుగంధర్ పక్కకు ఒత్తిగిలి నేలమీదపడున్న నెం.888ని చూశాడు. అతనూ తనను సూటిగా కళ్ళల్లోకి చూశాడు. యుగంధర్ తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు. నెం.888 మోహాన్ని క్షణం కన్నా చూడలేక పోయాడు. నెం.888 ఎటువంటి హింసలకు గురయ్యాడో యుగంధర్ ఒక్క చూపుతోనే గ్రహించాడు. పళ్ళు పటపట కొరికాడు. వీళ్ళు ఎంత క్రూరులా అనుకున్నాడు.

తలుపు దగ్గర వున్న మనిషి గెడ్డం అతన్ని చూసి, "మిస్టర్ వాయిజ్! ఒక్క మాట" అని పిలిచాడు.

గడ్డం మనిషి పేరు వాయిజ్ తీవిగా గదిలోంచి బయటకు వెళ్ళాడు. యుగంధరూ, నెం.888, లతా మాత్రం మిగిలారు. యుగంధర్ నెం.888 వైపు చూసి "మీరేనా నెం.888?" అడిగాడు. అతను తల ఊపాడు.

"నేను యుగంధర్ని" అన్నాడు.

"మీ పేరు విన్నాను. మిమ్మల్ని ఎందుకు ఇక్కడకు తీసుకు వచ్చారు?" అడిగాడు నెం.888.

యుగంధర్ హోం మంత్రి తనను పిలిపించడం, ఆ కాగితాలను తెచ్చి ఇచ్చే బాధ్యత తనకు అప్పగించడం - ఆ తర్వాత తను చేసిన కృషి, జరిగిన సంఘటనలు క్లుప్తంగా చెప్పాడు. నెం.888 అంతా ఓపిగ్గా విన్నాడు.

"ఇక్కణ్ణించి తప్పించుకునేందుకు మనలో ఎవరికైనా అవకాశం ఉంటుందో, ఉండదో!?" అన్నాడు యుగంధర్.

"లేదు. తప్పించుకోవడం దుర్లభం. వాళ్ళకయి వాళ్ళు మనల్ని ఒదిలితేగాని బయటపడలేము" అన్నాడు నెం.888.

యుగంధర్ అవునని తలూపాడు.

"ఆ కాగితాలు దొరకనంతకాలం నా ప్రాణానికి మోసంలేదు. హింసిస్తారు కాని నన్ను చంపరు. చంపారా ఆ కాగితాలు దొరికే అవకాశం ఉండదు వాళ్ళకు" అన్నాడు నెం.888. యుగంధర్ లత వైపు చూశాడు.

"లతకు ప్రాణాపాయం ఉందనా! ఉహూ! లేదు. లతనీ చంపరు. ఎప్పటికయినా నేను రహస్యం చెప్పి వెయ్యవచ్చని వాళ్ళకు ఆశవుంది. లతని చంపేస్తే నేనసలు చెప్పనని వాళ్ళకు తెలుసు" అన్నాడు నెం.888 నిట్టూరుస్తూ.

"ఆ కాగితాలు ఎక్కడ దాచారు.?" అడిగాడు యుగంధర్.

నెం. 888 బలహీనంగా నవ్వాడు. "నేను చెప్పను" అన్నాడు.

"ఎందువల్ల?"

"ఈ గదిలో రహస్యంగా మైక్రోఫోను పెట్టి వాళ్ళు అవతలనుంచి వింటూ ఉండవచ్చు" అన్నాడు నెం.888.

యుగంధర్ అవునని తల తిప్పాడు.

"వాళ్ళకా రహస్యం తెలిసిందా మనందరి ప్రాణాలూ ఆ క్షణాన్నే పోతాయి" అన్నాడు నెం 888.

"మీ మీద నాకు గౌరవం రెండింతలయింది. దేశ క్షేమం కోసం మీరీ బాధలన్నీ ఓర్చుకున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు యుగంధర్.

నెం.888 నిట్టూర్చాడు. "స్పెషల్ బ్రాంచిలో మాకు ఎంత భాధ అయినా ఓర్చుకోవడం నేర్పుతారు" అన్నాడు.

యుగంధర్ ఒక నిమిషం మౌనంగా ఉండి "మిస్టర్! అసలు మీరు వీళ్ళ చేతికి ఎలా చిక్కారు?" అడిగాడు.

"చెబుతాను. కాని ముందు నాకో విషయం చెప్పండి. హోం మినిస్టరూ, ఎస్.బి. డైరెక్టరూ ఏమనుకున్నారు? నేను ఆ కాగితాలని పర ప్రభుత్వాలకు అమ్మేశానని అనుమానపడ్డారా?"

"ఛ! ఛ! లేదు. మీరు ఎవరో గుఢచారుల చేతుల్లో చిక్కివుంటారని అనుకున్నారు. కాని అసలు మీరు బొంబాయిలో ఎందుకు దిగారో మాకు అర్థం కాలేదు. తిన్నగా ఢిల్లీ కెందుకు రాలేదని అనుకున్నాము. కాని తర్వాత నేను గ్రహించాను. మొదట లతను పట్టుకుని, మోసగించి మిమ్మల్ని పట్టుకున్నారు. అవునా?"

"అవును" అన్నాడు నెం888 నీరసంగా.

"వివరంగా చెబుతారా?" అడిగాడు యుగంధర్.

నెం.888 పెదిమలు తడిచేసున్నాడు. అతనికి మాట్లాడడమే కష్టంగా ఉంది.

"మా విమానం బొంబాయి శాంటాక్రజ్ విమానాశ్రయంకి ఇంకో పదినిమిషాల్లో చేతుకుంటుందనగా నా కాళ్ళ దగ్గర ఒక కవరు పడుండడం చూశాను. దానిమీద మహావీర్ అని వ్రాసి ఉంది. కవరు చించి చదివాను. లత అపాయంలో ఉన్నదనీ, బొంబాయి శాంటాక్రజ్ విమానాశ్రయంలో దిగి ఏర్‌పోర్ట్ రెస్టారెంటులోకి నన్ను వెళ్ళమనీ, రెస్టారెంటులో నేనుండగా లత టెలిఫోను చేస్తుందని అందులో వ్రాసి ఉంది. ఆ ఉత్తరంలో వ్రాసిన ప్రకారం బొంబాయి ఏర్ పోర్టు రెస్టారెంటులోకి వెళ్ళాను. కాసేపటికల్లా లౌడ్ స్పీకర్లో నన్ను పిలిచి టెలిఫోను బూత్‌లోకి వెళ్ళమని చెప్పారు. టెలిఫోను తియ్యగానే లత గొంతు వినిపించింది. తను చాలా అపాయంలో ఉన్నానని చెప్పింది. నేను పోలీసులకు రిపోర్టు చేసినట్లయితే తన ప్రాణాలు తీసేస్తారనీ చెప్పింది" నెం.888 ఒక నిమిషం మౌనంగా ఉండిపోయాడు. "నాకు నా దేశం అంటే భక్తి. నా దేశం కోసం ప్రాణాలు ఇస్తాను. లత నాకు ప్రాణం కన్నా ఎక్కువ, అటు దేశ క్షేమాన్ని కాని, ఇటు లతని కాని బలి ఇచ్చేందుకు మనసొప్పలేదు. అందుకని నల్లఫోర్డు కారెక్కి బయలుదేరాను. నన్నిక్కడికి తీసుకొచ్చారు" అన్నాడు నెం.888.

"మీరు వచ్చిన విమానంలోనే ఎవరో ప్రతికక్షుల గూఢచారి ఉండి ఉండాలి" అని యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. తనూ, రాజూ బొంబాయికి రాగానే తమ కారును ప్రతికక్షులు వెంటాడడం జ్ఞాపకంవచ్చింది. తను ఆ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రతికక్షులకు ఎలా తెలిసిందా అని అప్పుడు ఆశ్చర్యపడ్డాడు. ఇప్పుడు తెలిసింది.

ఢిల్లీలో తనూ, రాజూ చాలా చాకచక్యంగా ఏర్ హోస్టెస్ జీన్ ఓ హోటల్లో ఉన్నదని కనుక్కుని వెళ్ళి కలుసుకున్నారు. బొంబాయిలో దిగిన మహావీర్ గురించి చాలా లౌకికంగా ప్రశ్నలు అడిగాడు తను. ఆ ఏర్ హోస్టెస్ జీన్ కూడా ప్రతికక్షుల ముఠాకు చెందినదే అనీ, తను అడిగిన ప్రశ్నలవల్ల అనుమానం కలిగి వెంటనే ఆమె ప్రతికక్షులకు తెలియచేసిందనీ ఇప్పుడు గ్రహించాడు తను. ఆ రెస్టారెంటు నుంచే తనను ఎవరో వెంటాడి తన ఆనవాలు తెలుసుకున్నారు.

"ఏర్ హోస్టెస్ ఆ ఉత్తరం మీ కాళ్ళ దగ్గిర పడేసి ఉండాలి" అన్నాడు యుగంధర్.

నె.888 అవునని తలవూపాడు.

"మీరు విమానంలోంచి దిగినపుడు మీ దగ్గర తోలు సంచీ ఒకటి ఉన్నదని తెలిసింది. మీ అసిస్టెంటు శవంతో పాటు ఆ తోలు సంచీ ఒక ట్రంకు పెట్టెలో పెట్టి నాకు పంపారు. మీ అసిస్టెంటు వాళ్ళకు ఎట్లా చిక్కాడో?" అన్నాడు యుగంధర్.

"బొంబాయి ఏర్ పోర్టులో నన్ను కలుసుకోమని నా అసిస్టెంటుకు ముందే కబురు చేశాను. విమానంలోంచి దిగగానే ఆ సంచీ అతనికిచ్చి, జాగ్రత్తగా ఉంచమని చెప్పాను. అతను వెళ్ళిపోయాడు. ప్రతికక్షులు అతన్ని పట్టుకుని ఇక్కడకు తీసుకు వచ్చారు" అన్నాడు నెం.888.

యుగంధర్ ఓ నిమిషం ఆలోచిస్తూ ఊరుకున్నాడు. "అతనే ఆ కాగితాలను ఎక్కడైనా దాచి ఉంటాడా?" అడిగాడు యుగంధర్.

నెం.888 మాట్లాడలేదు. యుగంధర్ని చూస్తూ మౌనంగా ఉండిపోయాడు. అతనింక మాట్లాడదలుచుకోలేదని గ్రహించాడు యుగంధర్.

✡✡✡

## 11

నల్లని గుండ్రని రోజ్ ఉడ్ టేబుల్ చుట్టూ కుర్చీలు ఉన్నాయి. అది డైనింగ్ టేబుల్. ఆ టేబుల్ మీద ఒక టీ కెటిల్, ఒక అరడజను కప్పులూ ఉన్నాయి. ఒక సిగరెట్ డబ్బా, ఒక చుట్టల పెట్టెకూడా ఉన్నాయి బల్లమీద. గదిలో ఒక మూల స్టాండుకు ఒక ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది.

ఆ టేబుల్ చుట్టూ అయిదుగురు మొగాళ్ళు కూర్చున్నారు. టీ కెటిల్‌కీ, చుట్టల పెట్టెకీ దగ్గరగా వాయిజ్ కూర్చునున్నాడు. అతని వేళ్ళ మధ్య సగం కాలి ఆరిపోయిన చుట్ట ఉంది. కెటిల్ లోంచి కప్పులోకి టీ పోసుకుని, చక్కెర కలుపుకుని నెమ్మదిగా చప్పరిస్తున్నాడు. తతిమ్మా నలుగురూ టీవంకా, అతనివంకా ఈర్ష్యతో చూస్తున్నారు. ఒకతను ముసల్మాను. మనిషి పొడుగ్గా కాకపోయినా చాలా బలంగా ఉన్నాడు. అతని పక్కనున్న అతని జాతి ఏదో తెలుసుకోవడం కష్టం. అతనూ యువకుడే పాంటూ, షర్టు, కోటు, టై వేసుకున్నాడు. పైకి దువ్వుకున్న జుట్టు, తెల్లని ఒళ్ళు, కాస్త నీలంగా ఉన్న కళ్ళు. ఆంగ్లో ఇండియన్ అయివుండవచ్చు లేదా పాశ్చాత్యుడు అయివుండవచ్చు, చాలా కాలంగా ఈ దేశంలో ఉంటున్న వాడయి వుండాలి, లేకపోతే గెడ్డం లేని సిక్కు అయి ఉండవచ్చు.

మూడో మనిషి యాభయి ఏళ్ళవాడు. గోచీపోసి పంచకట్టుకుని, తెల్లని కుర్తా తొడుక్కున్నాడు. కొద్దిగా నెరిసిన జుట్టు, కళ్ళద్దాలు, నుదిటి మీద చందనపు బొట్టు, నాలుగో మనిషి నల్లని పాంటు లోపల కాకీ షర్టు వేసుకున్నాడు. కండలు తిరిగిన చేతులు, విశాలమయిన ఛాతీ, వెడల్పయిన మొహం.

ఈ నలుగురూ వాయిజ్‌ని చూస్తూ కూర్చున్నారు.

"మీ ఇద్దర్నీ పంపేసి, సెఫియా అక్కడే ఉండి పోయిందా?" అడిగాడు వాయిజ్.

పాంటు తొడుక్కున్న యువకుడు తలవూపాడు.

ఇంతలో బయట కారు ఆగిన చప్పుడయింది. వాయిజ్ అటు తిరిగాడు. ఆంగ్లో ఇండియన్‌లా ఉన్న యువకుడు కిటికీ దగ్గరకు పరిగెత్తాడు. నల్లని పాంటతను కూడా బయటికి వెళాడు.

ఒక నిమిషం తర్వాత సెఫియా గదిలోకి వచ్చింది. వాయిజ్ తప్ప తతిమ్మావారంతా లేచి నిలుచున్నారు.

సెఫియా వెనక ఆంగ్లో ఇండియన్ యువకుడూ, నల్ల పాంటు అతనూ పిస్తోళ్ళు చూపిస్తూ రాజునీ, నెం.333 జేబులు సోదా చేశాడు. ఆ ఇద్దరి జేబుల్లో ఉన్న పిస్తోళ్ళను తీసి బల్లమీద పెట్టాడు. మనీ పర్సులు, తాళం చెవులూ, డైరీలు కూడా తీసేశాడు.

"ఎవరు వీళ్ళు సెఫియా?" అడిగాడు వాయిజ్.

"ఇతను ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుగా ఖ్యాతి కెక్కిన రాజు" అని నవ్వింది సెఫియా. క్షణం ఆగి "ఆ రెండో అతనెవరో తెలియదు. వీళ్ళ తాలూకు మనిషే" అంటూ కుర్చీలో కూర్చుని కెటిల్‌లోంచి ఒక కప్పులో టీ పోసుకుని చప్పరిస్తూ రాజువైపు తిరిగింది. "ఆయన మా నాన్న. వాయిజ్. నా పేరు సెఫియా! తతిమ్మా వాళ్ళంతా మా ముఠావాళ్ళు" అని హేళనగా పరిచయం చేసి "దయచేసి మీ మిత్రుణ్ణి పరిచయం చేయండి రాజుగారూ!" అన్నది.

"మీ పరిచయం భాగ్యం లభించినందుకు సంతోషం, ఈయనకు పేరు లేదు. ఒక నెంబరు మాత్రం ఉన్నది! కనుక ఆ నెంబరు చెప్పినా ప్రయోజనం లేదు" అన్నాడు రాజు.

"ఫర్వాలేదు. ఆ నెంబరే చెప్పండి."

"నెం.888" అన్నాడు రాజు నవ్వుతూ.

సెఫియా లేచి నిల్చున్నది. నల్లని షిఫాను చీర కట్టుకున్నది. బూడిదరంగు క్రేప్ జాకెట్ ఒంటికి అతుక్కునున్నది. తెల్లని మొహం కత్తిరింపు జుట్టు, మొనతేలిన గెడ్డం. సన్నని ముక్కు. మెరుస్తున్న కళ్ళతో రాజును తీక్షణంగా చూసింది.

"మిష్టర్ రాజూ! నాతో హాస్యాలు మంచిది కాదు" అన్నది కుర్చీలోంచి లేస్తూ. ఆమె కుర్చీలోంచి లేస్తూ ఆమె కుర్చీలోంచి లేవడం, తాచుపాము తోకమీద నిటారుగా నిలబడడం గుర్తుకు వచ్చింది రాజుకి. "మాతో హాస్యాలు ఆడడం కూడా మీకు మంచిది కాదు" అన్నాడు.

రాజు పక్కన నిలుచున్న నల్లపాంటు మనిషి ఫెళీమని రాజుని చెంపమీద కొట్టాడు. రాజుకు ఒళ్ళు మండిపోయి ఎదురు తిరిగాడు. పిడికిలి బిగించి అతన్ని గెడ్డం మీద కొట్టాడు. అతను కిందపడ్డాడేకాని, మరుక్షణం ఇద్దరు వచ్చి రాజుని రెండుచేతులూ వెనక్కి విరిచి పట్టుకున్నారు. సెఫియా ఇదంతా రెప్పవాల్చకుండా, కదలకుండా చూస్తోంది.

"ఛఛ! దౌర్జన్యం పనికిరాదు మిష్టర్ రాజూ! తెలియక అతను కొడితే మాత్రం మీరు ఎదురు తిరగవచ్చా! ఇంతమంది ఉండగా ఎలా నెగ్గుతారు! ఆ మాత్రం వివేకం ఉండాలి. ఏమైనప్పటికీ నాకు దౌర్జన్యం ఇష్టం లేదు" అన్నదామె.

"ఓహో! అందుకేనా ఓ మనిషిని నానాహింసలూ పెట్టి చంపి, ట్రంకు పెట్టెలో పెట్టి మాకు పంపించావు?

అడిగాడు రాజు.

"అది ఘోరమైన పొరపాటు. నేను ఇక్కడ లేనప్పుడు అతన్ని హింసించడం జరిగింది. నే వచ్చేటప్పటికి అతను చచ్చిపోయాడు. చచ్చిపోయిన మనిషిని ట్రంకు పెట్టెలో, ముఖమల్ పరుపులో చుట్టినా అతని కేమీ తేడా లేదు కనుక ట్రంకు పెట్టెలో పెట్టించాను" అన్నదామె..

"ఇప్పుడు మమ్మల్ని ఏం చేయడానికి ఇక్కడికి తీసుకొచ్చావు?" అడిగాడు రాజు.

"ఏమీ చెయ్యము. మీరేమీ మమ్మల్ని ఇబ్బంది పెట్టకపోతే బహుశా రేపు మిమ్మల్ని వదిలిపెట్టేస్తాం.అంత వరకూ, జాగ్రత్తకోసం, మీ చేతులూ, కాళ్ళూ తాళ్ళతో కట్టవలసివుంటుంది. అంతే, అంతకన్నా బాధేమీ ఉండదు. మంచి కుర్రాళ్ళమల్లే బుద్ధిగా ఉండండి. వెళ్ళండి" అన్నది. నల్లపాంటు మనిషి వైపు తిరిగి "వేరే గదిలో ఉంచండి" అన్నది. రాజునీ, 333నీ తీసుకునివెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే సెఫియా తండ్రివైపు తిరిగింది. "చూశావా! అతన్ని చంపడంవల్ల మనకెంత నష్టమో!" అన్నది.

"నష్టమా! ఏం నష్టం?"

"చావనేది ఆఖరు బెదిరింపు. చంపుతారన్న భయముంటే చాలామంది లొంగుతారు. కాని చావుకు ముందునుంచీ మానసికంగా తయారయి ఉంటే వాళ్ళను చావు భయం ఏమీ చెయ్యలేదు. అవసరమైతే చంపవచ్చు. కాని అనవసరంగా చంపడం గొప్ప అస్త్రాన్ని తరచూ ఉపయోగించడమవుతుంది. అయినా ఈ విషయంలోని సూక్ష్మత నీకు అర్థంకాదులే. యుగంధర్ని ఎక్కడుంచారు?"

"నెం.888 ఉన్న ఆ గదిలోనే పడేశాం" అన్నాడు వాయిజ్.

ఈ గూఢచారుల ముఠాలో నిజానికి వాయిజ్ పెద్దవాడయినా బుద్ధి బలంచేత నాయకత్వం సెఫియాకు ప్రాప్తించింది. కూతుర్ని చూస్తే తండ్రికి కూడా భయం.

"వెళ్ళి యుగంధర్ని చూద్దాం పద" అన్నది.

ఆమె వెనకాలే తతిమ్మా వాళ్ళూ లేచారు. వాళ్ళు అక్కడే ఉండమని చేత్తో సంజ్ఞ చేసి, తండ్రిని మాత్రం తనకూడా రమ్మన్నది. చిరునవ్వుతో యుగంధర్ బంధింపబడి ఉన్న గదిలోకి అడుగుపెట్టింది.

"హల్లో యుగంధర్! కులాసాగా ఉన్నారా! మిత్రులతో కులాసాగా కాలక్షేపం జరుగుతోందా?" అన్నది.

యుగంధర్ జవాబు చెప్పలేదు. సెఫియాను ఆ పాదమస్తకమూ పరీక్షగా చూశాడు. తనను రివాల్వరుతో బెదరించిన స్త్రీ ఈమేనని దృఢపరచుకున్నాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు యుగంధర్.

"నా పేరు సెఫియా. ఈయన మా నాన్న వాయిజ్" అని యుగంధర్ని చూసి "అయ్యయ్యో! యుగంధర్ లాటి గొప్పవారిని ఇలా సామాన్యుణ్ణి కట్టినట్టు తాళ్ళతో కట్టవచ్చా! తప్పు" అంటూ సెఫియా ఒంగి, ఆమె మృదువైన హస్తాలతో యుగంధర్ చేతులకూ, కాళ్ళకూ కట్టిన కట్లు విప్పింది. అంతసేపూ వాయిజ్ చేతిలో పిస్తోలు పట్టుకునే ఉన్నాడు. చేతుల కట్లు విప్పగానే యుగంధర్ ఒకసారి చేతులు నలుపుకుని లేచి కూర్చున్నాడు.

"మిస్ సెఫియా! థాంక్స్. నువ్వెవరు? ఎందుకు నన్నిక్కడికి తీసుకొచ్చావ్?" అడిగాడు యుగంధర్.

సెఫియా నవ్వింది. తెల్లని పళ్ళవరస ముత్యాల్లా మెరిసింది. "యుగంధర్! ఈ పరిస్థితిలో మనం అబద్ధాలు చెప్పుకోడం, బుకాయించుకోడం అనవసరం. ఉన్నదున్నట్లు మాట్లాడుకుని ఒక ఒప్పందానికి రావడం మంచిది. ఏమంటారు?" అన్నది.

యుగంధర్ తల ఊపాడు. "నెం.888తెస్తున్న రహస్య పత్రాలు మాకు కావాలి" అన్నది సెఫియా.

"ఎందుకు?" అడిగాడు యుగంధర్.

"మేము ఏ విదేశ ప్రభుత్వ ఏజెంట్లమూ కాము. మా స్వంత బాధ్యత మీద ఆ కాగితాలు అడుగుతున్నాం."

"అదే ఎందుకు?"

"ఆ కాగితాలను అమ్ముతాము. ఏ ప్రభుత్వం ఎక్కువ డబ్బు ఇస్తే ఆ ప్రభుత్వానికి వాటిని అమ్మేస్తాం. భారత ప్రభుత్వమే కొనుక్కోవచ్చు" అన్నది.

"ఆ కాగితాలకు ఫోటోలు తీసి, వాటిని ఇతర దేశాల ప్రభుత్వాలకు అమ్మరని రూఢీ ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"అటువంటు రూఢి ఏమీలేదు. నా మాట నమ్మాలి" అన్నదామె.

"మీ మాట నమ్మేందుకు మీరెవరో నాకుతెలియదుగా!" అన్నాడు యుగంధర్.

"చెబుతాను. మేము పోర్చుగీస్ దేశస్తులం. మీరంతా మమ్మల్ని బుడతకీచులు అంటారు" అని నవ్వింది. "మా గవర్నమెంటు రహస్య ప్రతినిధిగా ఈ ఊళ్ళో చాలాకాలం నుంచీ ఉంటున్నాడు మా నాన్న. నెం.888 కొన్ని రహస్య కాగితాలను తెస్తున్నాడనీ, వాటిని సంపాదించేందుకు ప్రయత్నించమని మా నాన్నకు ఆదేశం వచ్చింది. వెంటనే మా నాన్న తన స్నేహితులూ, ఇతర దేశ గూఢచారులయిన

కొంతమందిని పిలిపించి చర్చించాడు. వారందరికీ కూడా వారి వారి ప్రభుత్వాల నుంచి ఆ రహస్య పత్రాలను చేజిక్కించుకోమని ఆదేశాలు వచ్చాయి. అందరి లక్ష్యమూ ఒకటే కనుక అందరూ కలిశారు. నెం.888 దగ్గరనుంచి ఆ కాగితాలను అపహరించటమెలాగో వారికి పాలుపోలేదు. అప్పుడు నేను పథకం వేసి చెప్పాను. నెం.888కి ప్రియురాలు ఉన్నదని వాకబు చేసి కనుక్కున్నాము. నెం.888 వస్తున్న విమానంలో ఏర్ హోస్టెస్‌కి డబ్బు ఆశ చూపి ఆమె ద్వారా విమానంలో నెం.888కి ఒక కవరు ఇప్పించాను" అని సెఫియా చెబుతున్నది.

వాయిజ్ ఆమె మాటలకు అడ్డు వచ్చి "ఇదంతా చెప్పడం ఎందుకు?" అన్నాడు.

"నువ్వు ఊరుకో నాన్నా! యుగంధర్ ఇదంతా ఈపాటికి గ్రహించి ఉంటారు. చెబితే మనకు కలిగే నష్టం ఏమీలేదు" తండ్రితో అని, "నెం.888 సులభంగా మా వలలో పడతాడని తెలిసే, ఏర్ పోర్టు రెస్టారెంటులోకి వెళ్ళమనీ, లత టెలిఫోను చేస్తుందనీ ఉత్తరంలో వ్రాశాము. అప్పటికే లతను మేము బంధించాము. బెదిరించి లత చేత టెలిఫోనులో మాట్లాడించాము. తను ఆపదలో ఉన్నాననీ, అతన్ని వెంటనే రమ్మనీ చెప్పింది."

యుగంధర్ నవ్వి, "అంత జాగ్రత్తగా వల పన్నినా ప్రయోజనం లేకపోయింది కదూ! నెం.888 కాగితాలు తనకూడా తీసుకురాలేదు" అన్నాడు.

సెఫియా నవ్వలేదు. "అవును. ఆ కాగితాలు మాకు కావాలి. యుగంధర్! వాటిని మాకు ఇప్పించండి. మీరు మాతో చేరండి. అన్ని ప్రభుత్వాలకూ వాటిని అమ్మేద్దాం. కొన్ని కోట్ల రూపాయలు వస్తాయి. మనం అందరం సమానంగా పంచుకుందాం. ఒక్కొక్కళ్ళవంతుకు కనీసం రెండుకోట్ల రూపాయలయినా వస్తాయి" అన్నది. డబ్బు విషయం మాట్లాడుతుండగా సెఫియా కళ్ళు, విచిత్రంగా మెరిశాయి.

"అంత డబ్బు ఎందుకు? ఏం చేసుకుంటావ్?" అడిగాడు యుగంధర్.

సెఫియా విరగబడి నవ్వింది. యుగంధర్ దగ్గిరకు వెళ్ళింది. అతని చెయ్యిమీద చెయ్యివేసి, "అంత డబ్బు ఎందుకా? యుగంధర్ నిజంగా అమాయకుడా? అయితే మీ డబ్బు, నా డబ్బు కలిపేద్దాం. నాతో రండి. ఆ డబ్బు ఏం చేయాలో చూపిస్తాను. మీరంటే నాకు అదోరకమైన ఆకర్షణ ఏర్పడుతోంది. చాలా కులాసాగా కాలం గడపవచ్చు" అన్నది.

"అన్యాయంగా ఆర్జించిన డబ్బుతో నేను సుఖపడలేను. నైతిక విలువలు లేని స్త్రీ సాంగత్యమూ భరించలేను - సుఖించలేను" అన్నాడు యుగంధర్.

సెఫియా వెనకకు అడుగువేసి, యుగంధర్ని హేళనగా చూస్తూ, "మీకన్నా మీ అసిస్టెంట్ రాజే అందమైన వాడు" అని వెళ్ళిపోయింది. ఆమె వెనకే వాయిజ్ కూడా తలుపు బయట గొళ్ళెం పెట్టి వెళ్ళిపోయాడు.

రాజేమయ్యాడు? అతను కూడా బంధితుడేనా ఇక్కడ! సెఫియా అన్నమాటలను బట్టి రాజుకేప్రమాదమూ సంభవించలేదని యుగంధర్ ఊహించాడు. అంతకన్నా ముఖ్యమైన పనున్నది. తలుపు మూయబడగానే, గబగబా గోడలూ, తలుపు సందులూ, మూలలూ గదంతా ఒక్క అర అంగుళం వదలకుండా అన్నీ పరీక్షక్ష చేశాడు. ఆ పరీక్ష పూర్తయ్యాక నెం.888 తలతిప్పాడు.

"నేను తప్పించుకునే అవకాశం కలగవచ్చు. కనుక ఆ కాగితాలు ఎక్కడ దాచారో చెప్పండి. చెవిలో రహస్యంగా చెప్పండి. ఎందుకయినా మంచిది" అన్నాడు యుగంధర్.

నెం.888 చెప్పనని ఆడించాడు. "మీరు నిజంగా యుగంధరేనని నాకెలా తెలుసు? నానుంచి ఆ కాగితాల విషయం తెలుసుకునేందుకు సెఫియా ఆడిస్తున్న నాటకం అయివుంటుంది. లేకపోతే మీ కట్లు ఎందుకు విప్పుతుంది" అడిగాడు నెం.888.

యుగంధర్ నెం.888ని రెప్పవాల్చకుండా చూశాడు. "మీకు అనుమానం కలగడానికి కారణం ఉంది నిజమే. నేను నిజంగా యుగంధర్నే. కాని నా దగ్గిర రుజువేమీ లేదు" అన్నాడు యుగంధర్.

నెం.888 నవ్వాడు. "మీరు నిజంగా యుగంధర్ అయితే అపరాధ పరిశోధనలో మేధావి అయిన మీరు ఆ పత్రాలు నేను ఎక్కడ దాచానో సులభంగా ఊహించగలుగుతారు" అన్నాడు నెం.888 యుగంధర్ని ఓరకంట చూస్తూ.

యుగంధర్ రెండు నిమిషాలు మాట్లాడలేదు. "అంత సులభమా?" అన్నాడు.

"అవును" అని నెం.888 తల ఊపాడు.

నెం.888 ని ఆ కాగితాలను గురించి ఇక ప్రశ్నించి ప్రయోజనం లేదని యుగంధర్ తీర్మానించుకున్నాడు. తను నెం.888 స్థితిలో ఉంటే తనకూ అలాగే అనుమానం కలిగేది. నెం.888 ఆకాగితాలను ఎక్కడ దాచాడు? చాలా సులభంగా గ్రహించవచ్చని అంటున్నాడే! యుగంధర్ ఆలోచిస్తూ గదిలో పచార్లు చేయసాగాడు.

పది నిమిషాలు దాటింది.

గది తలుపు తెరవబడింది. ఇద్దరు మనుష్యులు వచ్చారు. ఇద్దరి చేతుల్లోనూ పిస్తోళ్ళు ఉన్నాయి. యుగంధర్ని చూసి తమతో రమ్మని సంజ్ఞ చేశారు.

✡✡✡

**యుగంధర్ మాట్లాడకుండా** వారి వెంట వెళ్ళాడు. నడవాలోంచి నడిచాడు వాళ్ళ వెనక. ఒక గది ముందు ఆగి యుగంధర్ని లోపలకు వెళ్ళమన్నారు. యుగంధర్ ఆ గదిలోకి వెళ్ళాడు. గది మధ్యన సెఫియా నిలుచున్నది. ఆమె పక్కన ఆమె తండ్రి వాయిజ్ నిలుచున్నాడు.

గది మధ్య రెండు కుర్చీలున్నాయి. ఒక కుర్చీలో రాజు, రెండో కుర్చీలో నెం.333 తాళ్ళతో కట్టబడి ఉన్నారు. రాజుని చూసి యుగంధర్ నిట్టూర్చాడు. అతనికి ఏ ఆపదా రాలేదు ఇంకా. బంధింపబడివున్నా సురక్షితంగానే ఉన్నాడు.

"యుగంధర్! మనస్సు మార్చుకున్నారా?" అడిగింది సెఫియా.

యుగంధర్ లేదని తల విదిలించాడు. ఇంతలో ఒక వ్యక్తి ట్రేలో టీ కప్పులు తీసుకొచ్చాడు సెఫియా మర్యాదగా ఒక టీ కప్పు యుగంధర్కి అందించింది.

రాజు వేళ్ళతో కుర్చీమీద కొడుతున్నాడు.

యుగంధర్ తల ఊపాడు. అబద్దం చెప్పి ప్రయోజనం లేదు. రాజు యుగంధర్కి టీ తాగవద్దని హెచ్చరిక చేశాడు.

యుగంధర్ టీ కప్పు చేతిలో పట్టుకుని కప్పువంక చూశాడు. కప్పు నోటివరకూ తీసుకువెళ్ళి వాసన చూశాడు. రాజు గాభరాగా యుగంధర్ని చూస్తున్నాడు. తన హెచ్చరిక అర్థమైందో లేదో అని మళ్ళీ చప్పుడు చేశాడు. యుగంధర్ ఖాళీ కప్పు ఎక్కడ పెట్టాలా అని చూస్తున్నాడు. సెఫియా చటుక్కున అందుకోబోయింది. కాని ఈలోగా ఆ కప్పు యుగంధర్ చేతిలోంచి జారి కిందపడి తునాతునకలయింది. ఆ కప్పుతోబాటు యుగంధరు చెట్టు విరిగిపడినట్టు, అమాంతం నేలమీద దభేలుమని పడ్డాడు. రాజు కళ్ళు మూసుకున్నాడు.

## 12

వెచ్చగా సూర్యకిరణాలు చెంపమీద పడేటప్పటికి యుగంధర్ బరువుగా కళ్ళు తెరిచాడు. అలా ఆకాశం వైపు చూస్తూ పడుకున్నాడు. రెండు నిమిషాల తరువాత తల కదల్చకుండానే చుట్టూ కలయచూశాడు. చెట్లు, పూల చెట్లు, ఆకాశం, దీప స్థంభాలు, కాకులు, పావురాలు కనిపించాయి.

యుగంధర్ లేచి కూర్చున్నాడు. తను ఓ పార్కులో సిమెంటు సీటుమీద ఉన్నాడు. అప్పుడే సూర్యోదయం అయింది. ఒకసారి గట్టిగా కళ్ళుమూసుకుని నలుపుకున్నాడు. రాజు తాళ్ళతో కట్టబడివుండడం, నెం.888, లతా నేలమీద పడుండడం, సెఫియా, వాయిజ్ తన ముందుండడం మెదడులో ఎక్కడో మెదిలింది. అదంతా కలా అనుకున్నాడు. తల దిమ్ముగా ఉంది. ఒకసారి తల విదిలించాడు. అది కల కాదు. నిజంగా జరిగింది. తను టీ తాగడం జ్ఞాపకమొచ్చింది. రాజు చేసిన హెచ్చరిక వల్ల తను టీవాసన చూసి అందులో ఘాటైన నిద్రమందేదో కలిపారని తెలుసుకున్నాడు. వాళ్ళు తనను వదలివేయదలుచుకున్నారని గ్రహించాడు. అందుకే తనను తాళ్ళతో కట్టి ఉంచలేదు. గదిలో పెట్టి బంధించలేదు. వాళ్ళు తనను ఎందుకు వదిలి వేస్తున్నారో కారణం ఊహించాడు. అప్పట్లో వాళ్ళ పథకానికి అనుగుణంగా ప్రవర్తించడమే మంచిదని టీ తాగేశాడు. వెంటనే స్పృహ పోయింది.

మళ్ళీ ఇప్పుడు, తెల్లవారిన తర్వాత, పార్కులో స్పృహ వచ్చింది.

యుగంధర్ జేబులన్నీ తడిమి చూసుకున్నాడు. మనీ పర్సు తాళం చెవులగుత్తి, పిస్తోలు, డబ్బు, కాగితాలు, డైరీ అన్నీ అట్లాగే ఉన్నాయి. వాటితోపాటు ఒక కవరు కూడా ఉంది. యుగంధర్ ఆ కవరు తీశాడు. పైన 'యుగంధర్ గారికి' అని వ్రాసి ఉంది. చించాడు.

*డియర్ యుగంధర్,*

ఆ కాగితాలు ఎక్కడ దాచినది నెం.888 మీకు చెప్పి ఉంటాడు. ఇప్పుడు మీరు సులభంగా ఆ కాగితాలను సంపాదించగలరు. అయితే వాటిని హోం మినిస్టర్‌కు ఇవ్వడం మంచిది కాదు.

నెం.888, లత మా ఆధీనంలో ఉన్నారు. మీ అసిస్టెంట్, మీ సహచరుడూ, ప్రేమ పాత్రుడూ అయిన రాజు మా ఆధీనంలో ఉన్నాడు. ఆ విషయం జ్ఞాపకం ఉంచుకోండి.

ఆ కాగితాలను మీరు హోం మినిష్టర్‌కి అందజేసిన మరుక్షణం వీళ్ళ ప్రాణాలు పోతాయి. జాగ్రత్త. ఆ కాగితాలను మాకు అప్పగించారా వాళ్ళనందరినీ సురక్షితంగా మీకు అప్పచెబుతాము. ఆ కాగితాలు సంపాదించలేదనే అపకీర్తి మీకు రాకుండా, ఆ కాగితాలు ఫోటోలు తీసి, అసలు కాగితాలను మీకు తిరిగి ఇచ్చేస్తాం. వాటిని సంపాదించామని చెప్పి మీరు హోం మినిస్టర్‌కి వాటిని ఇచ్చివేయవచ్చు.

లోకానుభవమూ, విజ్ఞతా, వాస్తవిక దృష్టిగల మీరు పొరపాటున కూడా ఆ కాగితాలను ప్రభుత్వానికి ఒప్పచెప్పరన్న నమ్మకంతో మీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. ఈ రాత్రి పన్నెండు గంటలకి మీరు జుహూ బీచి దగ్గర ఆ కాగితాలతో నిలుచునుండండి. మీ దగ్గిరకు ఒక కారు వచ్చి ఆగుతుంది. అందులో ఎక్కండి. తిన్నగా నా దగ్గిరకు రావచ్చు. పోలీసు వారిచేతగాని, ఇతరుల చేతగాని ఆ కారుని వెంబడించినా, ఆ కారు డ్రయివర్ని పట్టుకున్నా మీకే నష్టం. నా ఆచూకీ మళ్ళీ మీకు తెలియదు. మీ రాజు మీకు మళ్ళీ సజీవంగా కనపడడు. వెయ్యికళ్ళతో మిమ్మల్ని కనిపెడుతూనే ఉంటాము. మీకు జయము కలుగుగాక! *అభిమానంతో సెఫియా."*

యుగంధర్ ఆలోచిస్తూ ఆ ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు. పార్కు బయటకు వెళ్ళి ఎదురొచ్చిన మొదటి టాక్సీ ఎక్కి తను బసచేసిన వెల్ కం హోటలుకు వెళ్ళాడు. స్నానం చేసి బట్టలు మార్చుకుని తిన్నగా పోస్టుమాస్టర్ జనరల్ ఇంటికి వెళ్ళాడు.

రాత్రంతా నిద్రలేకుండా పనిచేయడం వల్ల పోస్టు మాస్టర్ జనరల్ కళ్ళు ఎర్రగా ఉన్నాయి. "రండి యుగంధర్! ఇవిగో మీరడిగిన ఉత్తరాలు" అని ఓ పెద్ద కట్ట యుగంధర్ ముందుకు తోశాడు.

యుగంధర్ మాట్లాడకుడా ఆ కవర్లన్నిటినీ చించి ఒక్కొక్కటే పరీక్ష చేశాడు. తనకు కావలసిన కాగితాలు కనిపించలేదు. "మీ టెలిఫోను ఒకసారి ఉపయోగించాలి" అన్నాడు యుగంధర్.

"దానికేం" అని ఆయన టెలిఫోను ఉన్న గదిలోకి తీసుకువెళ్ళాడు యుగంధర్ని.

యుగంధర్ ఛీఫ్ మినిస్టర్ ఇంటికి టెలిఫోను చేసి హోం మినిస్టర్ తో మాట్లాడాలని చెప్పాడు.

క్షణంలో హోం మినిస్టర్ సిన్హా అవతల నుంచి "హలో యుగంధర్!" అని పిలిచాడు.

"హలో! ఢిల్లీ నుంచి కబురు వచ్చిందా?"

"వచ్చింది. సెక్రటరీ ఫోను చేశాడు. అటువంటి కాగితాలు ఏవీ లేవుట."

"సరేలెండి. నేను మిమ్మల్ని ఈ వేళ కలుసుకుంటాను. దయచేసి మీరు బయట కెక్కడికి వెళ్ళకండి. నేను రాగానే తిన్నగా నన్ను మీ వద్దకు తీసుకొచ్చేట్లు మీ సెక్రటరీకి చెప్పండి."

"ఎప్పుడొస్తారు?"

"ఏమో! ఇంకో గంటలో రాగలనేమో!" అని యుగంధర్ టెలిఫోను పెట్టేశాడు. ఇంకో నెంబర్ తిప్పాడు.

"హల్లో! శాంటాక్రజ్ ఏర్‌పోర్ట్ మేనేజర్‌కు కనెక్టు చెయ్యండి."

కనెక్షన్ రాగానే "నేను యుగంధర్ని" అన్నాడు.

"హల్లో! గుడ్ మార్నింగ్. ఏమిటి విశేషం?"

"ఏమీలేదు. మీకు ఏర్ పోర్ట్‌లో రెస్టారెంటు ఊడ్చేందుకు మనిషి ఎవరయినా కావాలా?"

"అక్కరలేదు" అన్నాడు మేనేజర్.

"కావాలనుకుంటాను. మీకు చాలా అవసరం. మీకు కోపం వచ్చి ప్రస్తుతం ఆ పని చేస్తున్న మనిషిని ఇవాళ ఆఫీసుకి వెళ్ళగానే డిస్‌మిస్ చేస్తారు. ఇంకో మనిషిని తీసుకురమ్మని మీ జవానుకు చెప్తుతారు. ఏర్ పోర్టు దగ్గర ఓ మనిషి ఉంటాడు. అతన్ని ఉద్యోగంలోకి తీసుకుంటారు" అన్నాడు యుగంధర్.

ఒక నిమిషం ఏర్ పోర్టు మేనేజర్ అర్థంకాక మౌనంగా ఉండి తర్వాత "సరేలెండి" అన్నాడు.

యుగందర్ టెలిఫోను పెట్టేశాడు. పోస్ట్‌మాస్టర్ జనరల్ వైపు తిరిగి "మీరో చిన్న సహాయం చెయ్యాలి" అన్నాడు.

"చెప్పండి."

"నాకు ఓ మాసిన పంచా, చిరిగిన కుర్తా కావాలి?"

పోస్టు మాస్టర్ జనరల్ నవ్వి లోపలకు వెళ్ళి రెండూ తెచ్చి ఇచ్చాడు. యుగంధర్ పక్కన వున్న గదిలోకి వెళ్ళి పంచ కట్టుకుని, చొక్కా తొడుక్కున్నాడు, తలకు ఒక గుడ్డ చుట్టుకున్నాడు. మాసిన గెడ్డం పెట్టుకున్నాడు. బూట్సు విప్పేసి ఒట్టి పాదాలతో నడిచి బయటకు వెళ్ళాడు.

తన నెవరూ వెంబడించడంలేదని నిర్ధారణ చేసుకునేందుకు వెనక్కి చూసుకుంటూ నడిచాడు. బస్సు స్టాపు వద్దకు వెళ్ళి నిలుచున్నాడు. శాంటాక్రజ్‌కి వెళ్ళే బస్సు రాగానే అందులో ఎక్కి ఏర్ పోర్టుకి టిక్కెట్టుకొన్నాడు.

***********

ఏర్ పోర్టు రెస్టారెంటులోకి చీపురు పట్టుకుని వచ్చిన మనిషిని చూసి "ఎవరు నువ్వు?" అని అడిగాడు బట్లర్.

"ఊడిచేవాణ్ణి. ఈవాళే చేరాను" అని వినయమా జవాబు చెప్పిన మనిషి తనకు క్రితం రోజు అయిదు రూపాయలు బహుమానం ఇచ్చిన పెద్దమనిషి అని తెలీదు బట్లర్‌కు.

ఆ చీపురు పట్టుకున్న మనిషి వసారాలన్నీ ఊడ్చాడు. టెలిఫోను బూత్ కూడా ఊడ్చాడు. ఊడుస్తూ టెలిఫోను బూత్‌లో చాలాసేపు ఉండిపోయేసరికి "ఆ టెలిఫోను బూత్ ఎంతసేపు ఊడుస్తూ కూర్చుంటావు?" అని బట్లర్ కేకవేశాడు.

బట్లర్ కేకవేసిన అయిదు నిమషాలకు గాని ఆ ఊడ్చే మనిషి బయటకు రాలేదు. అతని మొహం, జుట్టు మట్టి కొట్టుకు ఉన్నాయి.

బట్లర్ నవ్వి "ఊడ్చి మట్టంతా మొహం మీద పోసుకుంటున్నావా! త్వరగా హాలు ఊడ్వు" అని చెప్పాడు.

హాలు ఊడవడం పూర్తయిన తర్వాత అతను నీళ్ళగది ఊడవడానికి వెళ్ళాడు. నీళ్ళగదిలోంచి ఎంతసేపటికి బయటకు రాలేదు. పదినిమిషాలు చూసి "త్వరగా వచ్చి మిగతా గదులు ఊడు!" అని మళ్ళీ బట్లర్ కేక వేశాడు.

లోపల్నించి జవాబు రాలేదు.

బట్లర్ ద్వారపాలకుడిలాగ ఆ తలుపు దగ్గిరే నిలుచున్నాడు. ఇరవై నిమషాల తర్వాత ఆ ఊడ్చే మనిషి బయటకు వచ్చాడు. బట్లర్ అతన్ని ఎగాదిగా చూసి "స్నానం చేశావా?" అడిగాడు.

అతను తలవూపి "అవును. చీదరంగా ఉంటే స్నానం చేశాను" అన్నాడు.

"నాతో రా!" అతన్ని రెస్టారెంట్ మేనేజర్ దగ్గరకు తీసుకువెళ్ళి, అతిథుల నీళ్ళగదిలో స్నానం చేశాడని ఫిర్యాదు చేశాడు.

"కాసిని నీళ్ళు పోసుకుంటే ఇంత గలభా చేస్తారెందు? నాకు ఈ ఉద్యోగం అక్కరలేదు. మీరు డిస్ మిస్ చెయ్యనవసరంలేదు. నేనే పోతున్నాను" అంటూ ఊడ్చే మనిషి గబగబ బయటకు నడిచాడు. ఏర్‌పోర్ట్ గేటు దాటాడు. బస్సు స్టాండు వద్ద నిలుచున్నాడు.

అతని గుండె దడదడ కొట్టుకుంటోంది. అతని రక్తం వడివడిగా పారుతోంది. అతని కళ్ళు మెరుస్తున్నాయి పక్కలకీ, వెనక్కీ చూస్తూ నిలుచున్నాడు. మొలలో ఉన్న పిస్తోలును తడుముకుంటున్నాడు.

అవసరమైతే ఆ పిస్తోలుతో వందమందినైనా కాల్చి తన ప్రాణాన్ని కాపాడుకుంటాడు. తన ప్రాణం కాపాడుకోవడం, ప్రాణం మీద తనకున్న మమకారంవల్ల కాదు. తను సంపాదించిన కాగితాలను కాపాడడానికి - ఆ కాగితాలు లక్షప్రాణలంటే విలువైనవి.

************

"ఏమిటి విశేషం? అని ఆశ్చర్యపోతూ యుగంధర్ని చూశాడు హోం మినిస్టర్ శంకరనారాయణ సిన్హా, యుగంధర్ని చూసి నివ్వెరపోయిన హోం మినిస్టరు అతన్ని కూర్చోమని చెప్పడం కూడా మరిచిపోయాడు.

యుగంధర్ మోకాళ్ళ వరకు పంచ కట్టుకున్నాడు. మాసిపోయి చిరిగిన లాల్చీ తొడుక్కున్నాడు. తలకి గుడ్డ చుటుకున్నాడు.

హోం మినిస్టర్ సిన్హా రెండు నిమిషాలు యుగంధర్ని చూస్తూ ఉండిపోయాడు. చివరికి "కూర్చోండి యుగంధర్!" అన్నాడు.

యుగంధర్ మంత్రి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు. ఆ గదిలో వాళ్ళిద్దరూ తప్ప మరి ఎవరూ లేరు.

యుగంధర్ ఓ కాగితం తీసి మినిస్టర్‌కు ఇచ్చాడు. అది సెఫియా రాసిన ఉత్తరం. కాగితాలను తమకు వప్పగించనట్లయితే రాజునీ, నెం.888నీ, లతనూ చంపేస్తామని బెదిరించిన ఉత్తరం అది.

మంత్రి ఆ ఉత్తరాన్ని చదివి, నిట్టూర్చి ఆ కాగితాన్ని మడిచి తిరిగి యుగంధర్‌కి ఇచ్చాడు.

"ఆ కాగితాలు దొరికే ఆశ ఉందా?" అడిగాడు మినిస్టర్.

యుగంధర్ మంత్రిని చూసి నవ్వాడు. తనను శత్రువులు పట్టుకోవడం, నెం.888ని బంధించిన గదిలోకి తీసుకువెళ్ళి తనను విడవడం, రహస్య పత్రం గురించి నెం.888 తనకు చెప్పడానికి నిరాకరించడం విశదంగా చెప్పాడు యుగంధర్.

"ఫూల్! ఫూల్! నెం.888 మనకు ఇన్ని చిక్కులు తెచ్చిపెట్టడమే గాక మొండిగా మిమ్మల్ని నమ్మకపోవడం కూడానా! ఛీ.ఛీ! మన ప్రతిక కక్షులు ఎక్కడ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారో తెలుసుకున్నారా!" అడిగాడు సిన్హా ఆతృతతో.

లేదని యుగంధర్ తల తిప్పాడు. "వాళ్ళ స్థానం నాకు తెలియకుండా ఉండేందుకే ట.లో మత్తుమందు కలిపి ఇచ్చారు. నాకు స్పృహ పోయిన తర్వాత నన్ను తీసుకు వెళ్ళి పార్కులో పడుకోబెట్టి వెళ్ళిపోయారు.

మంత్రి ఆలోచిస్తూ కుర్చీలో జారగిలబడాడు. "మీరు చెప్పినదాన్నిబట్టి ప్రతికక్షులకు ఇంకా ఆ కాగితాలు దొరకలేదు. అంతవరకూ నయమే!" అన్నాడు.

"అవును. వాళ్ళకి ఆ కాగితాలు దొరకలేదంటే దానికి నెం.888 ఓర్పు, దేశభక్తి కారణం. అతను ఫూల్ కాడు. చాలా తెలివైనవాడు. జాగ్రత్తగలవాడు. అందుకు అతను నాకు చెప్పటానికి నిరాకరించాను. నేను యుగంధర్నేననీ, ప్రతికక్షుల మనిషిని కాననీ అతనికి రూఢి తెలియదు కనుక రహస్యం బయట పెట్టలేదు. వాళ్ళు పెడుతున్న హింసనంతా భరిస్తున్నాడు. ఇంకో మనిషయితే ఈ పాటికి రహస్యం కక్కేసేవాడే" అన్నాడు యుగంధర్.

"క్షమించండి! తొందరపడి నెం.888 ని ఫూల్ అన్నాను" మంత్రి పరితాపంతో అన్నాడు.

యుగంధర్ ఒక్క క్షణం మౌనంగా ఉండి తర్వాత చొక్కా కిందినించి ఒక కవరు తీశాడు. అది పొడుగ్గా ఉంది. బాగా దళసరిగా ఉంది. గోధుమ రంగు కవరు అది. దాన్ని మంత్రికిచ్చాడు.

"ఏమిటది?" అడిగాడు మంత్రి.

"నాకూ తెలియదు. నేను విప్పి చూడలేదు. దానిమీద సీలు అలాగే ఉంది చూడండి. అందులో ఆ రహస్య కాగితాలు ఉన్నాయనుకుంటాను" అన్నాడు.

యుగంధర్  వాక్యం పూర్తిచేశాడో లేదో, హోంమంత్రి ఆ కవరు చింపి, అందులోంచి కొన్ని కాగితాలు బయటికి తీశాడు. మొదటి కాగితమూ, చివరి కాగితమూ చూశాడు. వాటిని మడుస్తూ టెలిఫోను తీశాడు. "ప్రధాన మంత్రికి కనెక్ట్ చెయ్యి" అన్నాడు.

ఆ రహస్య పత్రాలు దొరికాయనే శుభవార్త హోం మంత్రి ప్రధాన మంత్రికి చెప్పి, టెలిఫోను పెట్టేసి యుగంధర్ వైపు తిరిగాడు.

"నెం.888 చెప్పకపోయినా ఈ కాగితాలను ఎలా సంపాదించగలిగారు?" అడిగాడు.

"మళ్ళీ మిమ్మల్ని కలుసుకునే అవకాశం ఉంటే చెబుతాను నేను వెళ్ళాలి" అన్నాడు యుగంధర్ లేచి నిలుచుని.

"ఎక్కడికి? అంత తొందర ఎందుకు?"

"మీరు మర్చిపోయారేమో! నా అసిస్టెంటు రాజు, నెం.888, అతని ప్రియురాలు లత, నెం.333 ప్రతికక్షుల చేతుల్లో బందీలుగా ఉన్నారు. నేను మిమ్మల్ని ఒక చిన్న సహాయం కోరుతున్నాను. దయచేసి ఈ కాగితాలు దొరికినట్లు ఎవరికీ తెలియజేయకండి."

సిన్హా మొహం కాస్త ఇబ్బందిగా పెట్టాడు. "వాళ్ళను ఎలా తప్పిస్తారు?" అడిగాడు యుగంధర్ని.

"ఏమో! వాళ్ళను తప్పించగలుగుతానో లేదో చెప్పలేను. నేను మళ్ళీ వాళ్ళ చేతుల్లో చిక్కాక బయటికి రాగలనో లేదో!"

"అంటే మీరు మళ్ళీ వాళ్ళకు చిక్కుతారా?"

"అవును. చిక్కి వాళ్ళను తప్పించేందుకు ప్రయత్నిస్తాను."

"వాళ్ళు ఎక్కడ ఉన్నదీ తెలిస్తే పోలీసు సిబ్బందిని తీసుకువెళ్ళి ఇల్లు ముట్టడించవచ్చు" అన్నాడు మంత్రి.

యుగంధర్ నవ్వాడు. "నిజమే. కాని నాకు తెలీదు" అని మంత్రి గదిలోంచి వెళ్ళిపోయాడు యుగంధర్.

***

సెఫియా కుర్చీలో కూర్చునుంది. వాయిజ్ గదిలో పచార్లు చేస్తున్నాడు.

"చేతికి చిక్కినవాణ్ణి వదిలివేయడం ఏం పని? ఎందుకు చేశావా పని?" అడిగాడు వాయిజ్ కూతుర్ని.

"ప్రాణాలయినా వదులుతాడు గాని నెం. 888 ఆ పత్రాల సంగతి మనకు చెప్పడు. యుగంధర్కి చెప్పేసి ఉంటాడు" అన్నది సెఫియా.

"చెప్పివుంటే యుగంధర్ వెళ్ళి ఆ కాగితాలు తీసుకుంటాడు. మనకెట్లా వస్తాయి?"

"అతని అసిస్టెంటు రాజూ, మిగతా ముగ్గురూ మన చేతుల్లో ఉన్నారు. ఆ నలుగురి ప్రాణాలు బలి ఇస్తాడని అనుకోను."

"అంటే?"

"ఆ కాగితాలు తీసుకొచ్చి మనకు ఇవ్వకపోతే ఈ నలుగురి మీద ఆశ వదులుకోవలసివస్తుందని యుగంధర్‌కు తెలియజేశాను. తప్పకుండా ఆ కాగితాలు తీసుకువస్తాడనుకుంటాను. యుగంధర్ని వెంటాడమని మనిషిని పంపాను."

సెఫియా ఈ మాట చెపుతుండగానే గది తలుపు ఎవరో కొట్టిన చప్పుడయింది వాయిజ్ వెళ్ళి తలుపు తీశాడు.

ఆ వచ్చిన మనిషిని చూసి సెఫియా "నీకు ఏం చెప్పాను! ఏం ప్రమాదం సంభవించినా యుగంధర్ని కనిపెడుతూ ఉండమని చెప్పలేదా! అతనేమయ్యాడు? నువ్వెందుకు వచ్చావు?" అని గర్జించింది.

ఆ మనిషి గజ గజ వణికిపోయాడు."యుగంధర్ వెనకే నీడలా వెళ్ళాను. ఆయన పోస్టు మాస్టర్ జనరల్ ఆఫీసులోకి వెళ్ళారు. నేను బయట కాచుకున్నాను. ఆయన తిరిగి రాలేదు. మధ్యాహ్నం వరకూ ఉండి మీకా విషయం తెలియజేయడానికి వచ్చాను" అన్నాడు.

సెఫియా తోక తొక్కిన తాచులా లేచి ఆ మనిషిని దూషించింది. చివరికి "సరే. యుగంధర్ ఈ మనిషిని తప్పించుకున్నా తిరిగి మన దగ్గరికి రాక ఏమవుతాడు!" అన్నది.

## 13

'మీ రేమయారు? అసలు మళ్ళా కనిపించనేలేదు. మీ అసిస్టెంటుటు రాజు ఏడి?" అడిగాడు పోలీసు కమీషనర్.

యుగంధర్ కుర్చీలో కూర్చుని, జేబులోంచి సిగరెట్ పెట్టెతీసి, ఒక సిగరెట్ వెలిగించి "చాలా పనిలో ఉండిపోయాను. రాజెందుకు?" అడిగాడు.

"అతను ఓ ఇంటిని సోదా చెయ్యమని చెప్పాడు. ఆ ఇంట్లో ఉన్న వాళ్ళను అరెస్టు చెయ్యమన్నాడు. వెంటనే నేనే స్వయంగా పోలీసు సిబ్బందితో వెళ్ళాను. ఆ ఇంట్లో ఒక్క పురుగు కూడా లేదు. ఇల్లంతా సోదా చేశాము. ఏమీ దొరకలేదు" అని ఒక క్షణం ఆగి "చిత్తుకాగితాల బుట్టలో ఈ కాగితం దొరికింది. ఎందుకయినా మంచిదని దీన్ని తెచ్చాను" అన్నాడు కమీషనర్.

యుగంధర్ ఆ కాగితాన్ని తీసుకున్నాడు. కళ్ళు చిట్లించి ఆ కాగితం మీద వ్రాసి ఉన్నదంతా శ్రద్ధగా చదివాడు. చాలా లెక్కలున్నాయి ఆ కాగితం మీద. యుగంధర్ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"అదేమిటో తెలిసిందా?" అడిగాడు కమీషనర్.

"ఇది ఏదో రహస్యమైన కోడ్ అనుకుంటాను. మీరు మీ సీక్రెట్ కోడ్ ఎక్స్‌పర్ట్స్‌కి చూపించలేదా?" అడిగాడు యుగంధర్.

"చూపించాను. కాని వాళ్ళకు తలాతోకా తెలియలేదు. కోడ్ అని వాళ్ళూ అన్నారు. కాని ఈ కోడ్‌ని డీకోడ్ చేసేందుకు మూలం ఏమిటో తెలియాలిట. సామాన్యంగా వాడుకలో ఉన్న కోడ్ ఏదీ కాదుట ఇది" అన్నాడు కమీషనర్.

"అవును. బుక్ 9 అనే పుస్తకం ఆధారంతో ఈ కోడ్‌ను డీకోడ్ చెయ్యాలి. బుక్ 9 ఏం పుస్తకమో ఎలా చెప్పడం! షేక్స్‌ఫియర్ వాల్యూంలో 9వ వాల్యూం కావచ్చు. లేదా ఇంకేదైనా పుస్తకం యొక్క 9 వ వాల్యూం కావచ్చు. అడుగున పద్నాలుగు అనేది అక్షరాలలో వ్రాసివుంది కనుక అది ఉత్త సంఖ్యే. తతిమ్మా సంఖ్యలన్నీ కొన్ని అక్షరాలను సూచిస్తాయి. ఉదాహరణకు 81 అనేది అన్నిసార్లు తిరిగి తిరిగి వ్రాయబడింది కనుక అది బుక్ నెం.9లో 81 పేజీ అయివుండవచ్చు. కాని పక్కనున్న సంఖ్య పంక్తి పేజీ అయివుంటుంది. అంటే 81 పేజీలో ఫలానా పంక్తి. దాని పక్కనున్న సంఖ్య అక్షరాన్ని సూచించేదయి ఉండాలి. అంటే 81; 14 - 1 అని ఉంటే ఎనభై ఒకటవ పేజీలో పద్నాలుగో పంక్తిలో మొదటి అక్షరం అన్నమాట. ఆ నెం.9 బుక్కు ఏమిటో తెలిస్తే ఈ కాగితంలో ఏం రాసివున్నదో సులభంగా గ్రహించవచ్చు" అన్నాడు యుగంధర్.

"అదెలా తెలుసుకోవడం?" అడిగాడు కమీషనర్.

"మీరు సోదా చేసిన ఇంట్లో పుస్తకాలేమైనా దొరికాయా?"

"లేదు" అన్నాడు కమీషనర్.

"అయితే మనం తెలుసుకోవడం చాలా కష్టం" అని యుగంధర్ ఆ చీటీని కమీషనర్‌కి ఇచ్చేశాడు.

అయిదు నిమిషాల తర్వాత యుగంధర్ ఒక్క నిట్టూర్పు వదిలి "డియర్ ఫ్రెండ్! మీరు నాకు చాలా సహాయం చేశారు, చాలా థాంక్సు. మళ్ళీ మిమ్మల్ని కలుసుకునే అవకాశం దొరుకుతుందో లేదో" అని, పోలీసు కమీషనర్‌కి మొదటినుంచీ తనను హోం మినిస్టర్ పిలిపించినప్పటినుంచీ, అప్పటివరకూ జరిగిన సంఘటనలన్నిటినీ చెప్పాడు విశదంగా, కమిషనర్ అంతా శ్రద్ధగా విన్నాడు.

"జయప్రదంగా నిర్వహించారు. అభినందనలు, కాని -" అని ఆగి, తర్వాత "రాజునీ, 888నీ, లతనూ, 333 నూ వాళ్ళకు బలి ఇచ్చేసినట్లేనా?" అడిగాడు కమీషనర్.

యుగంధర్ విచారంగా "ఏమో! నాలో ప్రాణం ఉన్నంతవరకూ ఆశ ఒదులుకోను" అన్నాడు.

"ఇప్పుడింక ఏం చేస్తారు? ఆ కాగితాలు మంత్రికి ఇచ్చారుగా?"

"అవును. ఇచ్చేశాను. దేశ క్షేమం కన్నా ఎవరి ప్రాణాలు ఎక్కువ కాదు. కాని నేను చాలా సాహసం చేయబోతున్నాను."

"ఏం చేయబోతున్నారు?"

"వాళ్ళ బోనులో చొరబడతాను."

"చొరబడి?"

"వాళ్ళను విడిపించేందుకు ప్రయత్నిస్తాను. బయట పడితే అందరం కలిసి బయటపడితే అందరం కలిసి బయటపడతాం. లేదా అందరం కలిసి ప్రాణాలు విడుస్తాం."

"మీ దగ్గిర పిస్తోలుగాని, మరే ఆయుధం కాని లేకుండా చేస్తారు. చేతులూ, కాళ్ళూ కట్టేస్తారు. ఎలా తప్పించుకుంటారు?"

"ఏమో! అవకాశం కోసం భగవంతుణ్ణి ప్రార్థించాలి. అంతే."

"నే నేమైనా సహాయపడగలనా?"

"దయచేసి మీరు ఆఫీసులోనే ఉండండి. సహాయం అవసరమైతే ఫోను చేస్తాను" అన్నాడు యుగంధర్ లేచి నిలుచుని.

పోలీసు కమీషనర్ కూడా లేచాడు. యుగంధర్ దగ్గిరకు వచ్చి అతని రెండు చేతులూ పట్టుకుని "జయం పొంది రండి!" అన్నాడు బొంగురుపోయిన కంఠస్వరంతో యుగంధర్ ముఖం చూడలేక తలతిప్పుకున్నాడు.

✡✡✡

## 12

**డిటెక్టివ్ యుగంధర్** జుహూ బీచ్‌లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిలుచున్నాడు. నిర్ణీత సమయానికి పదిహేను నిమిషాలముందే వచ్చి కాచుకున్నాడు. సెఫియా ఉత్తరంలో వ్రాసిన ప్రకారం నల్ల ఫోర్డు కారు వస్తుంది. అందులో ఎక్కి వెళ్ళాలి.

యుగంధర్ కళ్ళు నల్ల ఫోర్డు కారు కోసం చూస్తున్నా అతని మనస్సంతా తీవ్రమైన ఆలోచనలతో మునిగిపోయింది. ఆ కోడ్ గురించే ఆలోచిస్తున్నాడు. అస్పష్టంగా అతని స్మృతిపథంలో ఏదో మెదులుతోంది. దాన్ని జ్ఞాపకం తెచ్చుకోగలిగితే - కోడ్‌ని డీకోడ్ చెయవచ్చు. సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తున్నాడు.

చటుక్కున జ్ఞాపకం వచ్చింది. సెఫియా తనను దర్జీ కొట్టు పక్క షాపులో బంధించినపుడు, తను ఒక రైల్వేగైడ్ చూశాడు. దాన్ని బాగా ఉపయోగించినట్లు కాగితాలు నలిగి ఉన్నాయి. దానిమీద నెంబర్ తొమ్మిది అని ఉంది. అదేనేమో కోడ్‌కి మూలం! ఏమో!

యుగంధర్ ఒకసారి చుట్టూ చూశాడు. అయిదు గజాల దూరంలో ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ నిలుచున్నాడు. దగ్గిరకు రమ్మని యుగంధర్ అతన్ని సంజ్ఞ చేసి పిలిచాడు. అతను రాగానే, "నువ్వు అర్జంటుగా కమీషనర్‌ని కలుసుకుని రైల్వే గైడ్ నెంబర్ తొమ్మిది కోడ్‌కు మూలం అని యుగంధర్ చెప్పమన్నాడని చెప్పు" అన్నాడు.

కానిస్టేబుల్ తల తిప్పి, గబగబ వెళ్ళిపోయాడు.

పది నిమిషాల తర్వాత ఒక నల్ల ఫోర్డు కారు యుగంధర్ ముందు ఆగింది. "మెట్రో థియేటరుకి ఎటు వెళ్ళాలి?" అడిగాడు కారులో ఉన్న మనిషి.

"కుడివైపు తిరగాలి. నేనూ అటే వెళుతున్నాను. చూపిస్తాను" అంటూ యుగంధర్ కారెక్కాడు. కారు కదిలింది.

వాళ్ళిద్దరూ మాట్లాడలేదు. కారు కొంతదూరం వెళ్ళాక ఓ నిర్జన ప్రదేశంలో ఆగింది. ఒకతను వెనక సీటులోకి వచ్చాడు. యుగంధర్‌ని తలవంచమన్నాడు. యుగంధర్ కళ్ళకు గంతలు కట్టి, చేతులకు తాళ్ళు బిగించాడు.

మళ్ళీ కారు కదిలింది. అరగంట ప్రయాణం చేసింది. ఎన్నో మలుపులు తిరిగింది. యుగంధర్ కళ్ళు మూసి ఉన్నా ప్రతి మలుపూ జ్ఞాపకం పెట్టుకుంటున్నాడు.

చివరికి కారు ఆగింది.

యుగంధర్ కళ్ళకి గంతలు, చేతులకి తాళ్ళు విప్పలేదు. ఆ ఇద్దరూ యుగంధర్ని చెరో జబ్బా పట్టుకుని నడిపించు వెళ్ళారు. మెట్లు ఎక్కించి, మేడమీదకు తీసుకువెళ్ళి "కూర్చో!" అని ఆజ్ఞాపించారు వాళ్ళు. యుగంధర్ కూర్చున్నాడు. ఆ ఇద్దరిలో ఒకతను వెళుతున్నట్టు బూట్సుల చప్పుడు బట్టి తెలుసుకున్నాడు. కాసేపటికి ఎవరో గదిలోకి వస్తున్నట్టు అడుగుల చప్పుడయింది.

"కళ్ళకి గంతలు తీసెయ్" సెఫియా ఆజ్ఞాపించింది.

యుగంధర్ ఒకసారి కళ్ళు నలుపుకుని చుట్టూ చూశాడు. ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది. గది మధ్యన సెఫియా, ఆమె తండ్రి వాయిజ్, ఇంకో అతనూ నిలుచున్నారు. ఒక కుర్చీలో తను కూర్చునున్నాడు.

"సుస్వాగతం!" అన్నది సెఫియా.

"తెచ్చావా?" అడిగాడు వాయిజ్.

యుగంధర్ పెదిమ విరిచాడు.

"ఏం?" అడిగింది సెఫియా ఆదుర్దాగా.

"సెఫియా! నువ్వు పొరపడ్డావు. నెం.888 ఆ కాగితాలు ఎక్కడ దాచినదీ నాకు చెప్పలేదు" అన్నాడు.

"అలా అబద్ధాలు చెప్పటం మంచిది కాదు మిష్టర్ యుగంధర్! మీరు గొప్ప మేధావులని మిమ్మల్ని నేను చాలా మర్యాదగా చూస్తున్నాను" సెఫియా కఠినంగా పలికింది.

"థాంక్స్. నేను అబద్ధం చెప్పడం లేదు. నేను యుగంధరని నెం.888 నమ్మలేదు. అతన్నించి కాగితాలు ఎక్కడ దాచినదీ తెలుసుకునేందుకు మీరీ నాటకం ఆడుతున్నారని అన్నాడు. నేను నిజంగా యుగంధర్నని రుజువు చేసుకునేందుకు నా వద్ద ఆనవాళ్ళు ఏవీ లేకపోయాయి."

సెఫియా ముందుకి రెండడుగులు వేసింది. "మీరు చెప్పేది నిజమైతే మళ్ళీ మీరు ఎందుకు మా దగ్గిరకు వచ్చారు?" అడిగింది.

"నా అసిస్టెంటు రాజుని ఇక్కడ అట్టి పెట్టుకున్నారుగా! ఈసారయినా నెం.888కి నమ్మకం కలిగించి ఆ కాగితాలు ఎక్కడ దాచిందీ తెలుసుకుని, వాటిని మీకు సంపాదించి పెట్టి రాజుని విడిపించుకోవాలని వచ్చాను."

"మీ మాట నమ్మవచ్చా" అడిగింది సెఫియా.

"అది మీరే ఆలోచించాలి."

"సరే!" అని తలుపు దగ్గర కాపలా వున్న ఒక మనిషిని పిలిచి, "ఈయన్ని నెం.888నీ, లతనీ కాళ్ళూ, చేతులూ తాళ్ళతో గట్టిగా కట్టండి" అన్నాడు వాయిజ్.

"ఒక్కమాట" అన్నాడు యుగంధర్.

"ఏమిటది?"

"నేనే యుగంధర్నని నెం.888ని నమ్మించాలి. అందుకు గాను రాజునీ, అతని కూడా ఉన్న మనిషినీ ఆ గదిలోకి పంపండి."

సెఫియా అనుమానంగా చూసి, "మీరే యుగంధర్ అని వాళ్ళెలా నిరూపిస్తారు?" అడిగింది.

"రాజు కూడా ఉన్న మనిషి ఎస్. బి. ఏజంటు, నెం.333. అతను చెబితే నెం.888 నమ్ముతాడు."

సెఫియా ఆలోచించింది. "సరే, అతన్ని పంపిస్తాను కాని రాజుని పంపించను" అన్నది.

*********

యుగంధర్ని గదిలోకి తీసుకువచ్చి వదిలి, ఆ ఇద్దరూ తలుపు బయట గడియ పెట్టి వెళ్ళిపోయారు. నెం.888 ఒకసారి కళ్ళు తెరిచి చూశాడు.

యుగంధర్ గబగబా నెం.888 దగ్గరకు వెళ్ళాడు.

"ఇప్పుడు నెం.333ని ఈ గదిలోకి తీసుకొస్తారు. మీరు మాత్రం కళ్ళు తెరవకండి. స్పృహ లేనట్లు నటించండి. నేను మళ్ళీ చెప్పేంతవరకూ దయచేసి కళ్ళు తెరవకండి. మన అందరి ప్రాణాలూ మీమీద ఆధారపడి ఉన్నాయి" అంటూండగా, బయట తలుపు తీస్తున్న చప్పుడు అయింది.

నెం. 888 ఒకసారి యుగంధర్ని చూసి కళ్ళు మూసుకున్నాడు. తలుపు తెరుచుకుంది. ఇద్దరు మనుష్యులు నెం.333ని గదిలోకి తీసుకువచ్చారు.

రెండు నిమిషాలలో సెఫియా, వాయిజ్ గదిలోకి వచ్చారు. "నెం.888కి స్పృహలేదు. డాక్టర్నెవరినయినా పిలిపించాలి" అన్నాడు యుగంధర్.

సెఫియా నవ్వి "ఇంకా నయం. ఆస్పత్రిలో చేర్పించాలనలేదు. కొంచెం కాఫీ ఇస్తే స్పృహ తిరిగి వస్తుంది" అన్నది. తలుపు బయట గడియ పెట్టి సెఫియా, వాయిజ్ వెళ్ళిపోయారు.

యుగంధర్ నెం.888 దగ్గరకు వెళ్ళి అతని చెవిలో "నెం.333 వచ్చాడు చూడండి" అన్నాడు.

నెం.888 కళ్ళు తెరిచి చూశాడు, లత కళ్ళు వప్పగించి అందర్నీ చూస్తోంది.

"ఆయన చెవిలో నేను యుగంధర్నని చెప్పండి" అన్నాడు 333 తో యుగంధర్.

333 చెప్పాడు. 888 నవ్వి "క్షమించండి! -" అని ఇంకా ఏమో చెప్పబోతూ ఉంటే "అవసరం లేదు దొరికాయి. హోం మినిష్టరుకి ఇచ్చేశాను. ఇక మిగిలిందల్లా మనం ఇక్కణ్ణించి తప్పించుకోవడమే!" అన్నాడు యుగంధర్.

నె.888 నిట్టూర్చి, "ఆశలేదు" అన్నాడు.

"ఆఖరు క్షణం వరకూ ఆశవదులుకో కూడదు" అని యుగంధర్ నెం.333 వైపు తిరిగి, "నెం.888 చాలా నీరసంగా ఉన్నాడు. ఆయనేమీ సహాయం చెయ్యలేడు. మనమే ఆలోచించాలి" అన్నాడు. వాళ్ళిద్దరూ తప్పించుకునేందుకు గల అవకాశాల గురించి కొంతసేపు చర్చించుకున్నారు.

యుగంధర్ నేలమీద పడుకున్నాడు. అతని పక్కన నెం.333 పడుకున్నాడు. యుగంధర్ తాళ్ళతో కట్టిన చేతులు చాచాడు. నెం.333 పళ్ళతో యుగంధర్ చేతులకు కట్టిన తాళ్ళను కొరకడం ప్రారంభించాడు. పది నిమిషాలు ప్రయాస పడిన తర్వాత తాళ్ళు తెగాయి. యుగంధర్ అరచేతులతో వేళ్ళు రుద్దుకుని, 333 చేతులకు కట్టిన తాళ్ళను విప్పాడు.

"మన దగ్గర ఆయుధాలు లేవు. జాగ్రత్తగా మెలగాలి"అన్నాడు యుగంధర్. నెం.888కి కట్టిన తాళ్ళనూ, లతకు కట్టిన తాళ్ళనూ విప్పారు ఇద్దరూ, విప్పిన తర్వాత మళ్ళీ యథా ప్రకారం ముడివెయ్యకుండా తాళ్ళు చుట్టారు. అదే విధంగా 333కి యుగంధరూ, యుగంధర్‌కి 333 చేతులకు తాళ్ళు చుట్టుకున్నారు.

కాసేపట్లో తలుపు తెరుచుకుంది. సెఫియా, వాయిజ్ గదిలోకి వచ్చారు.

"నీతో మాట్లాడాలి" అన్నాడు యుగంధర్ సెఫియాతో. యుగంధర్ని తనతో రమ్మని సంజ్ఞ చేసింది సెఫియా.

యుగంధర్ ముందూ, అతని వెనకాలే సెఫియా వెళ్ళారు. సెఫియా చేతిలో పిస్తోలు గురిపెట్టబడి ఉంది.

"మెట్లెక్కి మేడమీదకు వెళ్ళండి" అంది. యుగంధర్ మెట్లెక్కాడు. మెట్లపైన ఇద్దరు మనుష్యులు చేతుల్లో పిస్తోళ్ళు పట్టుకుని నిలుచున్నారు.

"ఏమిటి చెప్పండి?" అడిగింది సెఫియా.

"నెం.888 చెప్పేశాడు" అన్నాడు యుగంధర్.

సెఫియా మొహం వికసించింది. "గుడ్, యుగంధర్, మీరు సాధించలేనిది లేదు" అన్నది దగ్గరకు వచ్చి.

యుగంధర్ నవ్వాడు. "ఇక మిగిలింది నేను వెళ్ళి ఆ కాగితాలు తెచ్చి మీకు ఇవ్వడమే" అన్నాడు.

"వెరీగుడ్! వెంటనే వెళ్ళేందుకు ఏర్పాటు చేస్తాను. మమ్మల్ని మోసగించేందుకు ప్రయత్నించకండి. మీ అసిస్టెంటు ప్రాణం మా చేతుల్లో ఉందని జ్ఞాపకం ఉంచుకోండి."

యుగంధర్, తలూపి, "నేనొకసారి నా అసిస్టెంటును కలుసుకోవాలి" అన్నాడు. "సరే! వెళ్ళి చూడండి!" అని మెట్ల దగ్గరున్న మనుష్యులను పిలిచి యుగంధర్ని రాజున్న గదిలోకి తీసుకు వెళ్ళమని చెప్పింది సెఫియా.

యుగంధర్ చేతుల్ కట్టేసి ఉన్నాయ్ కదా అని వాళ్ళు కొంచెం నిర్లక్ష్యంగా ఉన్నారు. ఓ గది తలుపు తెరిచి యుగంధర్ని లోపలకు వెళ్ళమన్నారు. యుగంధర్‌తో గదిలోకి వెళ్ళి అతని రెండు పక్కలా నిలబడ్డారు ఆ మనుష్యులు.

"ఎలా ఉన్నావు రాజా?" అంటూ యుగంధర్ దగ్గరకు వెళ్ళాడు. ఆ మనుష్యులకు తెలియకుండా తయారుగా ఉండమని రాజుకు కళ్ళతో సంజ్ఞ చేశాడు."నీ ఒంట్లో కులాసాగా ఉందా? నీ కాళ్ళు బాధపెడుతున్నాయా?" అని మాట్లాడుతూ పిడికిళ్ళు బిగించి పక్కన నిలబడి ఉన్న ఇద్దర్నీ బలంగా గెడ్డం కింద దిమ్మ తిరిగేటట్టు కొట్టాడు. యుగంధర్ చేతులు కట్టేసి ఉన్నాయి కదా అని దిలాసాలో ఉన్న ఆ ఇద్దరు ఆకస్మికంగా యుగంధర్ కొట్టిన దెబ్బకు పిడుగు పడినట్లు నేలకూలారు.

"ఏమిటీ గోల?" అంటూ సెఫియా అరుస్తూ పరిగెత్తుకు వస్తోంది. యుగంధర్ నేలమీద పడున్న ఇద్దర్నీ చూశాడు. వాళ్ళు అప్పుడే లేచే స్థితిలో లేరు. రాజు కట్లు విప్పేందుకు అవకాశంలేదు. సెఫియా వచ్చేస్తోంది. యుగంధర్ ఒక్క దూకులో తలుపు వెనక్కు వెళ్ళి నక్కి నిలబడ్డాడు.

"అయ్యయ్యో! యుగంధర్ని అలా హింసించకండి" అని రాజు కేక వేశాడు.

ఈ కేక వినగానే సెఫియా "ఆయన్నేమీ చెయ్యకండి" అంటూ గదిలోకి వచ్చింది.

తలుపు వెనక ఉన్న యుగంధర్ సెఫియా చేతిలోని పిస్తోలు కదిలేందుకు వీలులేకుండా ఆమెను రెండు చేతులతో పెనవేసి పట్టుకున్నాడు. వెనక్కి తిరిగి రాజును చూశాడు. రాజు పళ్ళు బిగించి, ఒళ్ళంతా విరుచుకుని శ్రమపడుతున్నాడు. పక్కకి ఒరిగాడు. కుర్చీతో

సహా పక్కకు నేలమీద పడ్డాడు. తర్వాత కుర్చీని ఈడ్చుకుంటూ అతివేగంగా తలుపువైపు పాకాడు. తలుపు దగ్గరికి చేరుకోగానే తలతో తలుపును మూశాడు. అతి కష్టం మీద మళ్ళీ కుర్చీని కోళ్ళమీద నిలబెట్టాడు. గడియ వేయాలి. ఎలా? చేతులూ, కాళ్ళూ కట్టేసి ఉన్నాయి. మెట్లమీద అడుగుల చప్పుడు - పరిగెత్తుకుని వస్తున్నారు. ఎలా?

రాజు ఒక్క క్షణం ఆలోచించాడు. పళ్ళతో గడియను గట్టిగా పట్టుకుని లాగాడు. గడియ పడ్డది.

"సెభాష్ రాజూ!" అంటూ యుగంధర్ సెఫియాను ఈడ్చుకుని రాజు దగ్గిరకు వెళ్ళాడు. రాజు మళ్ళీ పళ్ళను ఉపయోగించి సెఫియా చేతిలో ఉన్న పిస్తోలు లాగాడు. సెఫియా పట్టు వదలలేదు. రాజు మునిపళ్ళతో సెఫియా చేతిని గట్టిగా కొరికాడు. "అబ్బ" అంటూ సెఫియా పిస్తోలు వదిలేసింది. అది నేలమీద పడ్డది.

పిస్తోలు కిందపడగానే యుగంధర్ సెఫియాని వదిలేశాడు. పిస్తోలు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. సెఫియాను ఒక చేత్తో పట్టుకున్నాడు. రెండో చేత్తో రాజు కట్లు విప్పేశాడు.

బయట తలుపును తంతున్నారు - విరగగొడుతున్నారు.

"వాళ్ళను వెళ్ళిపొమ్మని చెప్పు! లేకపోతే నిన్ను షూట్ చేస్తాను" అన్నాడు యుగంధర్.

"ఆడదాన్ని షూట్ చేస్తావా?" అన్నది సెఫియా.

"డబ్బుకోసం ఎంత పనయినా చేసే నిన్ను ఒక ఆడదానిగా చూడలేదు. నువ్వు విషకీటకం. సంతోషంగా షూట్ చేస్తాను" అని యుగంధర్ పిస్తోలు మీట మీద వేలు పెట్టాడు. రాజు కాళ్ళనూ, చేతులనూ మర్దన చేసుకుని తలుపు దగ్గరకు వెళ్ళి నిలుచున్నాడు.

సెఫియా యుగంధర్ కళ్ళలో కాఠిన్యం చూసింది.

"నాన్నా! ఆగండి! మీరు తలుపు బద్దలు కొడితే యుగంధర్ నన్ను షూట్ చేస్తాడు" అని కేక వేసింది.

తలుపు బద్దలు కొడితే సెఫియాను షూట్ చేస్తారని వాయిజ్ భయం. తలుపు తీస్తే తమను వాళ్ళు షూట్ చేస్తాని యుగంధర్ భయం. తలుపు మూసేవుంది. తలుపుకు అవతల శత్రువులు - తలుపుకు ఇవతల యుగంధరూ, రాజూ.

పది నిమిషాలు గడిచాయి. యుగంధర్ రాజు చెవిలో ఏదో చెప్పాడు. సెఫియాను రాజు పట్టుకున్నాడు. యుగంధర్ ఒక చేత్తో పిస్తోలు పట్టుకుని సెఫియా వైపు గురిపెట్టాడు. ఆమె మాట్లాడకుండా నోరు నొక్కి పెట్టమన్నాడు రాజును. రెండో చేత్తో తలుపు గడియ చప్పుడు కాకుండా తీసివచ్చి గది మధ్య నేలమీద పడుకున్నాడు. తలుపు పక్కన నిలుచున్న రాజుకి సంజ్ఞ చేశాడు. రాజు తలుపు లాగి, తలుపు తీయగానే యుగంధర్ పిస్తోలు పేల్చాడు. శత్రుపక్షం కూడా పిస్తోళ్ళు పేల్చింది. కాని నేలమీద పడుకున్న యుగంధర్ కి దెబ్బ తగలలేదు.

యుగంధర్ మళ్ళీ పేల్చాడు. "అబ్బా!" అంటూ శత్రువులలో ఒకడు నేల కూలాడు. ఆ మూలుగు వినగానే సెఫియా 'నాన్నా' అని కేకవేసింది. సెఫియా అలా కేకవేయగానే వాయిజ్ అనుచరులకు ధైర్యం పోయింది. నాయకుడు వాయిజ్ పడిపోయాడు. సెఫియా యుగంధర్ చేతిలో చిక్కింది. ఇక లాభంలేదని తతిమ్మా వాళ్ళు కాళ్ళకు బుద్ధి చెప్పి పరిగెత్తారు. తమ ఆట కట్టిందని తెలుసుకుంది సెఫియా.

ఆమె ఒక చేతిని నోటి దగ్గర పెట్టుకుంది. మరుక్షణం నేలమీద పడిపోయింది. సరిగ్గా అదే సమయానికి మెట్ల మీద బూట్సు చప్పుడు అయింది. యుగంధర్ మళ్ళీ పిస్తోలు సిద్ధంగా పట్టుకున్నాడు.

"యుగంధర్! ఎక్కడున్నారు?

ఆ గొంతు వినగానే యుగంధర్ పిస్తోలు దింపి, లేచి నిలుచున్నాడు. "ఇక్కడ - ఈ గదిలో" అన్నాడు.

కమీషనర్, పరివారంతో గదిలోకి వచ్చాడు.

"పోలీసువాళ్ళు అవసరం తీరిన అయిదు నిమిషాలకు వస్తారన్నమాట" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"ట్రాఫిక్ కానిస్టేబుల్ మీరు చెప్పిన విషయం చెప్పగానే రైల్వేగైడ్ నెం.9 తెప్పించి డీకోడ్ చేశాము. ఈ ఇంటి అడ్రెసు తెలిసింది. వెంటనే వచ్చాము. మేము గేటు దగ్గరకి రాగానే లోపల్నుంచి ముగ్గురు మనుష్యులు పరిగెత్తుకు వస్తూండడం చూసి వాళ్ళను పట్టుకున్నాము" అన్నాడు కమీషనర్.

"గుడ్! కాని ఈ ముఠా నాయకులు మనకు చిక్కకుండా వెళ్ళిపోయారు."

"ఏమయ్యారు?" అడిగాడు కమీషనర్.

"వాయిజ్ - అడుగో, అతన్ని నేనే షూట్ చేశాను. ఈమె అతని కూతురు సెఫియా, ఆటకట్టిందని తెలియగానే ఆత్మహత్య చేసుకుంది. మొహం నల్లపడ్డది చూడండి విషం మింగిందన్న మాట. అదుగో ఆ వేలి ఉంగరం చూడండి. అందులో దాచింది విషం" అంటూ యుగంధర్ సెఫియా కనురెప్పలు మూసేశాడు.

## 14

యుగంధర్ గదిలోకి రాగానే హోం మినిష్టర్ సిన్హా సంతోషంతో లేచి నిలుచున్నాడు.

"ఆ పత్రాలు ఎలా దొరికాయో ఇప్పుడు చెబుతాను. 'మీరు యుగంధరే అయితే ఆ కాగితాలు ఎక్కడుందీ ఆలోచించి మీరే తెలుసుకోవచ్చు' అని నెం.888 నాతో అనగానే నేను తీవ్రంగా ఆలోచించాను. నెం.888 బొంబాయిలో విమానం దిగిన తరవాత ఆ కాగితాలు దాచేందుకు అతనికి గల అవకాశాల గురించి ఆలోచించాను. అతను టెలిఫోను బూత్ లోకి వెళ్ళినపుడూ, నీళ్ళ గదిలోకి వెళ్ళినపుడూ మాత్రమే అతన్ని ఎవరూ చూసే అవకాశం లేదు. కనక అక్కడే ఎక్కడో దాచి ఉంటాడని గ్రహించాను. ఏర్ పోర్టు మేనేజర్‌తో ముందుగా మాట్లాడి ఏర్‌పోర్ట్ ఊడ్చే మనిషి వేషంలో వెళ్ళి ఉద్యోగంలో చేరాను. టెలిఫోను బూత్ ఊడ్చేందుకు వెళ్ళినపుడు అక్కడ వెదికాను. కాగితాలు అక్కడ దాచిన జాడలు లేవు. తరవాత నీళ్ళ గది ఊడ్వడానికి వెళ్ళాను. ప్రతి చోటూ చాలా జాగ్రత్తగా పరీక్షించాను. టెలిఫోను తీగమీద ఉన్న బద్దెలాగి చూశాను. కవరు కనిపించింది" అన్నాడు.

"రాత్రి కమీషనర్ టెలిఫోను చేసి చెప్పేంతవరకూ నా ఆదుర్దా చెప్పలేను యుగంధర్! మీరు సాధించిన ఈ విజయం అమోఘమైంది" అన్నాడు సిన్హా యుగంధర్ రెండు చేతులూ పట్టుకుని.

యుగంధర్ నవ్వుతూ "888 ఆస్పత్రిలో ఉన్నాడు. త్వరలో తేరుకుంటాడు. ఈ కాగితాలు శత్రువుల చేతికి చిక్కకుండా ఉండటానికి అతనే చాలావరకూ కారకుడు" అన్నాడు.

"మీకు పొగడ్త ఇష్టంలేదు. అందుకే మీరు సాధించిన ఈ మహత్కార్యానికి మిమ్మల్ని శ్లాఘించనియ్యరు. యుగంధర్! ప్రభుత్వం మీరు చేసిన సేవ ఎన్నడూ మరువదు. ప్రభుత్వమే కాదు, భారత ప్రజే మరువదు. యుగంధర్ హోం మినిష్టరు మాటలకు అడ్డువచ్చాడు. "

"దయచేసి నాకటువంటిదేమీ వద్దు. నేను అపరాధ పరిశోధకుణ్ణి. అపరాధుల్ని పట్టుకోవడం నా వృత్తి. అపాయాలను ఎదుర్కోవడం నా వృత్తిలోనే ఉంది. కనుక నా కటువంటి బిరుదులేవీ వద్దు. నన్ను సామాన్య అపరాధ పరిశోధకుడిగా ఉండనీయండి."

"కాని -"

"నా పని నేను చేశాను. జయించాను. ఆ తృప్తి, ఆ సంతోషం నాకు చాలు. అంతకన్నా ఏ బహుమతీ అవసరంలేదు" అన్నాడు యుగంధర్.

మంత్రి యుగంధర్ని ఆశ్చర్యంతో చూశాడు. బిరుదుల కోసం ఢిల్లీ వచ్చి ప్రయత్నాలు చేసే పెద్ద మనుష్యులను తలుచుకున్నాడు.

"ప్రతి భారతీయుడూ మీలా తనపని తను చేయడం తన ధర్మం అని తెలిస్తే దేశం ఒక సంవత్సరంలో మారిపోతుంది. వంద సంవత్సరాలలో సాధించేది ఒక సంవత్సరంలో సాధించగలుగుతాము" అన్నాడు.

*అయిపోయింది*

కౌముది